శుక్రవారం
23•3•2018
కరీంనగర్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 265
• పేజీలు : 16 + (20/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE



PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

గౌడన్నలకు భరోసా

గీత కార్మికులకు వరాలు కురిపించిన సీఎం కేసీఆర్



గురువారం సాయంత్రం తెలంగాణ భవన్‌లో సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న గీత కార్మికులు. చిత్రంలో మంత్రి పద్మారావు గౌడ్, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, వివేకానంద గౌడ్, గువ్వల బాలరాజు తదితరులు.

- చెట్ల పన్ను పూర్తిగా రద్దు
- పన్ను బకాయిలూ మాఫీ
- లైసెన్స్ రెన్యూవల్ గడువు పదేండ్లకు పెంపు
- టీఎఫ్టీ కార్మికులకూ పెన్షన్
- హైదరాబాద్‌లో ఐదెకరాల్లో.. ఐదు కోట్లతో గౌడ భవనం
- గీతకార్మికుల పరిహారాన్ని రూ. 5 లక్షలకు పెంచాం
- 1.70 కోట్ల ఈత, ఖర్జూర మొక్కలను నాటాం
- గౌడ కులస్థుల సంక్షేమంపై అసెంబ్లీలో సీఎం కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

అనునిత్యం ప్రమాదాల మధ్య జీవనాన్ని గడుపుతూ.. కులవృత్తిని నమ్ముకొని జీవిస్తున్న గీతకార్మికులపై ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు వరాల వర్షం కురిపించారు. చెట్ల పన్ను బకాయిలను మాఫీ చేయడమే కాకుండా.. ఇకపై చెట్లపన్నును పూర్తిగా రద్దు చేస్తున్నామని ఆయన గురువారం శాసనసభలో ప్రకటించారు. లైసెన్స్ రెన్యూవల్ గడువును ఐదేండ్ల నుంచి పదేండ్లకు పెంచుతునట్టు తెలిపారు. ఇప్పటివరకు కల్లు గీత సొసైటీ సభ్యులకు మాత్రమే ఇస్తున్న పెన్షన్‌ను ఇకపై టీఎఫ్టీ (ట్రీ ఫర్ ట్యాపర్) కార్మికులకు కూడా వర్తింపజేస్తున్నట్టు వివరించారు. గౌడ కులస్థుల సంక్షేమంకోసం రాజధాని హైదరాబాద్‌లో ఐదెకరాల్లో సంక్షేమ భవన నిర్మాణానికి రూ. ఐదు కోట్లు మంజూరుచేస్తున్నట్టు ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడించారు. ఇప్పటివరకు 1.70 కోట్ల ఈత, ఖర్జూర మొక్కలు

మిగతా 2వ పేజీలో



శంషాబాద్ ఎయిర్‌పోర్టు విస్తరణ పనులకు
నేడు శంకుస్థాపన

ఆర్జీఐఏ పదేండ్ల వేడుకలకు హాజరుకానున్న సీఎం కేసీఆర్ 6

ఎయిర్‌పోర్ట్ పదేండ్ల ప్రస్థానంపై ప్రత్యేక కథనం

టోటెమ్ పాట
1394 కోట్లు

14 బ్యాంకులకు ఇన్‌ఫ్రా కంపెనీ టోకరా

పరారీలో ప్రమోటర్లు 7

హైదరాబాద్‌కు
సర్వీస్ నౌ

ఐటీ రంగంలో తెలంగాణ అభివృద్ధిపై సంస్థ సీఈవో జాన్ డోనామో ప్రశంసలు 10

తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు 2
భారీగా తగ్గాయి

పార్లమెంట్‌లో కేంద్ర వ్యవసాయ మంత్రి వెల్లడి

సత్ఫలితాలిస్తున్న సీఎం కేసీఆర్ నిర్ణయాలు



బ్రహ్మోస్ సక్సెస్

లక్ష్యాన్ని ఛేదించిన సూపర్‌సోనిక్ క్రూయిజ్ మిసైల్ 5

నేడు రాజ్యసభ ఎన్నికలు
టీఆర్‌ఎస్ గెలుపు ఖాయం! 8





గురువారం శాసనమండలిలో గౌడ సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రకటించిన నేపథ్యంలో చైర్మన్ స్వామిగౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందలు తెలుపుతున్న టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, పార్టీ రాజ్యసభ అభ్యర్థి జోగినిపల్లి సంతోష్‌కుమార్, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి. చిత్రంలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు కూడా ఉన్నారు.



గౌడ కార్మికుల కోసం అనేక పథకాలు ప్రకటించిన నేపథ్యంలో మంత్రులు ఈటల రాజేందర్, చందూలాల్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశం గౌడ్, టీజేఎఫ్ ఉపాధ్యక్షుడు పల్లె రవికుమార్, టీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థి బండా ప్రకాశ్



అసెంబ్లీలో గౌడ సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రకటించిన నేపథ్యంలో మండలి చైర్మన్ స్వామి గౌడ్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న ఎమ్మెల్సీ వీ గంగాధర్‌గౌడ్. చిత్రంలో ఎమ్మెల్సీలు ఫరీదుద్దీన్, కర్నె ప్రభాకర్, ఫరూఖ్ హుస్సేన్, పూల రవీందర్, శంభీపూర్ రాజు తదితరులు ఉన్నారు.

డిగ్రీ గెస్ట్ లెక్చరర్ వేతనం రూ.21,600

పీరియడ్‌కు రూ.300 గౌరవ వేతనం

విద్యాశాఖ జీవో జారీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు రాష్ట్ర ప్రభుత్వం వరాలు ప్రకటించింది. ఇప్పటివరకు ప్రతి పీరియడ్‌కు వారికి గౌరవ వేతనం కింద రూ.100 చెల్లిస్తుండగా దానిని రూ.300లకు పెంచింది. ఈ మేరకు గురువారం విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య జీవో జారీ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్న 184 గెస్ట్ ఫ్యాకల్టీకి ఇకనుంచి ప్రతినెల రూ.21,600 కచ్చిత వేతనం అందనున్నది. ప్రతినెలలో గరిష్ఠంగా వారు 72 పీరియడ్‌లను తీసుకోవాల్సి ఉంటుందని జీవో పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయంపై గెస్ట్ లెక్చరర్లంతా సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ప్రభుత్వ డిగ్రీ గెజిటెడ్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు.



వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో హంస వాహనంపై ఊరేగుతున్న స్వామివారు


వేములాడలో హంస వాహనంపై స్వామివారు

వేములవాడ కల్చరల్: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో గురువారం రాత్రి శ్రీ పార్వతీ రాజరాజేశ్వరస్వామి, శ్రీలక్ష్మి అనంతపద్మనాభ స్వాములను హంస వాహనంపై ఊరేగించారు. శ్రీరామనవమి నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు ఉదయం రాజన్నకు శ్రీ సీతారామచంద్రస్వామికి మహాన్యాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరివార, అనుబంధ దేవతలకు అభిషేకాలు నిర్వహించారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.21 గంటలకు



సూర్యాస్తమయం: 6.24 గంటలకు

విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం షష్ఠి మధ్యాహ్నం 12.05 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం: రోహిణి సాయంత్రం 4.58 వరకు తదుపరి మృగశిర, అమృతఘడియలు: తె. 3.37 నుంచి 5.13 వరకు, రాహుకాలం: ఉదయం 10.52 నుంచి మధ్యాహ్నం 12.23 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.46 నుంచి 9.34 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.47 నుంచి 1.35 వరకు, వర్జ్యం: ఉదయం 9.20 నుంచి 10.56 వరకు, తిరిగి రాత్రి 10.16 నుంచి 11.52 వరకు.

లోకం పోకడ



గౌడన్నలకు భరోసా

మొదటిపేజీ తరువాయి...

నాటామని.. వీటిని మరింతగా విస్తరిస్తామని తెలిపారు. వివరాలు ఆయన మాటల్లోనే..

తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసేందుకు ప్రభుత్వం బహుముఖాలుగా కృషిచేస్తున్నది. ప్రధానంగా వ్యవసాయం, నీటి వనరుల అభివృద్ధి, కులవృత్తులకు ప్రోత్సాహం వంటి కార్యక్రమాలను అమలుచేస్తున్నది. గ్రామీణ వనరులను ఆశ్రయించి ఎన్నో కులాలకు బతుకుతెరువు లభిస్తున్నది. వారి బతుకుతెరువులను కాపాడటం, మెరుగుపర్చడం కోసం అనేక పథకాలను అమలుచేస్తున్నం. కులవృత్తిని నమ్ముకొని జీవిస్తున్నవారిలో గౌడ సామాజిక వర్గం ప్రధానమైంది. కల్లుగీత వృత్తిగా జీవించే గౌడ కులస్థులు సమైక్య రాష్ట్రంలో తీవ్ర నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురయ్యారు. తెలంగాణ గ్రామీణ జీవితంపై అవగాహన, పట్టింపులేని సమైక్య పాలకుల చర్యలతో కల్లుగీత వృత్తి మనుగడే ప్రశ్నార్థకంగా మారింది.

సమైక్యరాష్ట్రంలో కల్లోలంలో కల్లుగీత వృత్తి

సమైక్యరాష్ట్రంలో ప్రభుత్వం నుంచి గీత కార్మికులకు ఎలాంటి అండదండ లభించలేదు. కనీసం వారి మానాన వారు బతికే అవకాశాన్ని కూడా లేకుండా చేశారు. లిక్కర్ లాబీల ప్రలోభాలకు, ఒత్తిడికి తలొగ్గి, హైదరాబాద్‌లో కల్లుదుకాణాలను నిర్దాక్షిణ్యంగా మూసేశారు. సమైక్య పాలకుల ఈ దుర్మార్గాన్ని తెలంగాణ నాయకులు అడ్డుకోకపోగా, వంత పాడటం దౌర్భాగ్యం. మరోవైపు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గుడుంబా మహమ్మారి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతుంటే వీళ్లే కండ్లప్పగించి వేడుకచూశారు. సమైక్య పాలకులు సృష్టించిన ఈ సామాజిక విధ్వంసంవల్ల అటు ప్రజల ఆరోగ్యం పాడైపోయింది. ఇటు కల్లుగీత వృత్తి కల్లోలంలో పడింది. తెలంగాణ ఉద్యమ సందర్భంలో గౌడ కులస్థులకు జరుగుతున్న అన్యాయం గురించి పదేపదే ప్రస్తావించాం. తెలంగాణ ఏర్పడి, మేము అధికారంలోకి వస్తే మూసివేసిన కల్లు దుకాణాలు తెరిపిస్తామని ఉద్యమనేతగా ఆనాడు నాకు నేనుగా ప్రకటించాను. ప్రజా ఉద్యమం ఫలించి, తెలంగాణ ఏర్పడింది. ప్రకటించిన విధంగానే హైదరాబాద్‌లో కల్లు దుకాణాలు తిరిగి తెరిపించాము.

లైసెన్స్ గడువు ఐదేండ్ల నుంచి పదేండ్లకు పెంపు



గౌడ కార్మికులకు వరాలు ప్రకటించిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు గురువారం అసెంబ్లీ చాంబర్‌లో పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు చెప్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ వీ గంగాధర్‌గౌడ్. చిత్రంలో మంత్రులు పద్మారావు, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, వివేకానంద్‌గౌడ్, కొండా సురేఖ, నాయకులు ఏనుగు రవీందర్‌రెడ్డి, కాలె యాదయ్య తదితరులు కూడా ఉన్నారు.

ఈరోజు మీ అందరి సమక్షంలో గౌడ కులస్థుల సంక్షేమంకోసం ప్రభుత్వం తీసుకొన్న మరికొన్ని మానవీయ నిర్ణయాలను ప్రకటిస్తున్నాను. గీత కార్మికులకిచ్చే పెన్షన్‌ను రూ.200 నుంచి రూ.1000కు పెంచాం. ఇప్పటివరకు కల్లుగీత సొసైటీ సభ్యులకు మాత్రమే పెన్షన్ లభిస్తున్నది. ఇక నుంచి టీఎఫ్టీ (ట్రీ ఫర్ ట్యాపర్) కార్మికులకు కూడా పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకొన్నది. ఈ నిర్ణయంవల్ల రాష్ట్రంలోని 30 వేల కుటుంబాలకు ఆసరా లభిస్తుంది. టీఎఫ్టీ నుంచి టీసీఎస్ (టాడీ కోఆపరేటివ్ సొసైటీ) లోకి మారాలని దరఖాస్తు చేసుకున్నవారికి పది రోజుల్లో బదలాయింపు జరపాలని అధికారులను ఆదేశించాం. లైసెన్స్‌ల రెన్యువల్ గడువును ఐదేండ్ల నుంచి పదేండ్లకు పెంచుతున్నాం. తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా ఈత, ఖర్జూర మొక్కలను పెద్ద ఎత్తున నాటే కార్యక్రమం చేపట్టాం. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కోటి 70 లక్షల మొక్కలు నాటాం. ఎక్సైజ్, అటవీశాఖల సమన్వయంతో రాబోయే రోజుల్లో చెరువు కట్టల మీద, చెరువు శిఖం వెంబడి, వాగుల వెంట, వొర్రెల వెంట, నదీ ప్రవాహానికి ఇరువైపులా ఈత, ఖర్జూర మొక్కలను విరివిగా నాటే కార్యక్రమం కొనసాగుతుంది.

చెట్ల పన్ను బకాయిలు పూర్తిగా మాఫీ చేస్తున్నాం..

వీటన్నింటితోపాటు గౌడ కులస్థులకు మరొక తీపి కబురును ఈరోజు ప్రభుత్వం ప్రకటిస్తున్నది. ఇప్పటివరకు గీత కార్మికులకు ఉన్న చెట్ల పన్ను బకాయిలను పూర్తిగా మాఫీచేస్తున్నాం. అంతేకాకుండా ఈనాటి నుంచి తెలంగాణ రాష్ట్రంలో చెట్లపై పన్ను వేసే విధానాన్నే రద్దు చేస్తున్నాం. దీనివల్ల ప్రభుత్వంపై ఏటా రూ. 16 కోట్ల భారం పడుతున్నా, గీత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని చెట్ల పన్నును పూర్తిగా రద్దుచేస్తున్నాం. హైదరాబాద్ నగరంలో గౌడ కులస్థుల అస్తిత్వాన్ని సమున్నతంగా చాటే విధంగా రాష్ట్ర స్థాయి గౌడ భవనం నిర్మాణం కోసం 5 ఎకరాల భూమిని, రూ.5 కోట్లను మంజూరు చేస్తున్నాం. ఈ భవనం గౌడ కులస్థుల సామాజిక, ఆర్థిక, రాజకీయ వికాస కేంద్రంగా వెలుగొందాలని ఆశిస్తున్నాను' అని సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించారు.

పరిహారాన్ని రూ.5 లక్షలకు పెంచాం

గౌడన్నలకు జరిగిన అన్యాయాన్ని పరిష్కరించాం. వారి సంక్షేమానికి మరెన్నో చర్యలు తీసుకున్నాం. కల్లు గీసే సమయంలో చెట్టుపై నుంచి పడి మరణించినా.. లేదా శాశ్వత అంగవైకల్యం పొందినా గీత కార్మికులకు పరిహారం చెల్లించడంలో గత ప్రభుత్వం తీవ్ర జాప్యంచేసింది. తెలంగాణ ఏర్పడే నాటికున్న మూడేండ్ల బకాయిలు రూ.6.38 కోట్లు మేము అధికారంలోకి రాగానే, ఏకకాలంలో చెల్లించాం. అప్పటిదాకా అరకొరగా ఇస్తున్న పరిహారాన్ని మానవీయ దృక్పథంతో పెంచినం. గతంలో చెట్టుపై నుంచి పడి మరణించినవారికి రూ.2లక్షలు, అంగవైకల్యంపాలైనవారికి రూ.50 వేలు మాత్రమే ఇచ్చేవారు. తెలంగాణ ప్రభుత్వం ప్రమాదవశాత్తు మరణించిన, శాశ్వత అంగవైకల్యం పొందిన గీత కార్మికులకు ఇచ్చే పరిహారాన్ని రూ.5 లక్షలకు పెంచింది.

గీత కార్మికులు, గౌడ వృత్తిదారులు ఎన్నోరోజులుగా ఎదురుచూస్తున్న అనేక అంశాలపై సీఎం స్పష్టతనిచ్చారు. దీనిపై సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు. సీఎం కేసీఆర్ నిర్ణయాలతో గీత వృత్తిదారుల్లో కొత్త ఆత్మస్థైర్యం వస్తుంది.

- బూర నర్సయ్యగౌడ్, టీఆర్ఎస్ ఎంపీ

గౌడన్నలకు కేసీఆర్ భరోసానిచ్చారు. వెనుకబడిన వృత్తులను కాపాడుకుంటామని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. సబ్బండ వర్ణాలను ఆదుకుంటూ, వారి వృత్తులకు జీవంపోస్తూ బంగారు తెలంగాణ దిశగా సాగుతున్నారు.

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, టీఆర్ఎస్

గౌడకులస్థులను ఆర్థికంగా ఆదుకుంటున్న గొప్పవ్యక్తి సీఎం కేసీఆర్. సీఎం నిర్ణయంపై గౌడన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్, టీఆర్ఎస్

30 లక్షలకు పైగా ఉన్న గౌడ కులస్థులను ఆదుకున్న సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు. చెట్లపై పన్ను వేసే విధానాన్నే రద్దు చేయడంవల్ల ప్రభుత్వంపై భారం పడుతున్నా, గీతకార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవడం సీఎం కేసీఆర్ గొప్పదనం.

- ఎమ్మెల్యేలు వివేకానంద, ప్రకాశ్‌గౌడ్

తాటి, ఈత చెట్లకు విధించే పన్నును రద్దు చేస్తున్నట్టు ప్రకటించిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు. హైదరాబాద్‌లో గౌడ భవనం నిర్మించేందుకు రూ.5 కోట్లు కేటాయించడం వంటి నిర్ణయాలుప్రకటించిన సీఎంకు రుణపడి ఉంటాం.

- కిశోర్‌గౌడ్, టీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు

గీత వృత్తి వారి సంక్షేమానికి అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కోటికిపైగా తాటి, ఈత మొక్కలను నాటి గీత వృత్తిని ప్రోత్సహించారు. సీఎం కేసీఆర్‌కు గౌడ కులస్థులు ఎప్పటికీ రుణపడి ఉంటారు.

- అయిలి వెంకన్నగౌడ్, గీత కార్మిక సంఘాల రాష్ట్ర నాయకుడు

లోక్‌సభలో ఆగని సమరం

- రిజర్వేషన్ల అంశంపై కొనసాగిన టీఆర్ఎస్ ఎంపీల ఆందోళన
- నిమిషాల్లోనే వాయిదా
- అద్వానీని కలిసిన టీఆర్ఎస్ ఎంపీలు: మద్దతు పలికిన బీజేపీ అగ్రనేత
- కేంద్రం కాలక్షేపం చేస్తున్నది: బీ వినోద్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రిజర్వేషన్లు కల్పించుకొనే అధికారం రాష్ట్రాలకే ఉండాలన్న డిమాండ్‌పై టీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్ ఉభయసభల్లో చేస్తున్న ఆందోళన గురువారం కూడా కొనసాగింది. లోక్‌సభ ప్రారంభమైన కొద్ది సెకన్ల వ్యవధిలోనే టీఆర్ఎస్ ఎంపీలు ప్లకార్డులతో నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. స్పీకర్ సుమి త్రా మహజన్ వారించినా ఎంపీలు పట్టు వీడలేదు. దీంతో మధ్యా హ్నం 12 గంటలకు సభను స్పీకర్ వాయిదావేశారు. సభ తిరిగి ప్రారంభమయ్యాక కూడా పరిస్థితి మారలేదు. ఎంపీలకు సర్దిచెప్పడానికి స్పీకర్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్ చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో లోక్‌సభ శుక్రవారానికి వాయిదాపడింది. రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది.

అద్వానీని కలిసిన టీఆర్ఎస్ ఎంపీలు

పార్లమెంటులో టీఆర్ఎస్ ఎంపీలు ఆందోళన చేస్తున్న సమయంలో అక్కడే ఉన్న బీజేపీ అగ్రనేత ఎల్‌కే అద్వానీ ఎంపీ వినోద్, జితేందర్‌రెడ్డి తదితరులను ఆరా తీశారు. ఉమ్మడి రాష్ట్రంలో గిరిజనులకు ఆరుశాతం రిజర్వేషన్ ఉండేదని, రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో గిరిజనుల సంఖ్య 9 శాతం ఉన్నట్టు తేలిందని అద్వానీకి ఎంపీ వినోద్ వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాల శాతం పెరిగినందువల్లే రాష్ట్రానికి రిజర్వేషన్ల పెంపు అవకాశం ఇవ్వాలని తాము కోరుతున్నామని తెలిపారు. టీఆర్ఎస్ ఎంపీల ఆందోళనలో అర్థమున్నదని, రిజర్వేషన్లను పెంచడం న్యాయబద్ధమేనని అద్వానీ అన్నారు. ఈ విషయంపై తాను స్పీకర్‌తో మాట్లాడుతానంటూ.. సుమిత్రామహజన్ చాంబర్‌కి వెళ్లి ఆమెతో చర్చించారు. అనంతరం టీఆర్ఎస్ ఎంపీల వద్దకు వచ్చి తాను మాట్లాడానని, పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నట్టు తెలిపారు.

కేంద్రం కాలక్షేపం చేస్తున్నది: ఎంపీ వినోద్ కుమార్

రిజర్వేషన్ల అంశంపై కేంద్రం ఉద్దేశపూర్వకంగానే కాలయాపన చేస్తున్నదని ఎంపీ వినోద్‌కుమార్ విమర్శించారు. ఇప్పటికే దీనిపై ప్రధాని మోదీ, మంత్రులు జైట్లీ, రాజ్‌నాథ్‌లను కలిశామని, సీనియర్ నేత అద్వానీ కూడా తమ డిమాండ్‌ను సమర్థించారని చెప్పారు.గిరిజనులు, ఎస్సీలు, ఎస్టీలు, బడుగు, బలహీనవర్గాల కోసమే పార్లమెంట్‌లో పోరాడుతున్నామని ఎంపీ బాల్క సుమన్ తెలిపారు. రిజర్వేషన్లు రాజ్యాంగ హక్కు అని, దీనిపై బీజేపీ తన వైఖరి స్పష్టంచేయాలని ఎంపీ సీతారాంనాయక్ డిమాండ్ చేశారు.



తెలంగాణలో రిజర్వేషన్ల అంశాన్ని పార్లమెంట్‌లో అద్వానీకి వివరిస్తున్న టీఆర్ఎస్ ఎంపీలు

భూగర్భ బొగ్గు గనుల్లో మహిళలకు అవకాశమివ్వండి

- కేంద్రమంత్రి గంగ్వార్‌ను కోరిన ఎంపీ వినోద్
- సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భూగర్భ బొగ్గుగనుల్లో ఉద్యోగులుగా మహిళలకు అవకాశాలు కల్పించాలని కేంద్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్‌కుమార్ గంగ్వార్‌ను కరీంనగర్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ కోరారు. గురువారం ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. అండర్‌గ్రౌండ్ మైనింగ్ విభాగంలో మహిళలను ఉద్యోగులుగా చేర్చుకోవడానికి మైనింగ్ చట్టాలు అనుమతించడంలేదని వినోద్‌కుమార్ మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మైనింగ్‌లో డిగ్రీ, డిప్లొమా కోర్సులు చేయడానికి అమ్మాయిలకు అడ్మిషన్లు కల్పిస్తున్నారని, కానీ వారిని భూగర్భ గనుల్లో పనిచేయడానికి అనుమతించడంలేదని అన్నారు. ఎంపీ వినోద్‌కుమార్ వినతిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. కార్మికశాఖ అధికారులతో చర్చించారు. మహిళలు భూగర్భ గనుల్లో పనిచేసేందుకు వీలుగా చట్టాన్ని సవరించాలని కేంద్ర మంత్రి అధికారులకు సూచించారు. రాబోయే వర్షాకాల సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టే విధంగా చూడాలని ఆదేశాలు జారీచేశారు.



ప్రవచనం చేస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర్‌రావు. కార్యక్రమానికి హాజరైన సీఎం కేసీఆర్ సతీమణి శోభ, ఎంపీ కల్వకుంట్ల కవిత

దేవతలకు సాధ్యం కానిది మానవజన్మ

చాగంటి కోటేశ్వర్‌రావు

నిజామాబాద్ కల్చరల్: శ్రీరామ నవమి సందర్భంగా గురువారం నిజామాబాద్ నగరంలోని కలెక్టరేట్ మైదానంలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర్‌రావు ప్రవచనం చేశారు. సీఎం కేసీఆర్ సతీమణి శోభ, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత, శాంతాబయోటెక్ చైర్మన్ వరప్రసాద్‌రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. వేలాది మంది భక్తులు హాజరై ప్రవచనాలు విన్నారు. ముందుగా ఎంపీ కవిత దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి చాగంటి కోటేశ్వర్‌రావుకు పూలమాల వేసి ఘనంగా సన్మానించి ఆశ్వీరాదం పొందారు. ఈ సందర్భంగా చాగంటి కోటేశ్వర్‌రావు ప్రవచిస్తూ.. దేవతలకు సాధ్యం కాని జన్మ మానవ జన్మ అని అన్నారు. మనిషి జన్మించిన తర్వాత వారి నడవడిక రాముని నడవడిక కావాలని చెప్పారు. ఏ సమయంలో ఏది ఆచరించాలో, ఏ కాలంలో ఏం చేయాలో దానిని తెలుసుకునేదే ధర్మమని పేర్కొన్నారు. రామాయణంలో ఎక్కడ చూసినా బాధ్యత అనేది కనబడదని కర్తవ్యం మాత్రమే కనబడుతున్నదన్నారు. రామాయణం ధర్మశాస్త్రమని, పొగడ్తలు మంచివి, చెడ్డవిగా ఉంటాయని తెలిపారు. ఎక్కువగా పొగిడితే అది చెడుకు దారి తీస్తుందని చాగంటి పేర్కొన్నారు.

కొత్తగూడెంలో వర్షం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: జిల్లా కేంద్రమైన కొత్తగూడెంతోపాటు పరిసర ప్రాంతాల్లో గురువారం సాయంత్రం వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. మోస్తరు నుంచి సాధారణ స్థాయిలో వర్షం కురువడంతో మండుతున్న ఎండలతో ప్రజలు ఉపశమనం పొందారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో అక్కడక్కడా చెదురుముదురు జల్లులు కురిశాయి.

నేడు ఎస్పీఎంపై ముంబైలో కీలక సమావేశం

కాగజ్‌నగర్, నమస్తే తెలంగాణ: ఎస్పీఎంపై ఐడీబీఐ, జేకే కంపెనీ ప్రతినిధులు, మంత్రివర్గ ఉపసంఘం, సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సమక్షంలో ముంబైలో శుక్రవారం జరిగే సమావేశం కీలకంగా మారనున్నది. బ్యాంకు రుణాలు, ప్రైవేట్ అప్పులు, కార్మికుల వేతనాలు వంటి ఆర్థికపరమైన అంశాలపై చర్చలు జరుగనున్నాయి. చర్చలను సత్వరమే పూర్తి చేయాలని ప్రభుత్వం ఐడీబీఐ చైర్మన్‌కు లేఖ రాసిన నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహిస్తున్నారు.

తెలంగాణలో భారీగా తగ్గిన రైతు ఆత్మహత్యలు

- పార్లమెంట్‌లో వెల్లడించిన కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి రాధామోహన్‌సింగ్
- రైతు ఆత్మహత్యలపై రాష్ట్రాలవారీగా లెక్కల వెల్లడి
- బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పెరుగుదల
- అన్నదాతకు అండగా తెలంగాణ సర్కార్
- సత్ఫలితాలిస్తున్న సీఎం కేసీఆర్ నిర్ణయాలు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి రాధామోహన్ సింగ్ పార్లమెంట్ సాక్షిగా ప్రకటించారు. రైతు ఆత్మహత్యలపై ఇటీవల సభ్యు ల ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ దేశవ్యాప్తంగా రైతుల పరిస్థితిని రాష్ట్రాలవారీగా వివరించారు. తెలంగాణలో 2015 లో 1400 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే 2016లో ఆ సంఖ్య 645కు పడిపోయిందని, ఇది 53.9 శాతం తగ్గుదల అని మంత్రి తన సమాధానంలో పేర్కొన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న మహారాష్ట్రలో 2015లో 1491 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోగా, 2016 లో 145.4 శాతం ఎక్కువగా ఆ సంఖ్య 3,661కి పెరిగింది. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటకలో 2015లో 1569 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే 2016లో 32.5 శాతం ఎక్కువగా 2079 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు.

తెలంగాణలో రైతులు, వ్యవసాయ కార్మికుల్లోనూ పెరుగుతున్న భరోసా

వ్యవసాయ కార్మికుల ఆత్మహత్యల సంఖ్య తెలంగాణలో భారీగా తగ్గింది. 2014లో 449 మంది ఆత్మహత్యలు చేసుకుంటే 2015లో 42, 2016లో 13 మంది బలవన్మరణానికి పాల్పడ్డారు. రైతులు, వ్యవసాయ కార్మికుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గడానికి ప్రధానంగా సీఎం కేసీఆర్ రైతుల కష్టాలను, వాళ్ల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఎన్నో అద్భుతమైన కార్యక్రమాలకు అంకురార్పణ చేయడమేనని స్పష్టమవుతున్నది. రూ. లక్ష కోట్లతో సాగునీటి ప్రాజెక్టులు చేపట్టడంతోపాటు, రైతులకు ప్రతిఏటా రూ. 5 వేల కోట్లతో ఉచితంగా 24 గంటల విద్యుత్ సరఫరా అందించడంతో రైతులకు రాష్ట్రంలో భరోసా లభించింది. ఈ ఏడాది నుంచి రైతులకు పెట్టుబడి సాయం అందించడానికి రైతుబంధు పథకం కింద ఒక్కో రైతుకు ఏడాదికి రెండు పంటలకు రూ.8 వేల చొప్పున ఇవ్వడానికి ఈ బడ్జెట్‌లో రూ.12 వేల కోట్లు కేటాయించారు. తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులు ఈ రెండేళ్లలో పూర్తయి సీఎం కేసీఆర్ కలలుగంటున్న కోటి ఎకరాల సాగు సంకల్పం నెరవేరితే భవిష్యత్‌లో తెలంగాణలో రైతులు, కూలీల ఆత్మహత్యలు జరిగే అవకాశమే ఉండదు.

అజ్మీర్ దర్గాకు చాదర్‌ను పంపిన సీఎం కేసీఆర్



అజ్మీర్ దర్గాకు తెలంగాణ ప్రభుత్వం తరపున పంపించే చాదర్‌ను ముస్లిం మతపెద్దలకు అందజేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ సలీం, ఎమ్మెల్యే షకీల్, ఎమ్మెల్సీలు ఫరీదుద్దీన్, ఫారూక్ హుస్సేన్, మక్కామసీద్ ఇమామ్ ఉస్మాన్, మైనారిటీ సంక్షేమశాఖ సలహాదారు ఏకే ఖాన్, డిప్యూటీ మేయర్ ఫసియుద్దీన్ ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గా ఉర్సు ఈ నెల 19 ప్రారంభమై 27 వరకు జరుగనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తెలంగాణ ప్రభుత్వం తరపున అజ్మీర్‌కు చాదర్‌ను పంపించారు. గురువారం ప్రగతిభవన్‌లో చాదర్‌ను ఆయన పరిశీలించారు. చాదర్‌ను సీఎం కేసీఆర్ స్వయంగా మోసుకెళ్లి ముస్లిం మత పెద్దలకు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మహమూద్‌అలీ, వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ సలీం, ఎమ్మెల్యే షకీల్, ఎమ్మెల్సీలు ఫరీదుద్దీన్, ఫరూక్ హుస్సేన్, మక్కామసీద్ ఇమామ్ ఉస్మాన్ నక్షబంధి, మైనారిటీ సంక్షేమశాఖ సలహాదారు ఏకే ఖాన్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ ఫసియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల ఫారాల ఏర్పాటుకు కార్యాచరణ

ఖమ్మంలో గొర్రెల పెంపకందారుల సమావేశంలో రాజయ్య యాదవ్



ఖమ్మంలో మాట్లాడుతున్న గొర్రెలు మేకల ఫెడరేషన్ చైర్మన్ రాజయ్య యాదవ్

రఘునాథపాలెం: గొర్రెల పెంపకమే వృత్తిగా జీవిస్తున్న యాదవ-కురుమల కష్టాలను గుర్తించిన గొప్పనేత సీఎం కేసీఆర్ అని రాష్ట్ర గొర్రెల, మేకల ఫెడరేషన్ చైర్మన్ కన్నెబోయిన రాజయ్యయాదవ్ పేర్కొన్నారు. ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ సర్వసభ్య సమావేశం గురువారం ఖమ్మంలోని రామకృష్ణ ఫంక్షన్‌హాలులో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రాజయ్య యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 7.60 లక్షల మంది సొసైటీలో సభ్యులుగా ఉంటే ఇప్పటివరకు 2.50 లక్షల మందికి 75శాతం సబ్సిడీతో గొర్రెలను పంపిణీ చేశామన్నారు. ఇజ్రాయిల్, జర్మనీ దేశాల్లో మాదిరి గొర్రెల ఫారాల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. సమావేశంలో టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి అరిగెల నాగేశ్వరరావు, రాష్ట్ర కురుమ సంఘం బాధ్యుడు శంకర్, రాజేశ్వరరావు, అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకల వెంకనర్సయ్య యాదవ్, కుమారు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్న మల్లేశం పాల్గొన్నారు.

కలెక్టర్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనలు



వరంగల్ రూరల్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగ సంఘాల నేతలు

వరంగల్ రూరల్ జిల్లా ప్రతినిధి, నమస్తేతెలంగాణ: వరంగల్ రూరల్ కలెక్టర్ ముండ్రాతి హరితపై నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై గురువారం జిల్లావ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. నర్సంపేట పట్టణంలో అభివృద్ధి పనులపై ప్రణాళికలను సిద్ధం చేసేందుకు బుధవారం కలెక్టర్ హరిత స్థానిక అధికారులతో కలిసి పట్టణాన్ని సందర్శించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. దీనిపై ఎమ్మెల్యే దొంతి స్పందిస్తూ విలేకరుల సమావేశంలో అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కలెక్టరేట్లు, మండల రెవెన్యూ కార్యాలయాల ఎదుట టీఎన్జీవోస్, టీఆర్ఈఎస్‌ఏ, టీజీటీఏ, రెవెన్యూ, గెజిటెడ్ అధికారులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాలు, వీఆర్వో, వీఆర్ఏ, నాల్గోతరగతి ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఎమ్మెల్యే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. ఉమ్మడి జిల్లాలోని మరో 20 తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లాల కలెక్టర్లు, తహసీల్దార్లకు వినతిపత్రాలు సమర్పించారు.

కాలం చెల్లిన విత్తనాల పట్టివేత



పట్టుబడిన కాలంచెల్లిన విత్తనాలను చూపిస్తున్న వ్యవసాయ అధికారి నిశాంత్

జడ్చర్ల, నమస్తే తెలంగాణ : మహబూబ్‌నగర్ జిల్లా బాదేపల్లి పట్టణం సాయినగర్ కాలనీలో అక్రమంగా నిల్వ చేసి విక్రయానికి ఉంచిన కాలం చెల్లిన రూ.6.72 లక్షల విలువైన 820 విత్తన ప్యాకెట్లను విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. పక్కాసమాచారం మేరకు విజిలెన్స్ అధికారులు గురువారం బాదేపల్లి పట్టణం సాయినగర్‌లో కృష్ణారావు ఇంట్లో, రంగారావుతోటలోని ఓ వ్యాపారి ఇంటిలో మెరుపు దాడులు చేశారు. కృష్ణారావు ఇంట్లో రూ.6,72,400విలువైన కాలం చెల్లిన 820 విత్తన ప్యాకెట్లు పట్టుబడగా, శ్రీనివాస కాలనీలో నిల్వ ఉంచిన లూజు సేల్ విత్తనాలనూ పట్టుకున్నారు.

రైల్వేలో ఆంధ్ర పెత్తనం

క్రూ లాబీ సెంటర్ల ఎత్తివేత

సికింద్రాబాద్ డివిజన్‌కు రూ.8.50కోట్ల నష్టం

లోకోపైలట్లకు అక్రమంగా, అడ్డగోలుగా చెల్లింపులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని రైల్వే డివిజన్లలో ఆంధ్ర పెత్తనం కొనసాగుతున్నది. రైల్వేల్లో తెలంగాణ రాష్ట్ర ఫలాలు ఇక్కడివారికి దక్కడం లేదు. ఉద్యోగపరంగా అన్యాయం జరుగుతుండటంతోపాటు సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌కు రూ.కోట్లల్లో నష్టం వస్తున్నది. సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌లో ఉన్న క్రూ లాబీ (డిపో)సెంటర్లను అనధికారికంగా ఎత్తివేసి ఆంధ్ర పెత్తనాన్ని చెలాయిస్తూ రూ.8.50 కోట్ల ఆదాయానికి గండి కొడుతున్నారు. సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌లో కాజీపేట, డోర్నకల్, బెల్లంపల్లి, సనత్‌నగర్ వద్ద క్రూ లాబీ సెంటర్లున్నాయి. ఈ సెంటర్లలో లోకోపైలట్లు డ్యూటీలు మారుతుంటారు. ఆంధ్ర బడాబాబుల పెత్తనంతో డోర్నకల్ క్రూ లాబీ సెంటర్‌ను 2007లో అనధికారికంగా ఎత్తివేశారు. ఇక్కడ డ్యూటీలు మారే లోకోపైలట్లు విజయవాడ సెంటర్ నుంచి మారుతున్నారు.

ఇక్కడే ఉంది అసలు కథ

నిబంధల ప్రకారం 125 కి.మీ. దూరంనడిపి.. వచ్చే క్రూ లాబీ సెంటర్‌లో లోకోపైలట్లు విధులు ముగించుకోవాల్సి ఉంది. విజయవాడ నుంచి వచ్చిన లోకోపైలట్లు డోర్నకల్ క్రూ లాబీ సెంటర్‌లో విధులు ముగించుకోవాలి. కానీ, ప్రస్తుతం డోర్నకల్‌లో క్రూ లాబీ లేకపోవడంతో కాజీపేట వరకు వస్తున్నారు. రైల్వే నిబంధనల ప్రకారం 125 కి.మీ. కంటే అధికంగా ఒక్క కి.మీ. నడిపినా.. ఆ లోకోపైలట్లుకు మైలేజ్ మెయింటెనెన్స్ కింద 0 కి.మీ. నుంచి ఒక్కో కి.మీ.కు రూ.2.80 చొప్పున ప్రోత్సాహక నగదు చెల్లించాలి. విజయవాడ నుంచి వచ్చే లోకోపైలట్.. డోర్నకల్‌లోని క్రూ లాబీ సెంటర్‌లో విధులు ముగించుకుంటే అదనపు చెల్లింపులు వర్తించవు. ఎందుకంటే, విజయవాడ నుంచి డోర్నకల్ వరకు 125 కి. మీ. దూరం ఉంటుంది. డోర్నకల్ క్రూ లాబీ సెంటర్ లేకపోవడంతో విజయవాడ నుంచి కాజీపేటలో లోకోపైలట్ విధులు ముగిస్తున్నారు. ఒక్కో కి.మీ.కు రూ.2.80 చొప్పున 220 కి.మీ.కు లెక్కగట్టి చెల్లించాల్సి వస్తుంది. 200 కి.మీ. మించితే 40% చొప్పున ఎక్కువ రేటు చెల్లించాలి. అంటే ఒక్కో లోకోపైలట్‌కు రూ.616 చెల్లించాల్సి వస్తుంది. విజయవాడ నుంచి రోజుకు 50 రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. లోకోపైలట్లు నెలలో 15 రోజులు విధులు నిర్వహిస్తారు. 15 రోజుల్లో 104 గంటలు విధులు నిర్వహించాలి. అంతకంటే ఎక్కువ పనిచేస్తే ఓటీ ఇవ్వాలి. డోర్నకల్ క్రూ లాబీ సెంటర్‌ను ఎత్తేయడంతో రైల్వేకు నెలకు రూ. 8.50 కోట్లు నష్టం వస్తుంది.

కాజీపేటలో నిలిచే రైళ్ల ద్వారా రోజుకు రూ.12,75,000

డోర్నకల్ క్రూ లాబీని ఎత్తివేయడంతో కాజీపేటలో లోకోపైలట్లు డ్యూటీ మారేందుకు గంట నుంచి రెండు గంటలవరకు వేచి ఉంటారు. ఒక్కో రైలు ఇంజిన్ గంటపాటు ఆన్‌లో ఉంటే రూ.12,800 నష్టంవస్తుంది. ఈ రూట్లో రోజుకు దాదాపు 50 రైళ్లకు లోకోపైలట్లు మారే విధానం అమలవుతుంది. 50 రైళ్లకు లెక్కేస్తే రూ.12,75,000 నష్టం వస్తుంది. అదనంగా డ్యూటీ మారేందుకు కాజీపేటలో లోకోపైలట్ల చేరవేతకు ఒక జీపును వినియోగిస్తారు. దీనికి డీజిల్, డ్రైవర్, నిర్వహణ ఖర్చులు అదనంగా నష్టపోతున్నారు. దీనికోసం రోజుకు రూ.15 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ఒక్కో రైలింజిన్ గంటకు 25 యూనిట్ల విద్యుత్‌ను వినియోగిస్తుంది.

హెచ్‌ఆర్‌ఏ అదనంగా దోపిడీ


ఇండియన్ రైల్వేస్‌లో హెచ్‌ఆర్‌ఏ మూడు క్యాటగిరీలుగా ఉంది. ఏ క్యాటిగిరీ కింద మహానగరాల్లో నివాసముంటున్న వారికి 24శాతం, బీ క్యాటగిరీ కింద పట్టణాల్లో ఉండేవారికి 16 శాతం, సీ క్యాటగిరీ కింద గ్రామీణ ప్రాంతాల్లో ఉండేవారికి 8శాతం పేస్కేల్ ప్రకారంగా అందిస్తుంది. డోర్నకల్ క్రూ లాబీ మాత్రం సీ క్యాటగిరీ 8 శాతంతో గ్రామీణ ప్రాంతానికి వర్తిస్తుంది. డోర్నకల్ క్రూ లాబీని అనధికారికంగా ఎత్తేసి విజయవాడ కేంద్రంగా లోకోపైలట్లు విధులు నిర్వహిస్తుండటంతో వారు విజయవాడలోనే నివాసం ఉంటున్నట్టు రికార్డుల్లో నమోదు చేస్తూ మహానగర హెచ్‌ఆర్‌ఏను కొల్లగొడుతున్నారు.

సికింద్రాబాద్ డివిజన్‌పై బెజవాడ ఆధిపత్యం

సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌పై బెజవాడ ఆధిపత్యం కొనసాగుతున్నది. ఈ డివిజన్లో 50 లోకోపైలట్ల పోస్టులు ఖాళీగా ఉన్నా.. భర్తీ చేయకుండా.. విజయవాడ నుంచి లోకోపైలట్లను తెప్పించి రైళ్లను నడిపిస్తుంటారు. త్వరలో పదోన్నతులు ఉన్నాయని, ఆంధ్రా ఆదిపత్యంతో తెలంగాణవారికి అన్యాయం జరిగే అవకాశాలున్నాయని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

భద్రాద్రిలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

కల్యాణ శోభను సంతరించుకున్న రాములోరి కోవెల



భద్రాచలం, నమస్తే తెలంగాణ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం సన్నిధిలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు గురువారం అంకురార్పణ జరిగింది. ఉదయం ప్రాకార మండపం వద్దకు శ్రీసీతారాముల వారిని తీసుకొచ్చారు. గోదావరి నది నుంచి అర్చక స్వాములు తీర్థబిందెను తీసుకొచ్చారు. మూలమూర్తుల వద్దకు వెళ్లి మూలవిరాట్‌కు, ఉత్సవ మూర్తులకు, నిత్యకల్యాణ మూర్తులకు, పరివార దేవతలకు కంకణాలను అభిషేకించారు. దేవస్థానం ఈవో ప్రభాకర శ్రీనివాస్ వేదశాస్త్ర, ఇతిహాస పురాణాద రుత్వికులు 28 మందికి దీక్షా వస్త్రాలు సమర్పించి కంకణధారణ చేశారు. అనంతరం స్వామికి నవకలశ స్నపనం జరిపించారు. సాయంత్రం తాతగుడి సెంటర్ వరకు తిరువీధిసేవగా స్వామివారిని తీసుకెళ్లి పుట్టమట్టి పూజచేశారు. తర్వాత యాగశాల వద్దకు చేరుకొని అంకురార్పణ హోమం, అఖండదీపారాధన చేశారు. 26న సీతారాముల కల్యాణం, 27న శ్రీరామపట్టాభిషేకం నిర్వహించనున్నారు.

డిండి నుంచి కృష్ణా నీటి విడుదల



తూముల నుంచి విడుదలవుతున్న నీరు

డిండి: నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలంలోని చెరువులు నింపి ప్రజల దాహార్తి తీర్చేందుకు గురువారం నీటిపారుదల శాఖ అధికారులు డిండి ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం డిండి ప్రాజెక్టులో 1.7 టీఎంసీల నీరు నిల్వ ఉండగా మొదటిరోజు 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్టు ఎన్‌ఎస్పీ సీఈ సునీల్‌కుమార్ తెలిపారు. క్రమంగా పెంచుతూ రోజూ 200 క్యూసెక్కుల చొప్పున 10 రోజులపాటు నీటిని వదిలి నేరేడుగొమ్ము మండలంలోని చెరువులు నింపనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డీఈ రూప్లానాయక్, జేఈలు జగదీశ్వర్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటాలి

సీఎం కార్యాలయం ప్రత్యేకాధికారి ప్రియాంకవర్గీస్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రియాంక వర్గీస్

నిర్మల్ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారంలో ఉద్యమంలా మొక్కలు నాటాలని సీఎం కార్యాలయ ప్రత్యేకాధికారిణి, హరితహారం ఇన్‌చార్జి ప్రియాంకవర్గీస్ పిలుపునిచ్చారు. నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం జిల్లా అధికారులతో హరితహారంపై సమీక్షించారు. జిల్లాలో 2017-18లో నాటిన మొక్కలు, వాటిలో ఎండిపోయిన మొక్కలు, ఇంకా మిగిలిపోయిన మొక్కలు, నీటి సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు, 2018-19 యాక్షన్‌ప్లాన్‌పై అడిగి తెలుసుకున్నారు. అధికారులు సమిష్టిగా కృషి చేసి లక్ష్యాన్ని పూర్తి కార్యక్రమాన్ని విజయవంతం ఆదేశించారు. సమీక్షకు ముందు ప్రియాంకవర్గీస్ దిలావర్‌పూర్, కుంటాల మండలాల్లోని నర్సరీలను పరిశీలించారు.

డీజే బాక్స్ పడి బాలుడి మృతి

పాల్వంచ రూరల్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పాండురంగాపురం పంచాయతీ ఇల్లెందులపాడు తండాలో గురువారం డీజే సౌండ్‌బాక్స్ మీద పడటంతో భూక్య పృథ్వీరాజ్(7) అనే బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఇల్లెందులపాడు తండాలో సేవాలాల్ ఆలయ నిర్మాణానికి ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. డీజేలో పాటలు వస్తుంటే పిల్లలు, యువకులు నృత్యాలు చేస్తున్నారు. డీజే బాక్సులకు ట్రాలీలో సరిగ్గా కట్టకపోవడంతో అది వెళ్లే మార్గంలో కరెంటుతీగ అడ్డు తగిలి ట్రాలీ వెనుక నృత్యం చేస్తున్న భూక్యా పృథ్వీరాజ్ తలపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

తప్పుడు అఫిడవిట్ల డిక్లరేషన్‌పై

క్రిమినల్ కేసులు

స్థానిక సంస్థల్లో పోటీచేసే అభ్యర్థులపై నిఘా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎన్నికల్లో పోటీ చేసే ప్రజాప్రతినిధులు తప్పుడు అఫిడవిట్లు సమర్పిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రాష్ట్రఎన్నికల సంఘం నిర్ణయించింది.ఈ మేరకు స్థానిక సంస్థల్లో పోటీచేసే అభ్యర్థులిచ్చిన అఫిడవిట్ల డిక్లరేషన్లను నిశితంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీచేసింది. ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన అభ్యర్థి నామినేషన్ పత్రాల్లో తప్పుడు డిక్లరేషన్ ఇచ్చిన విషయమై ఫిర్యాదులు అందితే వాటిపై దర్యాప్తు జరిపి సంబంధిత ప్రజాప్రతినిధిపై అనర్హత వేటువేస్తారు. అయితే ఈసారి అనర్హతతో వదిలేయకుండా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ఐపీసీ177, 195 సెక్షన్ల కింద విచారించి కేసును బట్టి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో విద్యార్థులు, స్కూళ్ల డేటా సేకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పాఠశాలలు, విద్యార్థుల డేటా వంటి వివరాలను ఇకనుంచి ఆన్‌లైన్ ద్వారా స్వీకరించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఇందుకోసం విద్యాశాఖ కార్యాలయంలో ప్రత్యేక సర్వర్లను ఏర్పాటుచేశారు. ప్రతి విద్యార్థి, స్కూల్ వివరాలను అదే స్కూల్ నుంచి నేరుగా ఆన్‌లైన్ ద్వారా విద్యాశాఖకు పంపుకోవచ్చని విద్యాశాఖ డైరెక్టర్ తెలిపారు. దీనివల్ల సమయం, ఖర్చు ఆదా అవుతుందని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల వివరాలను కూడా ఆధార్‌తో అనుసంధానించడాన్ని కచ్చితంగా అమలు పరుస్తున్నామని చెప్పారు.



ఉత్తరప్రదేశ్ లోక్‌సభ ఉపఎన్నికల ఫలితాలను మేము తేలికగా తీసుకోవడం లేదు. మేము దీన్ని సూక్ష్మంగా అధ్యయనం చేస్తున్నాం. అదే సమయంలో రెండు స్థానాల తీర్పును దేశవ్యాప్త తీర్పుగా చూడవద్దు. 12 లక్షల ఓటర్లు 125 కోట్ల దేశ ప్రజల మనోభావాలకు ప్రాతినిధ్యం వహించరు.


అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు

హిట్లర్ అసత్య ప్రచార దళంలో గోబెల్స్ అనే వాడు ఉండేవాడు. ఇప్పుడు మోదీ ప్రచార దళంలో రవిశంకర్‌ప్రసాద్ అలాంటి వాడే. బీజేపీ తప్పుడు వార్తలను సృష్టించటంలో ఆరితేరింది. అతిపెద్ద డేటా చోరులే అతిఎక్కువగా గోల చేస్తున్నారు. కాంగ్రెస్‌పై ఆడిపోసుకుంటున్నారు.

రణ్‌దీప్ సుర్జేవాలా, కాంగ్రెస్ అధికార ప్రతినిధి



చరిత్రలో నేడు



1903

విమానాన్ని తయారుచేసిన రైట్ బ్రదర్స్.

1919



ఇటలీలోని మిలాన్‌లో ఫాసిస్టు ఉద్యమాన్ని ప్రారంభించిన ముస్సోలిని.



1994

టెస్ట్ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన కపిల్‌దేవ్.

విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్య విషయంలో కేంద్రప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకున్నది. ఈ క్రమంలో యూజీసీ దేశంలో కేంద్ర, రాష్ట్ర, ప్రైవేట్ యాజమాన్యాలలో ఉన్న 60 యూనివర్సిటీలకు స్వయం ప్రతిపత్తిని కల్పించింది. దేశంలో ఈ విశ్వవిద్యాలయాలు తమదైన సొంత పాఠ్య ప్రణాళికలను రూపొందించుకోవచ్చు. మొత్తమ్మీద ఇన్నాళ్లకు స్వయంప్రతిపత్తి దక్కడంతో విద్యా ప్రమాణాల్లో ప్రపంచ విశ్వవిద్యాలయాలతో పోటీ పడాల్సి ఉన్నది. ఈ దిశగా స్వయం ప్రతిపత్తి నిర్ణయం ఉపకరిస్తుందనటంలో సందేహం లేదు.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

చైనాలో పాలనాపరమైన సంస్కరణలు కొత్తకాదు. గత 30 ఏండ్ల కాలంలో అరడజన్ సార్లు పెను మార్పులు చోటుచేసుకున్నాయి. చైనా అధ్యక్షుడిగా జీ జిన్‌పింగ్ మరోసారి ఎన్నికైన తరుణంలో పాలనా, రాజ్యాంగపరమైన సంస్కరణలు వేగం పుంజుకున్నాయి. జీ చైనాకు శాశ్వత అధ్యక్షుడిగా ఎంపికైన తర్వాత ఆ దిశగా పాలనావిధానాలు, నియామకాలు జరుగుతున్నాయి. జీ జిన్‌పింగ్ న్యాయశాఖ కన్నా ఎక్కువ అధికారాలున్నా జాతీయ సూపర్ విజన్ కమిషన్ నియమించి సర్వం తన కనుసన్నల్లో నడిచేట్లు చేసుకుంటున్నాడు. ఇలాంటి అతి జాగ్రత్త చర్యలు ఎల్లకాలం ఎవరినీ సురక్షితంగా ఉంచలేవు.

ది హిందూ

బందీల విషాదాంతం

నాలుగేండ్ల కిందట ఇరాక్‌లోని మోసుల్‌లో కిడ్నాప్‌కు గురైన 39 మంది భారత భవన నిర్మాణ కార్మికుల గాథ విషాదాంతమైంది. వారిని ఐసిస్ ముష్కరులు అతి అమానుషంగా పొట్టన పెట్టుకున్నట్లు సాక్ష్యాధారాలతో సహా తెలిసివచ్చిందని భారత విదేశాంగ శాఖామంత్రి సుష్మా స్వరాజ్ రాజ్యసభలో ప్రకటించారు. ఇన్నాళ్లుగా ఎక్కడో ఒకచోట సురక్షితంగా ఉండి ఉంటారన్న భరోసాతో ఉన్న ప్రభుత్వం, కుటుంబసభ్యుల ఆశలు వమ్మయ్యాయని ఆమె బాధాతప్త హృదయంతో చేసిన ప్రకటన కలిచివేసింది. ఈ నిరుపేద కార్మికులంతా పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ర్టాలకు చెందినవారు. చాలా ఉద్రిక్త పరిస్థితులున్న ప్రాంతమైనా ఈ కార్మికులు తమ జీవనోపాధి కోసం అక్కడికి వెళ్లారంటే వారి పేదరికం ఎంత కఠినాత్మకమైనదో ఊహించుకోవచ్చు. ఇరాక్‌లోని అతిపెద్ద నగరాల్లో రెండొవది అయిన మోసుల్ 2014లో ఐసిస్ అధీనంలోకి వెళ్లింది. ఈ పరిణామాలతో అక్కడ ఉన్న ఇరాకీయులంతా నగరాన్ని విడిచి పారిపోగా, బతుకుదెరువు కోసం వెళ్లిన భారతీయ కార్మికులు నలభై మంది బంగ్లాదేశ్ కార్మికులతో కలిసి ఓ భవన నిర్మాణ కంపెనీలో పనిచేస్తున్నారు. వీరంతా ఓరోజు భోజనాలు ముగించుకుని తిరిగివస్తుండగా ఐసిస్ మూకలు కిడ్నాప్ చేశాయి. బంగ్లాదేశీయులను గుర్తించి ఎర్బిల్ నగరానికి, భారతీయులను బదోశ్‌లోని కారాగారానికి తరలించాయి. ఈ తరలించే క్రమంలోనే పంజాబ్‌కు చెందిన హర్జిత్ మాసిహ్ తాను బంగ్లాదేశీయుడిననీ, పేరు అలీ అనిచెప్పి బంగ్లాదేశీయులతో కలిసి తప్పించుకున్నాడు. ఆ తర్వాత భారతీయలను బదోశ్ గ్రామశివారులోని గుట్టలపైకి తీసుకెళ్లి కాల్చి చంపి సామూహిక ఖననం చేశారని ప్రభుత్వం తెలుసుకోగలిగింది. అయితే ఇన్నాళ్లుగా బాధితుల కుటుంబసభ్యులు, తప్పించుకొని వచ్చిన హర్జిత్ చెప్పిన విషయాలను కొట్టిపారేసిన ప్రభుత్వం ఎట్టకేలకు వారంతా అసువులుబాసారని చెప్పి చేతులు దులుపుకోవటం విషాదం, బాధ్యతారాహిత్యం.

రక్త సంబంధీకులు ఎక్కడ ఉన్నారో, ఎలా ఉన్నారో, ముష్కరుల చెరలో ఎంతటి హింస అనుభవిస్తున్నారోననే బాధతో ఆ కుటుంబాలు తల్లడిల్లాయి. తమ వారు బతికిఉన్నారో, లేదో తెలుసుకోలేక క్షోభను అనుభవించారు. ఒకరోజు కాదు ఏండ్ల తరబడి ఎదురుచూపులు మరింత గుండెకోత. ఇదే నిజం తొలినాళ్లలోనే తెలిస్తే వారు ఆ విషాదం నుంచి ఇప్పటికే తేరుకునే వారు. ఇప్పటికైనా కేంద్రం తగువిధంగా మానవీయంగా స్పందించి బాధితులను అన్నివిధాలా ఆదుకోవాలి.

నాలుగేండ్లుగా బాధితుల కుటుంబసభ్యులు కాళ్లరిగేలా ఢిల్లీ చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. బతికి ఉంటే తమ వారి జాడ చెప్పాలని, చనిపోతే శవాలైనా అందేలా చూడాలని వేడుకున్నారు. అయినా కేంద్రం కిడ్నాప్‌కు గురైన వారు చనిపోయినట్టు నమ్మదగ్గ ఆధారాలు లేవని చెబుతూవచ్చింది. జరుగుతున్న పరిణామాలు, విషయాలేమీ చెప్పకుండా సాచివేత ధోరణి అనుసరించింది. ఉగ్రమూకల చెరనుంచి తప్పించుకొని వచ్చిన మాసీ తన కండ్ల ముందే తోటివారిని ఊచకోత కోశారని చెప్పినా అతని మాటలు పట్టించుకోకపోగా, అతన్ని అనేక విధాలుగా వేధించింది. విషయాలు తెలుసుకునే పేరిట పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిప్పింది. చివరికి అతడూ జైలుపాలయ్యేలా చేసింది. హర్జిత్ మాటలు నమ్మశక్యంగా లేవని, స్పష్టమైన ఆధారాలుంటే తప్ప, చనిపోయినట్లు నిర్ధారించుకోలేమని విదేశాంగశాఖ చెబుతూ వచ్చింది. అలాగే రెండేండ్ల కిందటే ఓ ఇంగ్లిష్ దినపత్రిక కుర్దిష్ నిఘావర్గాల సమాచారం ఆధారంగా భారతీయ కార్మికులంతా చనిపోయారని ఓ వార్తా కథనం ప్రచురించింది. అప్పుడూ భారత్ కొట్టిపారేసింది. గత జూన్‌లో ఐసిస్ చెరనుంచి మోసుల్ విముక్తి అవటంతో భారతీయుల ఆచూకీ కోసం ప్రయత్నాలు ముమ్మరంచేసి రాడార్‌ల సాయంతో ఎట్టకేలకు బదోశ్ సమీపంలోని మట్టిదిబ్బల కింద భారతీయుల ఆనవాళ్లను కనుగొన్నారు. కళేబరాలతో దొరికిన వస్తువులు, పొడవాటి జుట్టు ఆధారంగా, డీఎన్ఏ పరీక్షల సాయంతో భారతీయుల ఆచూకీని ధ్రువపరిచారు.

కిడ్నాప్ ఉదంతం వెలుగులోకి వచ్చినప్పటి నుంచి కేంద్రం అనుసరించిన విధానం బాధ్యతాయుతంగా లేదు. గతంలో ఇలాంటి అనుభవాలు జరిగినప్పుడు ప్రవర్తించిన తీరుకు భిన్నంగా ఉన్నది. ఇదే ఇరాక్‌లో ఈ ఘటనకు కొన్నాళ్ల ముందు 46 మంది నర్సులను ఐసిస్ ఉగ్రవాదులు కిడ్నాప్ చేశారు. ఐఎస్ అధీనంలోని మోసుల్‌లో వెతుకటానికి అవకాశం లేదు. చర్చించటానికీ నమ్మదగిన వ్యక్తులూ దొరుకరు. అలాంటి పరిస్థితుల్లో అప్పుడు అనేకవిధాలుగా, విభిన్నమార్గాల్లో నర్సులను విడిపించేందుకు చర్యలు తీసుకున్నారు. ఐసిస్ తీవ్రవాదుల్లో సద్దాం హుస్సేన్ కాలంలోని మిలిటరీ, పోలీస్ అధికారులు, బాత్ పార్టీ ముఖ్యులు ఐసిస్‌లో కీలక స్థానాల్లో ఉన్నారని తెలుసుకొని మధ్యవర్తుల ద్వారా చర్చలుచేసి నర్సులను చెర విడిపించటంలో విజయం సాధించారు. సంప్రదాయేతర విధానాల ద్వారా విడిపించగలిగామని భారత అధికారులు చెప్పినా, ఏదేమైనా నర్సులను సురక్షితంగా విడిపించగలిగిన నేర్పరితనం భారత్ ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నది. ఇదేతరహా ప్రయత్నాలు ఇప్పుడెందుకు చేయలేకపోయారో తెలియదు. కానీ ఈ క్రమంలో బాధిత కుటుంబాల బాధ వర్ణనాతీతం. ఈ నేపథ్యంలోనే గత అక్టోబర్‌లో కుటుంబసభ్యుల నుంచి డీఎన్ఏ నమూనాలు సేకరించినప్పటినుంచి ఆ కుటుంబాలన్నీ కీడును శంకిస్తూనే ఉన్నాయి. రక్త సంబంధీకులు ఎక్కడ ఉన్నారో, ఎలా ఉన్నారో, ముష్కరుల చెరలో ఎంతటి హింస అనుభవిస్తున్నారోననే బాధతో ఆ కుటుంబాలు తల్లడిల్లాయి. తమ వారు బతికిఉన్నారో, లేదో తెలుసుకోలేక క్షోభను అనుభవించారు. ఒకరోజు కాదు ఏండ్ల తరబడి ఎదురుచూపులు మరింత గుండెకోత. ఇదే నిజం తొలినాళ్లలోనే తెలిస్తే వారు ఆ విషాదం నుంచి ఇప్పటికే తేరుకునే వారు. ఇప్పటికైనా కేంద్రం తగువిధంగా మానవీయంగా స్పందించి బాధితులను అన్నివిధాలా ఆదుకోవాలి. ఆర్థికంగా ఆదుకొని, మానసిక సాంత్వన చేకూర్చేవిధంగా భరోసా ఇవ్వాలి.

జనగళం

కేంద్రం తీరు సరికాదు

పార్లమెంట్ సమావేశాలు వాయిదా పడుతున్నాయి. దీనికి కారణం వివిధ అంశాలతో ఆయా పార్టీల ఎంపీలు నిరసన వ్యక్తంచేస్తున్నారు. అయితే వాటి పరిష్కారం కోసం కేంద్రం ప్రయత్నించాలి. అంతేగానీ సభ్యుల నిరసనను కారణంగా చూపి సభలు వాయిదా వేయడం సరికాదు. సభ్యులు లేవనెత్తుతున్న అంశాలపై చర్చ చేపట్టకుండా ప్రతిపక్షాలపై ఆరోపణలు చేస్తూ సమస్యలను దాట వేయడం సరికాదు. చట్టసభలు ఉన్నవే సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలు వెతకటానికి. అంతేకానీ ఒకరినొకరు నిందించుకుంటూ కాలం వెళ్లదీయడం కోసం కాదు. బడ్జెట్ సమావేశాల్లో వివిధ రాష్ర్టాలకు జరిగిన అన్యాయంపై కేంద్రం స్పందించడం లేదు. తమ లోపాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నది. నిజంగా సభలో గందరగోళం ఉంటే కేంద్రం వివిధ బిల్లులకు ఎలా ఆమోదం తెలుపుతున్నదో చెప్పాలి.

- ఎ.పరశురాం, హైదరాబాద్

పథకాలపై విమర్శలొద్దు

వివిధ కులాలకు ఆర్థికభరోసా కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలు ప్రకటించింది. దీంతో ఆయా కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్నవారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై రాజకీయాలకు అతీతంగా పార్టీలు వ్యవహరించాలి. ఆయా పథకాలు సమగ్రంగా అమలయ్యేలా చూడాలి. అంతేగానీ కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారిని హేళనచేసే విధంగా కొంతమంది మాట్లాడుతుండటం శోచనీయం. ఇప్పటికైనా వారు తమ వైఖరి మార్చుకోవాలి. ఉమ్మడి రాష్ట్రంలో కుల వృత్తులు ధ్వంసమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం వాటికి మళ్లీ పునరుజ్జీవం పోయడానికి ప్రయత్నిస్తున్నది. దీన్ని స్వాగతించాల్సింది పోయి విమర్శలు చేయడం తగదు. ప్రజలు ఏం కోరుకుంటున్నారో ఆలోచించకుండా కేవలం తమ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వం చేపట్టే ప్రతి పథకంపై విమర్శలు చేస్తే ప్రయోజనం ఉండదు.

- బి. రామాంజనేయులు, నల్గొండ

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

నీటిరంగం



సల్లా విజయకుమార్

ప్రకృతి ఆధారిత పరిష్కారాలు

నీటి ప్రాముఖ్యంపై ప్రజలందరి దృష్టిని కేంద్రీకరించడానికి ఐరాస 1993 నుంచి ఏటా మార్చి 22ను ప్రపంచ జల దినోత్సవంగా జరుపుతున్నది. ఈ సంవత్సరం జలదినోత్సవం నేపథ్య అంశంగా 'నీటి కొరకు ప్రకృతి'ని ఎన్నుకున్నారు. 21వ శతాబ్దంలోని నీటి సవాళ్లు పర్యావరణంతో ముడిపడి ఉన్నాయి. కాబట్టి వాటిని ఎదుర్కోవడానికి సాధ్యమైనంత వరకు 'ప్రకృతి-ఆధారిత పరిష్కారాలు' వెతుకాల్సిన అవసరం ఉన్నది. అందుకే ఈ ప్రచారానికి 'సమాధానం ప్రకృతిలో ఉంది' అని పేరు పెట్టారు.

ఈ ప్రచారంలో భాగంగా, ఈ నెల 19న 'ఐరాస ప్రపంచ జల అభివృద్ధి నివేదిక, 2018'ను నీటికై ప్రకృతి-ఆధారిత పరిష్కారాలు' శీర్షికతో విడుదల చేశారు. ఈ నివేదికలో ముఖ్యంగా జనాభా పెరుగుదల, వాతావరణంలో మార్పు వల్ల నీటి భద్రతకు పెరుగుతున్న సవాళ్లు, వాటిని అధిగమించేందుకు ప్రకృతి-ఆధారిత పరిష్కారాలను చర్చించారు.

నీరు పునరుత్పాదక వనరు కాబట్టి అంతరించిపోతుందన్న భయం లేదు. మరి మనం ఎందుకు భయపడుతున్నట్లు? భూగోళ ఉపరితలంపై ఉన్న 98 శాతం నీరు సముద్రాల్లో ఉన్నది. కానీ అవి ఉప్పు జలాలు. జీవన వాడకానికి పనికిరావు. ఇక మిగిలిన 2.7 శాతం నీరు మాత్రమే మంచినీరు. ఈ నీటిలో కూడా 75.2 శాతం ధృవ ప్రాంతాల్లో గడ్డకట్టుకొని ఘనీభవించి ఉంటే, 22.6 శాతం భూగర్భజలాల రూపంలో ఉన్నాయి. ఈ జలాల్లోని కొంతభాగం వినియోగానికి వీలుకానంత లోతుగా ఉన్నాయి. అయితే అదృష్టవశాత్తు, భూగోళంలోని నీటిలో ఒక చిన్న భాగం సూర్యశక్తి ఆధారిత 'నీటి చక్రం' ద్వారా పునరుద్ధరించబడుతున్నది. ఈ నీరు సరస్సులు, నదులు, వాతావరణం, తేమ, మట్టి, వృక్షజాలంలలో లభిస్తుంది. మొత్తమ్మీద, మన వినియోగానికి, ఇతర అవసరాలకు ఉపయుక్తమయ్యేది నదుల్లో, సరస్సుల్లో, భూగర్భ నీటిపొరల్లో ఉండే ఈ కొంతభాగం నీరు మాత్రమే.

ప్రపంచ జనాభా నేడు దాదాపుగా 8 బిలియన్లు అయ్యింది. ఈ వందేండ్లలో నీటి వాడకం దాదాపు ఆరు రెట్లు పెరిగింది. ఇక ముందు కూడా ఏడాదికి ఒక శాతం చొప్పున పెరుగుతుందని అంచనా. ప్రపంచ జనాభా 2050 నాటికి 10 బిలియన్లు దాటవచ్చునని, వారిలో మూడింట రెండువంతులు పట్టణాల్లో నివసిస్తారని భావిస్తున్నారు. ఈ పట్టణీకరణ అనేది జనాభా పెరుగుదలతో పాటుగా జరిగే ఆర్థికాభివృద్ధి, ప్రజల జీవనశైలిలో మార్పు తదితర అంశాల పర్యవసానంగా జరుగుతుంది. పట్టణాల్లో తలసరి నీటివాడకం ఎక్కువగా ఉంటుంది. అట్లా నీటి డిమాండు భవిష్యత్తులో ఇంకా పెరుగుతుంది.

జనాభా ఎక్కువైనా కొద్దీ వారికి భూమిపై తలసరి మంచినీటి లభ్యత కూడా తగ్గుతుంది. దానికి గుణాత్మకంగా నీటిలో మార్పు కూడా తోడయ్యింది. ఉదాహరణకు.. ప్రపంచంలో జనం వాడిన వ్యర్థ జలాల్లో 80 శాతం శుద్ధి చేయకుండానే పర్యావరణంలోకి తిరిగి చేరుతున్నాయి. జల కాలుష్యం, వాతావరణంలో మార్పు, అసమగ్ర నీటి వాడకం తదితర కారణాల వల్ల మానవాళికి ఉపయుక్తమయ్యే నీటి పరిమాణం తగ్గుతున్నది. ఇట్లాంటి మానవ జోక్యాలన్నింటి వల్ల ఏర్పడిన వాతావరణ మార్పు గ్లోబల్ వార్మింగ్‌కు దారితీసింది. దానివల్ల ప్రపంచ నీటిచక్రం తీవ్రతరమై సాధారణంగా తేమ ప్రాంతాలు మరింత తేమగా, పొడి ప్రదేశాలు మరింత పొడిగా మారుతున్నాయి. నేడు 3.6 బిలియన్ల జనం ఏడాదిలో కనీసం నెలరోజులు జల సంక్షోభం ఉండే ప్రదేశాల్లో నివసిస్తున్నారని అంచనా. ఇక రక్షిత తాగునీటి లభ్యతలేని ప్రజల సంఖ్య 210 కోట్లు.

పెరుగుతున్న కరువు, ఎడారీకరణ వల్ల ఈ పరిస్థితులు మరింతగా దిగజారుతున్నాయి. అందుకే, ఐరాస పేదరిక నిర్మూలన, భూగోళాన్ని కాపాడటం, అందరికీ సంపద అంతిమ లక్ష్యాలుగా మన ప్రపంచాన్ని మార్చడం, స్థిరమైన అభివృద్ధికి 2030 ఎజెండాను సాధించాలని తీర్మానించింది. ఆ ఎజెండాలో సహజ ప్రకృతిని కాపాడటానికి దోహదం చేస్తూ, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు నీటి లభ్యత, నీటి స్థిరమైన నిర్వహణ, అందరికి పారిశుద్ధ్యం సాధించాలని చేర్చారు.

ప్రపంచంలో జల సంబంధమైన సంక్షోభాలు పెరుగడానికి పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతోపాటు వాతావరణ మార్పు ప్రధాన కారణం. వృక్షజాలం, మట్టి, నదులు, చెరువులు, సరస్సుల అధోకరణం వలకల వరదలు, కరువులు, జల కాలుష్యం ఏర్పడుతాయి. మనం ఎప్పుడైతే పర్యావరణ వ్యవస్థలను నిర్లక్ష్యం చేస్తామో, మనం అందరికీ జీవించడానికి, వృద్ధి చెందడానికి కావల్సిన నీటిని అందించడం కష్టమవుతుంది. మన నీటి సవాళ్లను అధిగమించడానికి కావాల్సిన శక్తి 'ప్రకృతి ఆధారిత పరిష్కారాల'లో ఉన్నది. అడవులు నాటడం, నదీ పరీవాహక ప్రాంతాల సమగ్రాభివృద్ధి, నదులను పునరుజ్జీవింపజేయడం లాంటి కార్యక్రమాలు 'నీటి చక్రం' సమతుల్యతను పునఃస్థాపిస్తాయి, మానవ ఆరోగ్యం, జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయి. దెబ్బతిన్న పర్యావరణ వ్యవస్థలు మనుషులు వినియోగించే నీటి పరిమాణాన్ని, నాణ్యతను ప్రభావితం చేస్తాయి. ఇండ్లలో సురక్షితమైన తాగునీరు లభించనందువల్ల వారి ఆరోగ్యం, విద్య, జీవనోపాధిపై ప్రభావం కనబడుతున్నదని ప్రపంచస్థాయి నివేదికలు తెలియజేస్తున్నాయి.

'నీటి సంక్షోభం, వాతావరణ కాలుష్యం, మౌలిక సదుపాయాల నిర్మాణానికి చెందిన సమస్యలకు నిర్దిష్టమైన స్థానిక పరిష్కారాలు అవసరం. ఒకవేళ జీవవైవిధ్యం, ఆరోగ్యకరమైన జీవావరణ వ్యవస్థలు, క్రమపద్ధతిలో నీరు, శక్తి, వ్యవసాయం, ఇతరరంగాల్లో ఇంటిగ్రేట్ చేస్తూ, సంస్థాగతపరంగా బలం చేకూరుస్తూ, నిధులను సమకూర్చడంలో మద్దతిస్తే, జీవావరణ పద్ధతులు విస్తృతంగా అమలుచేయవచ్చు. జల, జీవవైవిధ్య సంబంధమైన స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు జయప్రదం చేయవచ్చు' అని ఎలినే బొఎలీ, ఇతరులు తమ వ్యాసం జల సంబంధమైన సవాళ్లను ప్రకృతి ఆధారిత పరిష్కారాల ద్వారా అధిగమించడంలో పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం నాలుగేండ్ల కిందటే చేపట్టిన హరితహారం, మిషన్‌కాకతీయ, మిషన్ భగీరథ తదితర కార్యక్రమాలు పరిశీలిస్తే, అవన్నీ నేడు ఐరాస చెబుతున్న 'ప్రకృతి-ఆధారిత పరిష్కారాలే'నని అర్థమవుతున్నది. 'ప్రపంచ జల అభివృద్ధి నివేదిక-2018'లో ఈ కార్యక్రమాల ప్రస్తావన లేకపోవడం విడ్డూరం. అయితే, ఈ నివేదికలోని అంశాలు అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురించిన వ్యాసాల ఆధారంగా తయారుచేస్తారు. దానికోసం తెలంగాణ కార్యక్రమాల గణాంకాలు, వ్యాసాలు ఆయా జర్నల్స్‌లో ఎక్కువ సంఖ్యలో రావాలి.

తెలంగాణలో చెరువుల ఆధారిత చిన్న మైక్రోలెవెల్ జీవావరణ వ్యవస్థలు గ్రామాలకు మూలాధారాలు. గత అరువై ఏండ్లుగా నిర్లక్ష్యానికి గురైన ఈ చెరువులను పునరుద్ధరించడానికి రాష్ట్ర ప్రభుత్వం 'మిషన్ కాకతీయ' పేరుతో కార్యక్రమం చేపట్టి చాలాభాగం పూర్తిచేసింది. రాష్ట్రంలోని అన్ని గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు రక్షిత తాగునీటిని 'మిషన్ భగీరథ' పేరుతో ఇప్పటికే చాలావరకు పూర్తిచేసింది. నీటిపారుదల రిజర్వాయర్లతో అనుసంధానంచేసి వాటినుంచి నీటిని తీసుకుంటారు. స్థిరమైన లక్ష్యాల ఎజెండాలో రక్షిత మంచినీటి సౌకర్యం ఇప్పటికే ఏర్పాటుచేస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానిది. 'హరితహారం' ద్వారా క్షీణిస్తున్న అడవులను పునరుజ్జీవనం చేయడంతో పాటు, సామాజిక అడవుల పెంపకం, అనువైన ప్రతి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చెట్ల పెంపకం చేపట్టింది. మూడేండ్లలో దాదాపుగా 230 కోట్ల మొక్కలను నాటాలన్నది లక్ష్యం. అడవుల శాతం రాష్ట్ర విస్తీర్ణంలో 24 నుంచి 33 శాతానికి పెంచాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నది. వర్షపు నీటిని ప్రతిభావంతంగా వాడుకోవడానికి, 'జల్ సంచయ్', 'జల్ సించన్' లాంటి కార్యక్రమాల ద్వారా నీటి పరిరక్షణ, భూగర్భ జలాల రీఛార్జిని, 'మోర్ క్రాప్ పర్ డ్రాప్' 'హర్ కేత్ కో పానీ'ల ద్వారా ఇరిగేషన్ సౌకర్యాలు, నీటి వినియోగ సామర్థ్య పెంపును కేంద్రం ప్రోత్సహిస్తున్నది. తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల అసోసియేషన్ వ్యవసాయ భూముల్లో వాననీటి సంరక్షణ కార్యక్రమం 'చేను కిందే చెరువు' పేరుతో తెలంగాణ, పంట చేలల్లో కందకాల తవ్వకాన్ని ప్రచారం చేస్తున్నది. తెలంగాణ జల వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వాగులు వంకల్లో భూగర్భజలాల రీఛార్జీ చేయడం లాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇలాంటివే మరికొన్ని ప్రకృతి ఆధారిత పరిష్కారాలు తెలంగాణ అంతటా సాగుతున్నాయి.


ప్రపంచంలోని ప్రజలంతా ఐక్యరాజ్య సమితి ప్రకటించిన 'నీటి కొరకు ప్రకృతి'ని, 'ప్రకృతి ఆధారిత పరిష్కారాలను' విస్తృతంగా ప్రజా బాహుళ్యంలోకి తీసుకువెళ్లే ప్రయత్నాలు చేయాలి. మానవుని మౌలిక అవసరమైన స్థిరమైన నీటి భద్రతను సాధిస్తూనే, భవిష్యత్ భూగోళం మనుగడను కూడా కాపాడుకోవలసిన బాధ్యత మనందరిపై ఉన్నది.

ప్రపంచంలోని ప్రజలంతా ఐక్యరాజ్య సమితి ప్రకటించిన 'నీటి కొరకు ప్రకృతి'ని, 'ప్రకృతి ఆధారిత పరిష్కారాలను' విస్తృతంగా ప్రజా బాహుళ్యంలోకి తీసుకువెళ్లే ప్రయత్నాలు చేయాలి. మానవుని మౌలిక అవసరమైన స్థిరమైన నీటి భద్రతను సాధిస్తూనే, భవిష్యత్ భూగోళం మనుగడను కూడా కాపాడుకోవలసిన బాధ్యత మనందరిపై ఉన్నది.

(వ్యాసకర్త: తెలంగాణ ఇంజినీర్స్ జేఏసీ సెక్రెటరీ)

నైపుణ్యాల కొలతలుగా పరీక్షలు

విద్య



ఎడమ శ్రీనివాస్‌రెడ్డి

పరిణతికి వయస్సు కొలమానం కానట్లే తెలివితేటలకు పరీక్షల్లో సాధించిన గ్రేడులు కొలమానాలు కాలేవు. ప్రస్తుత పరీక్షల గురించి చెప్పబడుతున్న నానుడి ఇది. 2011లో గూగుల్ సంస్థ 'ప్రాజెక్ట్ ఆక్సిజన్' పేరుతో ఉద్యోగ నియామక నమూనాపై ఒక అధ్యయనం చేసింది. ఉద్యోగార్థుల అకడమిక్ గ్రేడులకు వారి శక్తిసామర్థ్యాలకు ఎలాంటి సంబంధం లేదని ఆ అధ్యయనం తేల్చింది. అప్పటి నుంచి ఉద్యోగ నియామక నమూనాను సమూలంగా మార్చివేసింది. ప్రస్తుతం ఆ సంస్థలో అకడమిక్ గ్రేడులకు విలువ లేదు. అభ్యర్థి సమస్య పరిష్కార నైపుణ్యాలను పరీక్షించి ఉద్యోగం ఇవ్వబడుతుంది. ఎలాంటి అకడమిక్ అర్హతలులేని వారు కూడా గూగుల్‌లో ఉద్యోగాలు చేస్తున్నారు.

పరీక్షలు పిల్లల్లోని శక్తిసామర్థ్యాలను వెలికితీసే సాధనాలుగా ఉండాలి. కానీ వారిలోని తప్పులను మాత్రమే గుర్తించే పరికరాలైనప్పుడే అవి ప్రమాదకరమవుతాయి. 2014 నుంచి 2016 వరకు 26,500 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. గతేడాది సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకు మూడు మాసాల్లోనే అరువై మంది విద్యార్థులు తెలుగు రాష్ర్టాల్లో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. సంతోషంగా సాగవలసిన చదువులు చావులకు కారణం కావడానికి ప్రపంచవ్యాప్తంగా పెచ్చరిల్లిన 'కాగ్నిటివ్ కాపిటలిజం' దాని ఫలితాలైన పరీక్షా విధానాలే ప్రధాన కారణం.

పిల్లల్లోని విస్తృతమైన సమగ్ర వికాస అంశాలను కొలువడం కష్టమైన పని. ఆ పనిని చేయాలంటే బాగా శిక్షణ పొందిన టీచర్లు ఉండాలి. వారికి స్వేచ్ఛ ఉండాలి, తగిన వనరులు సమకూర్చాలి. వీటిని చేయలేక సులువైన బోర్డ్ పరీక్షల ప్రాధాన్యాన్ని బాగా పెంచుతూ ఉంటారు. విషయాల లోతులు తెలియని వారు ప్రస్తుతం అమల్లో ఉన్న ఈ పరీక్షా నమూనానే బలపరిచే చర్యలను చేపడుతుంటారు. ప్రధాని కూడా పరీక్షల పర్యవసానాలకు చింతించి పరీక్షలను ఎదుర్కొనే సూచనలతో పుస్తకం రాశారు తప్పా, పరీక్ష నమూనా మార్పు గురించి మాట్లాడలేదు.

బోర్డ్ పరీక్షల ప్రారంభానికి ముందునుంచే ప్రత్యేక శిక్షణలు, పరీక్షల కేంద్రంగా బోధనల లక్ష్యం గ్రేడుల సాధనే అవుతున్నది. విద్యా శాఖామాత్యుల నుంచి, జిల్లా కలెక్టర్, విద్యా శాఖాధికారుల వరకు అందరూ ఒత్తిడిని పెంచే పనిలో భాగస్వాములవుతున్నారు. పరీక్షల చెడు పర్యవసానాలకు కారణమవుతున్నారు. ఈ విషయాలపై లోతైన పరిజ్ఞానం లేని కొన్ని స్వచ్ఛంద సంస్థలు కూడా ప్రస్తుత పరీక్షల నమూనానే కాపాడే ప్రయత్నం చేస్తున్నాయి. వీరి కార్యక్రమాల్లో ప్రభుత్వ యంత్రాంగం కూడా పాలు పంచుకుంటున్నది. వీటివల్ల ఈ కార్యక్రమాల తీవ్రత పెరుగుతున్నది. దీంతో ప్రస్తుత పరీక్షల నమూనా మరింత బలపడి వాటి పరిణామాల తీవ్రత ఇంకా పెరుగుతుంది.

పిల్లలు నేర్చుకున్నారా లేదా అన్న విషయాన్ని తేల్చుకోవడానికి పరీక్షలు నిదర్శనాలవుతాయి. ఆ మేరకు పరీక్షల పాత్రను ఎవరూ కాదనలేరు. కానీ ఆ పరీక్షలు విద్యా ప్రక్రియనంతా తీవ్రంగా ప్రభావితంచేసి విద్యా వ్యవస్థను పరీక్షా వ్యవస్థగా మార్చినప్పుడే ఇబ్బంది. పరీక్షలు వేటిని కొలువాలి? కొన్ని జ్ఞాన అంశాలనేనా లేక సమగ్రంగా అన్ని అంశాలనా. అందరి నుంచి ఒకే రకమైన సమాధానాన్ని ఆశించాలా, లేక వేర్వేరు స్పందనలను ఆహ్వానించేట్లు ఉండాలా? పరీక్షలు ఫార్మేటివ్‌గా ఉండాలా లేక సమ్మేటివ్‌గా ఉండాలా? పరీక్షలు టీచర్ మేడ్‌గా ఉండాలా, లేదా బోర్డ్ పరీక్షలుగా ఉండాలా? బలహీనతలను తెలుసుకోవడానికి మాత్రమే డిజైన్ చేయబడాలా లేక బలాలను గుర్తించే విధంగా ఉండాలా? పరీక్షా ఫలితాలతో టీచర్ల సామర్థ్యాన్ని, స్కూల్ సామర్థ్యాన్ని ముడి పెట్టవచ్చా అన్న విషయాలపై స్పష్టత లేకపోతే దుష్పరిణామాలు తప్పవు.

ప్రస్తుత పరీక్షలు కొలువదగిన సులువైన విషయాలనే కొలుస్తాయి. కొలువడానికి కష్టమైన విషయాలను పట్టించుకోవు. స్మృతికి సంబంధించిన జ్ఞానాంశాలను కొలువడం చాలా సులువు. అందుకని మన పరీక్షలు ఈ అంశం కేంద్రంగానే ఉంటాయి. పిల్లల దృక్పథాలు, ఆసక్తులు, నైపుణ్యాలు, వైయక్తికంగా ఉండే శక్తిసామర్థ్యాలను, భిన్నంగా ఆలోచించే నేర్పు, స్నేహతత్వం, సహకారభావం, సహానుభూతి, ఓపికలాంటి అంశాలను కొలువడం కష్టం. అందుకని వీటిని విస్మరిస్తూ ఉంటాం. కానీ ఈ అంశాలే ప్రధాన విషయాలు. ప్రస్తుత పరీక్షలు అందరి నుంచి ఒకేరకమైన నిర్దిష్టమైన స్థిరమైన సమాధానాలను ఆశిస్తాయి. అందుకోసమే శిక్షణని స్తాయి. ఇది డైవర్జెంట్ థింకింగ్‌ను ఆటంకపరుస్తుంది. సృజనాత్మకతను పెంపొందించని చదువుల వల్ల ఎలాంటి లాభం ఉండదు. ప్రస్తుత పరీక్ష లు సమ్మేటివ్ స్వభావాన్ని కలిగినవి. ఇవి పిల్లల్లోని బలాలను తెలుసుకునే అవకాశాన్నివ్వవు. కేవలం వారి బలహీనతలను తెలుసుకోగలిగినవి. వ్యక్తి నిర్మాణానికి సంబంధించి ఇది ప్రమాదకరమైన ధోరణి. ముఖ్యంగా చిన్న తరగతుల్లోనే ఈ పరీక్షల ఆధారంగా ర్యాంకులనిచ్చే పద్ధతి వల్ల ర్యాంకుల్లో ముందుండే పిల్లలు ఆ ర్యాంకులను నిలబెట్టుకోవడానికే నిరంతరం ప్రయత్నం చేస్తూ ఉంటారు. ఈ క్రమంలో విలువైన విషయాలను చాలా కోల్పోతారు. ర్యాంకుల్లో వెనుకబడే పిల్లలు తమ శక్తి సామర్థ్యాలు ఏమిటో తెలుసుకోలేని పరిస్థితుల్లో ఫెయిల్యూర్స్‌గా ముద్రబడిపోతారు.

ప్రపంచవ్యాప్తంగా ప్రతీ మూడేండ్లకోసారి లెక్కలు, గణితం, భాష విషయాలపై PISA అనే పరీక్షను నిర్వహిస్తుంది. ఈ పరీక్ష మన బోర్డ్, ప్రవేశ పరీక్షల మాదిరిగా గాక విస్తృతమైన జ్ఞానాంశాలను పరీక్షించేవిధంగా రూపొందించబడుతాయి. అయినప్పటికీ వీటికి గల పరిమితులపై విమర్శలున్నాయి. అంతర్జాతీయంగా జరిగే ఇలాంటి మరొక పరీక్ష అయిన TIMSSలో ముందున్న దేశాలు PISA పరీక్షలో ముందు ఉండలేకపోతున్నాయి. అంటే ఒకేరకమైన విషయాలను పరీక్షించే టెస్టుల్లో వ్యత్యాస ఫలితాలు వస్తున్నాయంటే వాటి విశ్వసనీయత తక్కువని అర్థం. అంతర్జాతీయ స్థాయి పరీక్షలే ఈ రకంగా ఉంటే, స్థానికంగా జరిగే బోర్డ్ పరీక్షల స్థాయిని ఊహించుకోవచ్చు. ఈ బోర్డ్ పరీక్షల ప్రమాద స్థాయిని తగ్గించడానికి చాలాదేశాలు ప్రత్యామ్నాయ విధానాలను అనుసరిస్తున్నాయి. ఫిన్లాండ్ ఫార్మేటివ్ అంచనాలకే ప్రాధాన్యం ఇస్తున్నది. టర్కీ స్కూల్‌దశ అంతటికీ ఒకేఒక మూడు గంటల ఆబ్జెక్టివ్ పరీక్షను నిర్వహిస్తుంది. దాని ఫలితాలను తర్వాత మాడరేట్ చేస్తుంది. చాలా యూరప్ దేశాలు గ్రేడులు, ర్యాంకుల ప్రకటనలను నిలిపేశాయి. జర్మనీ చాలావరకు ప్రాజెక్టు బేస్‌డ్ విధానాన్ని ఉపయోగించి పరీక్షిస్తున్నది.

ఆఫ్రికాకు చెందిన ఒక ఆదిమతెగ తమ సమాజానికి చెందిన వ్యక్తి తప్పు చేస్తే ఆ వ్యక్తిని ఊరి మధ్యలో కూర్చోబెట్టి గ్రామస్థులంతా చుట్టూ కూర్చొని ఆ వ్యక్తి చేసిన మంచి పనులను గుర్తుచేసుకుంటూ ఒక్కరొక్కరుగా ఏకరువు పెడుతారట, దానితో తనలోని మంచితనాన్ని గుర్తుకు తెచ్చుకొని తప్పుచేసిన వ్యక్తి పరివర్తన చెందుతాడు. మనం అనాగరికులమనుకునే ఆదిమ జాతుల్లోని ఈ పరిణతి నుంచి మనం నేర్చుకోలేమా? మన పిల్లలను పరీక్షించే విధానాల్లో వారి బలాలను గుర్తించే విధానాల వైపు మారకూడదా?

ఆఫ్రికాకు చెందిన ఒక ఆదిమతెగ తమ సమాజానికి చెందిన వ్యక్తి తప్పు చేస్తే ఆ వ్యక్తిని ఊరి మధ్యలో కూర్చోబెట్టి గ్రామస్థులంతా చుట్టూ కూర్చొని ఆ వ్యక్తి చేసిన మంచి పనులను గుర్తుచేసుకుంటూ ఒక్కరొక్కరుగా ఏకరువు పెడుతారట, దానితో తనలోని మంచితనాన్ని గుర్తుకు తెచ్చుకొని తప్పుచేసిన వ్యక్తి పరివర్తన చెందుతాడు. మనం అనాగరీకులమనుకునే ఆదిమ జాతుల్లోని ఈ పరిణతి నుంచి మనం నేర్చుకోలేమా?

(వ్యాసకర్త: కాకతీయ ప్రభుత్వ కళాశాల అధ్యాపకుడు, హన్మకొండ)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

మహారాష్ట్ర అసెంబ్లీలో 'ఎలుకల' గొడవ

- వారంలో 3,19,400 ఎలుకల్ని పట్టుకోవడంపై దర్యాప్తునకు డిమాండ్



ముంబై, మార్చి 22: మన ఇంట్లో నానా హంగామా చేసే ఒక్క ఎలుకను పట్టుకోవడానికి మనం పడే ఇబ్బంది అంతా ఇంతా కాదు. అలాంటిది 3 లక్షల ఎలుకలు వచ్చాయనుకోండి ఏంచేస్తారు? అలాంటి సమస్యే మహారాష్ట్ర అసెంబ్లీని కుదిపేసింది. మహారాష్ట్ర సచివాలయంలో తీవ్ర సమస్యగా మారిన ఎలుకల్ని పట్టేందుకు ప్రభుత్వం ఓ కాంట్రాక్టర్‌ను నియమించింది. వీరు ఆషామాషీగా కాకుండా రోజుకు 45వేలకు పైచిలుకు చొప్పున వారంరోజుల్లో మొత్తం 3,19,400 ఎలుకల్ని పట్టేశారంటా. ఇదెలా సాధ్యమైందంటూ అధికార పార్టీకి చెందిన మాజీ మంత్రి ఏక్‌నాథ్ ఖడ్సే బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ప్రశ్నించారు. ముంబైలో ఆరులక్షల ఎలుకల్ని నిర్మూలించేందుకు మున్సిపల్ అధికారులకు రెండేండ్ల సమయం పట్టిందని గుర్తుచేసిన ఖడ్సే... సచివాలయంలో ఎలుకల నిర్మూలనపై దర్యాప్తు జరుపాల్సిందేనంటూ పట్టుబట్టారు. 'రోజుకు 45,628 ఎలుకల చొప్పున పట్టుకోవడం అంటే నిమిషానికి 31.68 ఎలుకల్ని చంపగలిగారు. ఒక్క రోజులో చంపిన ఎలుకల బరువు 9,125.71 కిలోలు ఉండగా, వీటిని తరలించేందుకు రోజుకో ట్రక్కు అవసరమవుతుంది. కాంట్రాక్ట్ ఇవ్వడానికి బదులుగా ఓ పది పిల్లుల్ని ఈ పనిపై వదిలేస్తే బాగుండేది' అని ఖడ్సే అనడంతో సభలో నవ్వులు వెల్లివిరిశాయి. కాగా, వారంలోగా వివరాలు సభముందుం ఉంచుతామని సంబంధిత మంత్రి ప్రకటించారు.

భారత్, చైనా 'మిత్ర విరోధులు'

- వాటి సంబంధాల నుంచి ప్రపంచం ఎన్నో నేర్చుకోవచ్చు
- ఐరాసలో భారత దౌత్యాధికారి అక్బరుద్దీన్ వ్యాఖ్య



వాషింగ్టన్, మార్చి 22: భారత్, చైనా మిత్రవిరోధులని, వాటి మధ్య భేదాభిప్రాయాలున్నా కలిసి పనిచేస్తాయని, వాటి మధ్య సంబంధాల నుంచి ప్రపంచం ఎన్నో విషయాలను నేర్చుకోవచ్చని ఐక్యరాజ్యసమితిలో భారత దౌత్యాధికారి సయ్యద్ అక్బరుద్దీన్ పేర్కొన్నారు. జార్జ్ టౌన్ యూనివర్సిటీలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రసంగించిన అనంతరం ఒక ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ, 'హాలీవుడ్‌లో 'ఫ్రెనిమీస్ (మిత్ర విరోధులు)' అనే పదం చాలా ప్రాచుర్యం పొందింది. చైనాతో భారత్ సంబంధాలు అలాగే ఉన్నాయి. చైనాతో కలిసి సాగుతూనే పోటీ పడుతాం. కొన్ని అంశాల్లో కలిసి పనిచేస్తాం. కొన్ని విషయాల్లో విభేదిస్తాం, మరికొన్నింటిపై ఏకాభిప్రాయం వ్యక్తంచేస్తాం. అలా వారితో కలిసి సాగుతున్నాం' అని ఆయన పేర్కొన్నారు. ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) వంటి అభివృద్ధి కార్యక్రమాల్లో చైనాతో కలిసి పనిచేస్తున్నామని, కానీ వన్‌బెల్ట్ వన్ రోడ్ (ఓబీఓఆర్)వంటి ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నామని ఆయన ఉదహరించారు. అంతర్జాతీయంగా కశ్మీర్ విషయంలో పాకిస్థాన్‌కు మద్దతు లభించడం లేదని మరో ప్రశ్నకు బదులుగా ఆయన చెప్పారు.

'ఆధార్' అత్యంత సురక్షితం

- యూఐడీఏఐ సీఈవో అజయ్ భూషణ్ పాండే వెల్లడి
- సుప్రీంకోర్టులో పవర్‌పాయింట్ ప్రజంటేషన్

న్యూఢిల్లీ, మార్చి 22: ఆధార్ సమాచారం అత్యంత సురక్షితమని, ఇది '2048-ఎన్‌క్రిప్షన్ కీ' సిస్టమ్‌లో భద్రంగా ఉన్నదని యూఐడీఏఐ సీఈవో అజయ్ భూషణ్ పాండే తెలిపారు. ఈ సూపర్ కంప్యూటర్ నుంచి ఆధార్ సమాచారాన్ని తస్కరించాలంటే 13 వందల కోట్ల ఏండ్ల సమయం పడుతుందని పేర్కొన్నారు. ఆధార్ డాటా భద్రతపై ప్రస్తుతం సుప్రీంకోర్టులో వాదోపవాదాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ కార్డులను జారీ చేసే సంస్థ యూఐడీఏఐ గురువారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ముందు ఈ ప్రజంటేషన్ ఇచ్చింది. ఈ సందర్భంగా అజయ్‌భూషణ్ మాట్లాడుతూ ఆధార్ సమాచారం కేంద్రంలోని డాటాబేస్‌కు చేరిందంటే ఇక దాన్ని మరొకరికి చేరవేయడం, తస్కరించడం కుదరవని చెప్పారు. దీంతో ధర్మాసనం స్పందిస్తూ ఆధార్ కార్డు లేదన్న కారణంగా ఎవరికైనా ప్రయోజనాలు నిరాకరించారా? అని ప్రశ్నించగా, అలాంటి సమాచారమేది తమ వద్ద లేదని అజయ్‌భూషణ్ చెప్పారు. ఆధార్ లేదన్న కారణంగా రేషన్ బియ్యం ఇచ్చేందుకు నిరాకరించడంతో జార్ఖండ్‌లో ఓ మహిళ మృతిచెందినట్లు ఆరోపణలు వచ్చాయని ధర్మాసనం గుర్తుచేసింది. ఆధార్ వివరాలు సరిపోలడం లేదన్న కారణంగానే డీలర్ బియ్యాన్ని నిరాకరించాడని, కానీ ఆధార్ వివరాలు సరిపోలాయని తమ విచారణలో తేలిందని అజయ్‌భూషణ్ పేర్కొన్నారు. అంతేగాక ఆధార్ కార్డు అనేది చాలా పకడ్బందీ కార్డు అని, జీవితకాలానికి వర్తిస్తుందని పేర్కొన్నారు. ఆధార్ కార్డు జాతీయ స్థాయిలో ఎక్కడైనా ఉపయోగపడుతుందని, భాషా పరమైన సమస్యలు కూడా ఎదురుకావని తెలిపారు. ఆధార్ నమోదులో వ్యక్తి ఫొటో, వేలిముద్రలు, ఐరిస్ మాత్రమే సేకరిస్తున్నామని, కులం, మతం, ప్రాంతం, భాష, ఆదాయం, వృత్తి, వైద్య వివరాలు సేకరించడం లేదని పేర్కొన్నారు. ఆధార్ సాఫ్ట్‌వేర్‌ను తామే అభివృద్ధి చేసినందున ట్యాంపరింగ్‌కు అవకాశం ఉండదని స్పష్టంచేశారు. హ్యాకింగ్ ప్రమాదం నేపథ్యంలో ఆధార్ సాఫ్ట్‌వేర్‌ను ఇంటర్నెట్‌కు అనుసంధానించలేదని వివరించారు.





ఆందోళనల మధ్య గ్రాట్యుటీ బిల్లు పాసైనట్లు ప్రకటిస్తున్న రాజ్యసభ చైర్మన్

పన్నురహిత గ్రాట్యుటీ రెట్టింపు

- రూ.10లక్షల నుంచి రూ.20లక్షలకు పెంపు
- గ్రాట్యుటీ చట్టసవరణ బిల్లుకు రాజ్యసభ ఆమోదం
- విపక్షాల ఆందోళనలతో పార్లమెంట్ ఉభయసభలు వాయిదా

న్యూఢిల్లీ, మార్చి 22: గ్రాట్యుటీ చట్టసవరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదముద్ర వేసింది. ఉద్యోగులకు పన్ను రహిత గ్రాట్యుటీని రూ.10లక్షల నుంచి రూ.20లక్షలకు పెంచుతూ రూపొందించిన ఈ బిల్లును మార్చి 15న లోక్‌సభ ఆమోదించింది. తాజాగా గురువారం రాజ్యసభ కూడా ఈ బిల్లుకు ఆమోదం తెలిపింది. కేంద్ర కార్మికశాఖ మంత్రి సంతోష్‌కుమార్ గాంగ్వార్ రాజ్యసభలో బిల్లును ప్రవేశపెట్టగా, నిరసనల మధ్యే మూజువాణి ఓటుతో బిల్లును ఆమోదించారు. రాష్ట్రపతి ఆమోదం తర్వాత చట్టరూపం దాల్చనున్న ఈ బిల్లు ద్వారా ఉద్యోగుల పన్ను రహిత గ్రాట్యుటీ గరిష్ఠ పరిమితి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెరుగనున్నది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతోపాటు పది లేదా అంతకన్నా ఎక్కువమంది పనిచేసే పరిశ్రమలు, సంస్థల్లో వరుసగా కనీసం ఐదేండ్ల సర్వీసు పూర్తిచేసినవారికి ఈ చట్టం వర్తిస్తుంది. దీంతోపాటు భవిష్యత్‌లో గ్రాట్యుటీ పెంపునకు, మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవు కాలాన్ని సవరించడానికి చట్టసవరణ అవసరం లేకుండా, కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా వీటిలో మార్పులు చేసుకునే హక్కు ప్రభుత్వానికి లభిస్తుంది.

14వరోజూ స్తంభించిన పార్లమెంట్

దక్షిణాది రాష్ట్రాల సభ్యుల ఆందోళనలు, విపక్షాల నిరసనల మధ్య 14వ రోజు కూడా పార్లమెంట్ ఉభయసభలూ సజావుగా సాగలేదు. లోక్‌సభలో వివిధ అంశాలపై కాంగ్రెస్, అన్నాడీఎంకే, టీఆర్ఎస్ సభ్యులు నిరసనలకు దిగారు. దీంతో టీడీపీ, వైసీపీ ఇచ్చిన అవిశ్వాస తీర్మానాల విషయంలో ముందుకు వెళ్లలేనంటూ ప్రకటించిన స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను వాయిదా వేశారు. రాజ్యసభలోనూ అదే పరిస్థితి నెలకొంది. టీడీపీ సభ్యులు ఏపీకి ప్రత్యేక హోదాపై నిరసన తెలిపారు. మరోవైపు ఇరాక్‌లో భారతీయుల హత్యకు సంబంధించిన వాస్తవాలను దాచి సభను తప్పుదోవపట్టించారని పేర్కొంటూ విదేశాంగశాఖ మంత్రి సుష్మాస్వరాజ్‌పై హక్కుల తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ నిర్ణయించింది.

రాజ్యసభ సమరం నేడే!

- 6 రాష్ట్రాల్లో 25 సీట్లకు ఎన్నికలు
- ఇప్పటికే 10 రాష్ట్రాల నుంచి 33 మంది ఏకగ్రీవంగా ఎన్నిక
- యూపీలో పోరు రసవత్తరం
- బరిలో పలువురు కేంద్రమంత్రులు



న్యూఢిల్లీ, మార్చి 22: వచ్చే నెలలో పదవీకాలం ముగియనున్న 58 రాజ్యసభ స్థానాలకు శుక్రవారం ఎన్నికలు జరుగనున్నాయి. మొత్తం 16 రాష్ట్రాల నుంచి ఈ అభ్యర్థులను ఎన్నుకోనున్నారు. రాజ్యసభలో మొత్తం 245 సీట్లు ఉండగా, మెజారిటీకి 126మంది సభ్యులు అవసరం. బీజేపీకి ప్రస్తుతం 58 మంది సభ్యులుండగా, కాంగ్రెస్‌కు 54 మంది బలం ఉంది. ఎన్నికలు జరుగనున్న 16 రాష్ట్రాలకు గాను పదకొండింటిలో బీజేపీనే అధికారంలో ఉన్న నేపథ్యంలో ఆ పార్టీ తన సీట్లను మరింత పెంచుకొనే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఈ ఎన్నికల్లో అరుణ్‌జైట్లీ, రవిశంకర్ ప్రసాద్‌తోపాటు ఏడుగురు కేంద్ర మంత్రులు బరిలో ఉన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య నిర్వహించే పోలింగ్‌లో ఎమ్మెల్యేలు ఓటు వేయనున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే సాయంత్రం ఐదు గంటలకు కౌంటింగ్‌ను ప్రారంభించనున్నారు. రాష్ట్రాల వారీగా చూస్తే.. ఉత్తర్‌ప్రదేశ్ (10), మహారాష్ట్ర (6), బీహార్ (6), పశ్చిమ బెంగాల్ (5), మధ్యప్రదేశ్ (5), గుజరాత్ (4), కర్ణాటక (4), తెలంగాణ (3), ఆంధ్రప్రదేశ్ (3), ఒడిశా (3), రాజస్థాన్ (3), జార్ఖండ్ (2), ఛత్తీస్‌గఢ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో ఒక్కో స్థానంలో ఎన్నికలు జరుగనున్నాయి. మొత్తం 58 సీట్లకు గాను ఇప్పటికే 33 మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన 25 సీట్లకు పోలింగ్ జరుగనుంది. అవి ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమబెంగాల్, కర్ణాటక, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ. వివిధ రాష్ట్రాల్లో పార్టీల గెలుపోటముల పరిస్థితి ఇలా ఉంది..

ఎమ్మెల్యేల ఓటు విలువను ఇలా లెక్కిస్తారు

ఒక్కో ఎమ్మెల్యే ఓటు విలువ 100. రాజ్యసభకు ఎన్నికయ్యేందుకు అభ్యర్థికి అవసరమైన మొత్తం ఓట్లు ఇలా ఉంటాయి.
[(ఎమ్మెల్యేల సంఖ్య x 100) / (ఖాళీలు + 1)] +1
ఉదాహరణకు ఉత్తర్‌ప్రదేశ్‌ను తీసుకుంటే, ఆ రాష్ట్రంలో 403 మంది ఎమ్మెల్యేలున్నారు. అక్కడ 10 సీట్లకు ఎన్నికలు జరుగనున్నాయి. ఒక్కో అభ్యర్థికి [(403x100) / (10+1)] + 1 = 3,664 ఓట్లు కావాలి. కనీసం 37 మంది ఎమ్మెల్యేలు మద్దతివ్వాలి.

ఉత్తర్‌ప్రదేశ్

యూపీలో 10 సీట్లకు ఎన్నికలు జరుగనుండగా, 11 మంది బరిలో ఉన్నారు. గెలుపుకోసం ఒక్కో అభ్యర్థికి కనీసం 37 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. కాగా 403 మంది ఎమ్మెల్యేలున్న అసెంబ్లీలో బీజేపీకి 311 మంది సభ్యులున్నారు. దీంతో బీజేపీ ఎనిమిది సీట్లను సునాయాసంగా గెలుచుకోగలుగుతుంది. 9సీట్లను తాము గెలుచుకుంటామంటూ బీజేపీ ధీమా వ్యక్తంచేస్తున్నది. 47 మంది సభ్యులున్న సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) ఒకరిని గెలిపించుకున్న తరువాత పది ఓట్లు మిగులుతాయి. దీంతో ఆ పార్టీ బీఎస్పీ అభ్యర్థికి మద్దతు పలికింది. బీఎస్పీకి 19మంది సభ్యులున్నారు. కాంగ్రెస్ (7) కూడా మద్దతునిస్తే బీఎస్పీ అభ్యర్థి 36 ఓట్లు లభిస్తాయి. కాగా నరేశ్ అగర్వాల్ ఇటీవల బీజేపీలో చేరిన నేపథ్యంలో ఎస్పీ నుండి ఎమ్మెల్యేగా గెలిచిన అతని కుమారుడు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడే అవకాశాలున్నాయి. దీంతో బీఎస్పీ నాయకురాలు మాయావతి ఇండిపెండెంట్ల మద్దతుపై ఆశలు పెట్టుకున్నారు.

పశ్చిమ బెంగాల్

ఈ రాష్ట్రంలో ఐదు స్థానాలకు ఎన్నికలు జరుగనుండగా, ఒక్కో అభ్యర్థికి 50 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. టీఎంసీకి 213 మంది ఎమ్మెల్యేలుండటంతో ఆ పార్టీ నలుగురిని గెలిపించుకోగలదు. ఐదో స్థానంలో కాంగ్రెస్‌కు చెందిన అభిషేక్ మను సింఘ్వీకి తృణమూల్ మద్దతు ప్రకటించింది.

కర్ణాటక

కర్ణాటకలో నాలుగు ఖాళీలుండగా ఐదుగురు బరిలో ఉన్నారు. ఇక్కడ ఒక్కో అభ్యర్థికి కనీసం 46 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. 124 మంది ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్ ఇద్దరిని గెలిపించుకున్న తరువాత ఇంకా 32 ఓట్లు మిగిలి ఉంటాయి. మిగిలిన రెండు సీట్లు గెలుచుకోవడానికి ప్రతిపక్షంలో ఏ పార్టీకి పూర్తిస్థాయి బలం లేదు. బీజేపీకి 44 మంది సభ్యులుండగా, జేడీ(ఎస్), బీఎస్ఆర్‌సీ, కేజేపీ, కేఎంపీలకు కలిపి 46 మంది సభ్యులున్నారు. అందరూ కలిసినా ఇంకా రెండు ఓట్లు తక్కువవుతాయి. వాటికోసం ఇండిపెండెంట్లపై ఆధారపడాల్సి రావచ్చు. బీజేపీ నుంచి ఒకరు, కాంగ్రెస్ లేదా జేడీ(ఎస్) నుంచి ఇంకొకరు ఎన్నికయ్యే అవకాశాలున్నాయి.

జార్ఖండ్ (2 స్థానాలు)

అధికారంలో ఉన్న బీజేపీకి 43 మంది సభ్యులున్నారు. కాగా రాజ్యసభ అభ్యర్థికి 28 ఓట్లు కావాలి. సొంత బలంతో ఒక్కరిని మాత్రమే గెలిపించుకోగలిగినప్పటికీ బీజేపీ మరొకరిని బరిలోకి దించింది. ఇక కాంగ్రెస్(7), జేవీఎం (2) మద్దతునిస్తే జార్ఖండ్ ముక్తిమోర్చా (19) తన అభ్యర్థిని రాజ్యసభకు పంపే అవకాశాలున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోని ఏకైక స్థానంలో బీజేపీ, కాంగ్రెస్ పోటీ పడుతున్నాయి. అలాగే కేరళలో వామపక్షాల అభ్యర్థితో కాంగ్రెస్ పోటీ పడుతున్నది.

రాజ్యసభకు లక్ష్మీపుత్రులు!

- అభ్యర్థుల్లో 87 శాతం మంది కోటీశ్వరులే
- 16 మంది అభ్యర్థులపై క్రిమినల్ కేసులు

రాజ్యసభ అభ్యర్థుల్లో 87 శాతం మంది కోట్లకు పడగలెత్తిన లక్ష్మీపుత్రులే. వీరిలో అత్యధికంగా జేడీయూ నుంచి పోటీ చేస్తున్న మహేంద్ర ప్రసాద్ అత్యధికంగా రూ.4,078 కోట్ల ఆస్తులు కలిగి ఉన్నట్టు ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం (ఏడీఆర్) వెల్లడించింది. జయాబచ్చన్(ఎస్పీ) రూ.1,001 కోట్లు, బీఎం ఫరూఖ్(జేడీఎస్) రూ.766 కోట్లు, అభిషేక్ సింఘ్వి(కాంగ్రెస్) రూ.649 కోట్లు, సీఎం రమేశ్(టీడీపీ) రూ.258 కోట్ల ఆస్తి కలిగి ఉన్నట్లు పేర్కొన్నది. 58 రాజ్యసభ సీట్లకు పోటీలో నిలిచిన 64 మంది అభ్యర్థుల్లో 87 శాతంమంది కోటీశ్వరులని ఏడీఆర్ వివరించింది. మొత్తం అభ్యర్థుల్లో 16 మంది అభ్యర్థులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.

'బ్రహ్మోస్' సక్సెస్

లక్ష్యాన్ని ఛేదించిన సూపర్ సోనిక్ క్రూయిజ్ మిసైల్



న్యూఢిల్లీ, మార్చి 22: రష్యా, భారత్ సంయుక్తంగా రూపొందించిన బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి పరీక్ష గురువారం విజయవంతమైంది. ఉదయం 8.42గంటలకు రాజస్థాన్‌లోని పొఖ్రాన్ పరీక్ష కేంద్రం నుంచి దీనిని పరీక్షించారు. అనంతరం రక్షణ మంత్రి నిర్మల సీతారామన్ ట్వీట్ చేస్తూ 'బ్రహ్మోస్ క్షిపణి పరీక్ష విజయవంతమైంది. నిర్దేశించిన లక్ష్యాన్ని కచ్చితంగా ఛేదించింది. ఈ పరీక్ష విజయవంతం కావడంతో మన జాతీయ భద్రతకు మరింత శక్తి లభించినట్లైంది. పరీక్షను విజయవంతం చేసిన రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో)కు శుభాకాంక్షలు' అని పేర్కొన్నారు. మొదటిసారిగా క్షిపణి ధ్వనివేగానికి 3రెట్ల(మాక్ 3)తో ప్రయాణించిందని, ఈ పరీక్షలో స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 'సీకర్' టెక్నాలజీని వినియోగించామని చెప్పారు. సీకర్ టెక్నాలజీని డీఆర్‌డీవో అభివృద్ధి చేసిందని, లక్ష్యాన్ని కచ్చితంగా ఛేదించడంలో ఈ టెక్నాలజీ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. డీఆర్‌డీవో శాస్త్రవేత్తలు, సైన్యం, నౌకాదళ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో క్షిపణి పరీక్ష జరిగిందని రక్షణ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. క్షిపణి లక్ష్యఛేదన దూరాన్ని 200 నుంచి 400 కిలోమీటర్ల వరకు పెంచుతున్నామని పేర్కొంది. బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణిని ఇప్పటికే సైన్యం, నౌకాదళంలో ప్రవేశపెట్టామని వివరించింది.

ప్రత్యేకతలు

- సుఖోయ్ యుద్ధ విమానాల నుంచి బ్రహ్మోస్ క్షిపణిని ప్రయోగిస్తారు.
- భారత ఆయుధ సంపత్తిలో ఈ క్షిపణి అత్యంత కీలకమైంది.
- 2006లో సైన్యం, నౌకాదళంలో దీనిని ప్రవేశపెట్టారు.
- క్షిపణి లక్ష్యాన్ని(ప్రయాణ దూరాన్ని) పెంచడంతోపాటు సుఖోయ్ యుద్ధ విమానాల ఆధునీకరణ ప్రారంభమైంది.
- ఈ ఆధునీకరణ పూర్తి అయితే ఎలాంటి లక్ష్యానైనా ఛేదించగలదు.
- ప్రపంచంలోనే అత్యంత వేగంగా దూసుకెళ్లే సామర్థ్యం బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణికి ఉంది.
- ఈ క్షిపణిని రష్యా, భారత్ సంయుక్తగా రూపొందించాయి. ఈ నేపథ్యంలో భారత్‌లోని బ్రహ్మపుత్ర నది, రష్యాలోని మోస్క్వా నది పేర్లను కలిపి బ్రహ్మోస్ అని నామకరణం చేశారు.

పాక్‌కు చైనా 'క్షిపణి ట్రాకింగ్ వ్యవస్థ'



బీజింగ్, మార్చి 22: చైనా తన మిత్రపక్షం పాకిస్థాన్‌కు శక్తిమంతమైన, అధునాతన 'క్షిపణి ట్రాకింగ్ వ్యవస్థ'ను విక్రయించింది. ఈ విషయాన్ని చైనీస్ అకాడమీ సైన్సెస్ (కాస్) తెలిపింది. ఈ క్షిపణి ట్రాకింగ్ వ్యవస్థ సాయంతో పాకిస్థాన్ పలు అణ్వస్త్రాలను మోసుకెళ్లే సామర్థ్యం గల క్షిపణులను అభివృద్ధి చేసుకునేందుకు వీలవుతుంది. ఈ క్షిపణి ట్రాకింగ్ వ్యవస్థలో ఆప్టికల్ సిస్టమ్ కీలకం కానున్నది. ప్రయోగించిన క్షిపణి నిర్దేశిత లక్ష్యాల దిశగా ప్రయాణిస్తున్న దృశ్యాలను స్వతస్సిద్ధంగా చిత్రీకరించేందుకు లేజర్ రేంజర్, ఇన్‌ఫ్రారెడ్ డిటెక్టర్‌తో కూడిన హైస్పీడ్ కెమెరా గల టెలీస్కోప్‌లు ఈ వ్యవస్థలో అందుబాటులో ఉంటాయి. ఇది ప్రయోగ వేదిక నుంచి క్షిపణి ప్రయాణంలో వివిధ దశలపై హై రిజల్యూషన్ చిత్రాలను రికార్డు చేస్తుంది. ఈ క్షిపణి వ్యవస్థ కోసం చైనాకు పాకిస్థాన్ ఎంత చెల్లించిందన్న వివరాలు బయటకు రాలేదు. ఇప్పటి వరకు పాకిస్థాన్‌కు చైనా యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, యుద్ధ విమానాలను భారీస్థాయిలో విక్రయించింది. బీజింగ్, షాంఘైల్లోని లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం గల అత్యాధునిక ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి (ఐసీబీఎం) 'అగ్ని'ని విజయవంతంగా భారత్ ప్రయోగించిన తర్వాత క్షిపణి ట్రాకింగ్ వ్యవస్థను పాక్‌కు చైనా విక్రయించడం గమనార్హం.

మావోయిస్టు కీలక నేత
అరవింద్‌జీ గుండెపోటుతో మృతి

- తలపై రూ.1.5 కోట్ల రివార్డు




న్యూఢిల్లీ, మార్చి 22: జార్ఖండ్ టాప్ నక్సల్ కమాండర్ దేవ్‌కుమార్‌సింగ్ అలియాస్ అరవింద్‌జీ (50) మృతి చెందారు. అరవింద్‌జీ ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని జార్ఖండ్ అడవుల్లో బుధవారం గుండెపోటుతో మరణించారని సీఆర్పీఎఫ్ అధికారి ఒకరు మీడియాకు చెప్పారు. నిషేధిత సీపీఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ సభ్యుడైన అరవింద్‌జీ తలపై బీహార్, జార్ఖండ్ ప్రభుత్వాలు రూ.1.5 కోట్ల రివార్డు ప్రకటించాయి. మావోయిస్టు ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన అరవింద్‌జీ అంతర్‌జిల్లా తీవ్రవాద కార్యకలాపాల్లో ఆరితేరినట్టు చెబుతారు. ఇదిలా ఉండగా, ఛత్తీస్‌గఢ్‌లో ముగ్గురు మావోయిస్టులను అరెస్టు చేశామని పోలీసులు వెల్లడించారు.

బీజేపీకి వ్యతిరేకంగా కూటమి: శరద్ యాదవ్

లక్నో, మార్చి 22: వచ్చే ఏడాది జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో మతతత్వ బీజేపీని ఓడించడానికి కూటమి దిశగా అడుగులు వేస్తున్నామని జనతాదళ్(యూ) మాజీ నేత శరద్ యాదవ్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'సామాజిక న్యాయం కోసం పోరాటం దేశంలోనే అతిపెద్ద పోరాటం. బీజేపీ మతోన్మాదాన్ని అడ్డుకునే శక్తి ఈ పోరాటానికి మాత్రమే ఉంది. అందుకే దేశవ్యాప్తంగా పర్యటిస్తున్నా. ప్రజలను కలుస్తున్నా. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించడానికి అతిపెద్ద కూటమి ఏర్పడుతుందన్న నమ్మకం నాకు ఉంది' అని శరద్ యాదవ్ పేర్కొన్నారు.

జయ ఉన్నన్ని రోజులూ సీసీటీవీ కెమెరాలు బంద్ చేశాం!

- 24 గదుల ఐసీయూలో జయలలిత ఒక్కరే పేషెంట్
- మిగతా బెడ్లన్నీ ఖాళీగా ఉంచాం: అపోలో చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



న్యూఢిల్లీ, మార్చి 22: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత మరణించి సంవత్సరానికి పైగా అవుతున్నా ఆమె మృతిపై చర్చ కొనసాగుతూనే ఉన్నది. జయలలిత చివరి రోజుల్లో ఆమె వీడియోలను చిత్రీకరించామని జయకు అత్యంత సన్నిహితురాలైన వీకే శశికళ విచారణ కమిషన్ ముందు వెల్లడించారు. అయితే అపోలో హాస్పిటల్స్ వ్యవస్థాపక చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి మాత్రం జయ ఉన్నన్ని రోజులూ సీసీటీవీ కెమెరాలు స్విచ్ఆఫ్ చేశామని పేర్కొన్నారు. గురువారం చెన్నైలో ఆయన మీడియాతో మాట్లాడుతూ జయలలిత దవాఖానలో ఉన్న 75 రోజులపాటు సీసీటీవీ కెమెరాలను స్విచ్ఆఫ్ చేశామని పేర్కొన్నారు. 'జయ సంబంధీకులు అన్ని సీసీటీవీ కెమెరాలను 75 రోజులపాటు స్విచ్ఆఫ్ చేశారు. చికిత్స పొందుతున్న దివంగత నాయకురాలిని ఎవరూ చూడొద్దని వారు భావించారు. జయలలిత ఐసీయూలో చేరగానే అందులోకి ప్రవేశాన్ని పూర్తిగా నిలిపేశారు. ఇతర పేషెంట్లను మరో ఐసీయూకి తరలించాం. ఆమెను కలిసేందుకు ఎవర్నీ అనుమతించలేదు. ఆమెను బతికించేందుకు మేం చేయాల్సినంతా చేశాం' అని ఆయన పేర్కొన్నారు.

కుప్వారాలో హతమైన ఐదుగురూ విదేశీ ఉగ్రవాదులే

- అదృశ్యమైన జవాన్ కోసం గాలింపు

శ్రీనగర్, మార్చి 22: జమ్ము కశ్మీర్‌లోని కుప్వారాలో జరిగిన సుదీర్ఘ ఎన్‌కౌంటర్‌లో హతమైన అనుమానిత లష్కరే తాయిబా ఉగ్రవాదులంతా విదేశీయులేనని పోలీసులు గురువారం ప్రకటించారు. అడవిలో అదృశ్యమైన ఆర్మీ జవాన్ కోసం భద్రతాదళాలు విస్తృతంగా గాలిస్తున్నాయని పేర్కొన్నారు. బుధవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్లో ఐదుగురు ఉగ్రవాదులు హతంకాగా, ముగ్గురు జవాన్‌లతోపాటు ఇద్దరు పోలీసులు సైతం అసువులుబాసిన విషయం తెలిసిందే. నియంత్రణ రేఖకు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో హల్మత్‌పురా ప్రాంతంలో ఉగ్రవాదులను పోలీసులు అడ్డుకున్న సమయంలో ఎన్‌కౌంటర్ జరిగిందని పోలీసు అధికారులు తెలిపారు. ఉగ్రవాదులు శామ్సాబరి పర్వతశ్రేణుల్లోని రెండు కొండలను దాటిన తర్వాత గుహల్లో తలదాచుకున్నారని పోలీసువర్గాలు పేర్కొన్నాయి. ఉగ్రవాదులు ఎల్‌వోసీ దాటి వ్యాలీలో ఉన్న తమ సహచరుల్ని కలుసుకున్నారని, కుప్వారా పట్టణంలో పోలీసు సిబ్బందిపై దాడి లక్ష్యంగా పనులు మొదలుపెట్టారని అధికారులు తెలిపారు.

గుజరాత్‌లో కూలిన నౌకాదళ డ్రోన్

అహ్మదాబాద్, మార్చి 22: భారత నౌకాదళానికి చెందిన రిమోట్‌తో నడిచే విమానం (ఆర్పీఏ) గుజరాత్‌లోని ఉల్లాస్‌నగర్ ప్రాంతంలో గురువారం కూలిపోయింది. ఈ ఘటనలో ఎలాంటి నష్టమూ వాటిల్లలేదని నౌకాదళం తెలిపింది. పోరుబందర్ నుంచి ఎగిరిన కొద్దిసేపటికే ఇంజిన్‌లో లోపం వల్ల ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమిక ఆధారాలను బట్టి తెలుస్తున్నదని వెల్లడించింది.

మాల్దీవుల్లో ఎమర్జెన్సీ ఎత్తివేత

మాలె, మార్చి 22: మాల్దీవుల్లో 45 రోజులుగా కొనసాగుతున్న ఎమర్జెన్సీని తొలగిస్తున్నట్లు ఆ దేశాధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ వెల్లడించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేసేందుకు యమీన్ నిరాకరించడంతో మాల్దీవుల్లో రాజకీయ సంక్షోభం తలెత్తింది. దీంతో తన అధ్యక్ష పీఠానికి ముప్పు వాటిల్లే ప్రమాదాన్ని ముందే పసిగట్టిన అబ్దుల్లా యమీన్ ఫిబ్రవరి 5న ఎమర్జెన్సీని ప్రకటించారు.

థాయిలాండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- 18 మంది దుర్మరణం.. 28 మందికి గాయాలు

బ్యాంకాక్, మార్చి 22: థాయిలాండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ బస్సు చెట్టును ఢీకొన్న ఘటనలో 18 మంది దుర్మరణం చెందగా, మరో 28 మంది గాయపడ్డారు. సెలవు ముగించుకొని డబుల్ డెక్కర్ బస్సులో 50 మంది ఇండ్లకు తిరిగి వస్తుండగా బుధవారం ఈ ప్రమాదం జరిగింది. మృతుల్లో ఒక బాలుడుసహా 12 మంది మహిళలు, ఆరుగురు పురుషులు ఉన్నారు.

సిరియాలో స్కూల్‌పై దాడి: 20 మంది మృతి

బీరూట్ : సిరియాలోని ఇడ్లిబ్ ప్రావిన్స్‌లో ఓ స్కూల్ సమీపంలో వైమానిక దాడి జరుగడంతో 16 మంది చిన్నారులు సహా మొత్తం 20 మంది పౌరులు దుర్మరణం చెందారు. ఎవరు ఈ వైమానిక దాడికి పాల్పడింది తెలియడం లేదని మానవ హక్కుల సంస్థ పేర్కొన్నది. విద్యార్థులు స్కూల్ నుంచి బయటకు వస్తున్నప్పుడు ఈ దాడి జరుగడంతో మృతుల సంఖ్య పెరిగిందని వెల్లడించింది.

సారీ.. పొరపాటైంది!

- తప్పుల్ని, లోపాల్ని సరిదిద్దుకుంటున్నాం
- మా ఖాతాదారుల వివరాలను భద్రంగా ఉంచే బాధ్యత నాది
- భారత్ సహా ఏ దేశ ఎన్నికల ప్రక్రియలోనూ జోక్యం చేసుకోం
- ఫేస్‌బుక్ సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ స్పష్టీకరణ



వాషింగ్టన్/న్యూఢిల్లీ, మార్చి 22: కోట్లాదిమంది వినియోగదారుల వ్యక్తిగత సమాచారం దుర్వినియోగమైందంటూ సోషల్‌మీడియా దిగ్గజం ఫేస్‌బుక్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఆ సంస్థ సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ ఎట్టకేలకు స్పందించారు. యూజర్ల సమాచారాన్ని రహస్యంగా ఉంచడంలో తమ నుంచి పొరపాటు జరిగిందని అంగీకరిస్తూ.. 'సారీ' చెప్పారు. గురువారం తన ఫేస్‌బుక్ ఖాతా ద్వారా జుకర్‌బర్గ్ సుదీర్ఘ వివరణ ఇచ్చారు. 'ఫేస్‌బుక్‌ను నేను ప్రారంభించాను. ఈ సామాజిక మాధ్యమ వేదికపై ఏం జరిగినా దానికి నాదే బాధ్యత. వినియోగదారుల వివరాలను, సమాచారాన్ని భద్రంగా ఉంచే బాధ్యత మాపై ఉంది. ఒకవేళ అలా చేయలేకపోతే మీకు సేవలందించే అర్హత కోల్పోయినట్లే. అయితే మేం కూడా పొరపాట్లు చేస్తుంటాం. ఏం జరిగిందో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. మరోసారి ఇలాంటివి జరుగకుండా చర్యలు తీసుకుంటాం' అని తన ఫేస్‌బుక్ పోస్టులో పేర్కొన్నారు. 'ఫేస్‌బుక్‌కు అనుసంధానంగా పనిచేస్తున్న వేలాది యాప్‌లను క్షుణ్ణంగా పరిశీలిస్తాం. అంతేగాక.. మూడునెలలపాటు ఓ వ్యక్తి ఫేస్‌బుక్‌ను వినియోగించకపోతే, ఆయనకు సంబంధించిన వివరాలను యాప్‌లు తెలుసుకోకుండా ఉండేలా డెవలపర్ యాక్సెస్‌ను తొలిగిస్తాం. దీంతోపాటు ఫేస్‌బుక్ ఖాతాను తెరిచే సమయంలో అడిగే లాగిన్ వివరాలను కూడా తగ్గిస్తాం. త్వరలోనే మరిన్ని మార్పులతో కొత్త వెర్షన్‌ను మీ ముందుకు తెస్తాం' అని తెలిపారు. అయితే ఫేస్‌బుక్ తీసుకుంటున్న చర్యలు సరిపోవని, జుకర్‌బర్గ్ చెబుతున్న చర్యలు ఫలితాన్నిస్తాయని తాను అనుకోవడం లేదని బ్రిటన్ మంత్రి మాట్ హన్‌కాక్ అభిప్రాయపడ్డారు.

భద్రతా ప్రమాణాలను పెంచుతున్నాం

భారత్, బ్రెజిల్ సహా ప్రపంచవ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియలో తమ జోక్యం ఉండబోదని జుకర్‌బర్గ్ న్యూయార్క్‌టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. భారత ఎన్నికల ప్రక్రియను ఫేస్‌బుక్ ఏమాత్రం ప్రభావితం చేసినా సహించబోమని, కఠిన చర్యలకూ వెనుకాడబోమని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసా ద్ బుధవారం హెచ్చరించిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన జుకర్‌బర్గ్.. 'మరో ఏడాదిలో భారత్‌లో, బ్రెజిల్‌లో సార్వత్రిక ఎన్నికలున్నాయి. పలు ప్రపంచదేశాల్లో త్వరలో ఎన్నికలు రానున్నాయి. ఎన్నికల ప్రక్రియను సురక్షితంగా ఉంచేందుకు ఫేస్‌బుక్ కట్టుబడి ఉంది. మమ్మల్ని నమ్మండి. వినియోగదారుల సమాచారం దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకుంటాం' అని జుకర్‌బర్గ్ తెలిపారు. అయితే నవంబర్‌లో అమెరికాలో జరుగనున్న మధ్యంతర ఎన్నికలను ప్రభావితం చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని సీఎన్ఎన్ చానల్‌తో మాట్లాడుతూ జుకర్‌బర్గ్ ఆరోపించారు. కాగా డాటా భద్రతకు భారత్‌లో తగిన చట్టపరమైన రక్షణలేవీ లేవని జస్టిస్ బీఎన్ శ్రీకృష్ణ అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టు నియమించిన డాటా భద్రత చట్టాల రూపకల్పన బృందానికి సారథ్యం వహించిన జస్టిస్ బీఎన్ శ్రీకృష్ణ తాజా ఫేస్‌బుక్ వివాదం నేపథ్యంలో స్పందించారు.

కొనసాగుతున్న బీజేపీ, కాంగ్రెస్ ఆరోపణ పర్వం

డేటాచౌర్యానికి పాల్పడిన కేంబ్రిడ్జ్ అనలిటికాతో సంబంధాలపై పరస్పర ఆరోపణలు చేసుకుంటున్న బీజేపీ, కాంగ్రెస్ గురువారం కూడా మాటలదాడిని కొనసాగించాయి. కాంగ్రెస్‌కు, కేంబ్రిడ్జ్ అనలిటికా(సీఏ)తో సంబంధాలను అంటగట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఇరాక్‌లో 39మంది భారతీయులు హత్యకు గురైన ఉదంతం నుంచి దృష్టిని మరల్చేందుకే ఇలాంటివి సృష్టిస్తున్నారని ట్విట్టర్‌లో ఆయన విమర్శించారు. కాగా, రాహుల్ జీఎస్టీని 'గబ్బర్‌సింగ్ ట్యాక్స్'గా ప్రచారం చేయడం, ప్రగతి వెర్రితలలు వేస్తున్నదంటూ వ్యాఖ్యలు చేయడం వెనుక సీఏ ప్రమేయముందని కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు. సామాజిక మాధ్యమాల్లో రాహుల్‌కు ప్రాచుర్యాన్ని కల్పించేందుకు సీఏతో కాంగ్రెస్ చేతులు కలిపిందని విమర్శించారు.

గఘన సేవల శంషాబాద్

జీఎంఆర్ ఎయిర్‌పోర్టు పదేండ్ల ప్రస్థానం

రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు(ఆర్జీఐఏ) దశాబ్దకాలంగా నిరాటంకంగా సేవలు అందిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఘనత సాధించింది.. ఏటా లక్షల మందిని దేశ, విదేశాలకు చేరవేస్తూ పలు అంతర్జాతీయఅవార్డులను అందుకున్నది. హైదరాబాద్‌తోపాటు, భారతదేశ ఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాపింపచేసింది. దేశాభివృద్ధిలో కీలకంగా ఉంటూ జాతీయ స్థూల ఉత్పత్తిలో తనదైన బాధ్యతను నెరవేరుస్తున్నది. శుక్రవారంతో పదేండ్లు పూర్తి చేసుకుంటున్న హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై ప్రత్యేక కథనం..

- హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ

ఇలా మొదలు

హైదరాబాద్ శివారులోని శంషాబాద్ సమీపంలో జాయింట్ వెంచర్‌లో భాగంగా జీఎంఆర్ గ్రూపు విమానాశ్రయ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో జీఎంఆర్ భాగస్వామ్యం 63 శాతం కాగా, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా వాటా 13 శాతం, గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ 13 శాతం, మలేషియా ఎయిర్‌పోర్టు హోల్డింగ్స్ బెర్‌హర్డ్ 11శాతంగా ఉంది. కేవలం 31 నెలల కాలంలోనే జీఎంఆర్ గ్రూపు ఈ ప్రాజెక్టును పూర్తిచేసి రికార్డు సృష్టించింది. పబ్లిక్, ప్రైవేటు పార్టనర్‌షిప్ (పీపీపీ) మోడల్‌లో దేశంలోనే నిర్మించిన మొట్టమొదటి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుగా ఘనతకెక్కింది. ఇది జీఎంఆర్ గ్రూపు ఏవియేషన్‌లో చేపట్టిన మొట్టమొదటి నిర్మాణమైనప్పటికీ ప్రతీ అంశంలోనూ ప్రత్యేకతను చాటింది.

30 మిలియన్లు

ఏడాదికి 12 మిలియన్ల మంది ప్రయాణించే సామర్థ్యంతోపాటు 1.5 మెట్రిక్ టన్నుల కార్గో ట్రాన్స్‌పోర్టు కెపాసిటీతో నిర్మించిన ఈ విమానాశ్రయం ప్రస్తుతం అంచనాకు మించిన డిమాండ్‌తో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నది.

2008-2009లో 6.2 మిలియన్ల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసిన ఎయిర్‌పోర్టు 2017-18లో 18 మిలియన్ల మందిని చేరవేసి రికార్డులకెక్కింది. క్రమంగా పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఏటా 30 మిలియన్ల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ప్రారంభించిన మొదట్లో ఇక్కడి నుంచి 28 ప్రాంతాలకు ప్రయాణ సౌకర్యాన్ని అందించిన ఎయిర్‌పోర్టు ప్రస్తుతం 9 డొమెస్టిక్, 15 విదేశీ, 3 ఇండియన్ కారియర్స్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా 60 ప్రాంతాలకు సేవలు అందిస్తున్నది.

దక్షిణ భారతదేశంతోపాటు, సెంట్రల్ ఇండియాకు కూడా ఈ ఎయిర్‌పోర్టు హబ్‌గా రూపొందనున్నది. ఇండిగో కూడా తమ ప్రైమరీబేస్ ఆపరేషన్స్‌కు ఇటీవలే హైదరాబాద్ ఎయిర్‌పోర్టును ఎంపికచేసుకుంది. ప్రపంచంలోనే పెద్ద ఎయిర్‌క్రాఫ్ట్ ఏఎన్ 225 మ్రియా కూడా ఆర్జీఐ ఎయిర్‌పోర్టులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ల్యాండ్ అయింది.

50 శాతం పెరిగిన వృద్ధిరేటు

2017 నుంచి ఎయిర్‌లైన్స్ శ్రీలంకన్, జజీరా ఎయిర్‌వేస్ కొత్తగా ఇక్కడినుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. అంతేగాకుండా కొలంబో, వాషింగ్టన్ డీసీ, కువైట్, షార్జా, దోహ తదితర ప్రాంతాలకు ఇక్కడినుంచి సర్వీసులు అందిస్తున్నారు. డొమెస్టిక్ ఆపరేషన్స్‌లో భాగంగా మంగళూరు, జబల్‌పూర్, ఛండీఘడ్, త్రివేండ్రం, కడప, నాందేడ్, పాట్నా, సూరత్, గౌహతి, రాంచి, షిర్డీ, విద్యానగర్ (బళ్లారి), పుదుచ్చేరి, నాగ్‌పూర్ ప్రాంతాలకు కనెక్టివిటీ పెంచుకుంది. డొమెస్టిక్ ప్రయాణికుల విషయంలో గతంతో పోలిస్తే రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు 50 శాతం వృద్ధిరేటు సాధించింది. ప్యాసింజర్ ఈజ్ ప్రైం ప్రోగ్రాం క్రింద ప్యాసింజర్లకు సహాయసహకారాలు అందచేసే వేదిక కూడా ఏర్పాటుచేశారు.



పారిశ్రామిక, ఆర్థిక ప్రగతికి ఊతం



ఆర్జీఐ ఎయిర్‌పోర్టు పారిశ్రామిక, ఆర్థిక ప్రగతికి ఊతమిస్తున్నది. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తూ వ్యాపార, విద్య, వైద్య, ఫన్‌పోర్టు, లాజిస్టిక్ పార్క్ అండ్ ఏరోస్పేస్ పార్క్ అభివృద్ధికి దోహదం చేస్తున్నది. ఏడాదికి 1.5 లక్షల మెట్రిక్ టన్నుల కార్గో సేవలు అందిస్తున్నది. కార్గో సేవల్లో ఫార్మా ఇండస్ట్రీ నుంచే ఎక్కువ ఎగుమతులు జరుగుతున్నాయి. వస్తురవాణా చేసే 5 షెడ్యూల్డ్ ఎయిర్‌లైన్స్ లుఫ్తానియా, కాథే పసిఫిక్, టర్కిష్, కతార్ ఎయిర్‌వేస్ అండ్ బ్లూడార్ట్ ఇక్కడి నుంచి ఆపరేట్ చేయబడుతున్నాయి. వీటితోపాటు షావగోన్, ఇతిహాడ్ కార్గో, రష్యా, పోలేస్టర్ ఫ్లైటర్స్ కూడా ఇక్కడ నుంచే ఆపరేట్ చేయబడుతున్నాయి. ఇండియాలో ఫ్రీట్రేడ్ జోన్ ఉన్న ఒకే ఒక ఎయిర్‌పోర్టుగా ఆర్జీఐకి గుర్తింపు ఉంది. దీనికోసం 19.85 ఎకరాల భూమి కేటాయించి దీనిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.

పటిష్టమైన భద్రత

అత్యంత అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఎయిర్‌పోర్టులో పటిష్టమైన భద్రత, మెరుగైన ఆపరేషన్స్ నిర్వహిస్తున్నారు. ఎయిర్‌పోర్టు ఆపరేషన్స్ కంట్రోల్ సెంటర్(ఏఓసీసీ) విధానం ద్వారా ప్యాసింజర్ ఇన్ఫర్మేషన్ అండ్ డిస్‌ప్లే సిస్టమ్స్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఎండ్ టూ ఎండ్ ఈ-బోర్డింగ్ సొల్యూషన్‌తో సెక్యూరిటీ చెకింగ్ లేకుండానే డిపార్చర్ గేట్ ఎంట్రీలోకి వెళ్లొచ్చు.



పర్యావరణంపై ప్రత్యేక దృష్టి

ప్రయాణ సౌకర్యమే గాకుండా పర్యావరణహితంగానూ ఎయిర్‌పోర్టును డిజైన్ చేశారు. ఇప్పటికే యూఎస్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ చేత లీడ్ సర్టిఫికేషన్ పొందింది. శబ్దకాలుష్యం లేకుండా, కర్బన ఉద్గారాలు బయట పర్యావరణానికి చేటు కల్గించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.త్వరలో ఎయిర్‌పోర్టులో 100 శాతం ఎల్ఈడీ బల్బులు ఏర్పాటుచేయనున్నారు. 10 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటుచేసుకోవడంతోపాటు, వ్యర్థపదార్థాలనుంచి కాలుష్యం వెదజల్లకుండా ఏర్పాట్లు చేశారు. వర్షపునీటిని వృథాకాకుండా రేయిన్ వాటర్ హర్వెస్టింగ్ చేస్తున్నారు.



దశాబ్ది వేడుకలకు సీఎం కేసీఆర్

శంషాబాద్: శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయ పదో వార్షికోత్సవాలకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని జీఎంఆర్ కమ్యూనికేషన్ ప్రతినిధివర్గాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపాయి. శుక్రవారం జరిగే ఈ వేడుకల్లో కేంద్ర సివిల్ ఏవియేషన్ సహాయమంత్రి జయంత్‌సిన్హా, రాష్ట్రమంత్రులు కేటీఆర్, మహేందర్‌రెడ్డి, ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, కేంద్ర సివిల్ ఏవియేషన్ మంత్రిత్వశాఖ కార్యదర్శి రాజీవ్‌చోబే, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి తదితరులు కూడా పాల్గొంటారని ఆ వర్గాలు పేర్కొన్నాయి. సాయంత్రం 3 గంటలకు ఎయిర్‌పోర్టులోని హజ్ టర్మినల్‌లో వేడుకలు ప్రారంభమవుతాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎయిర్‌పోర్టు విస్తరణ పనులకు శంకుస్థాపన చేయడంతోపాటు, ఎయిర్‌పోర్టు సిటీ లాంచింగ్, కన్వెన్షన్ సెంటర్, ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తారని, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సెంటర్‌ను సందర్శిస్తారని ఎయిర్‌పోర్టువర్గాలు వెల్లడించాయి.

ట్రాన్సిస్ట్ హబ్‌గా ఆర్జీఐఏ

జీఎంఆర్ సీఈవో ఎస్‌జీకే కిశోర్



వచ్చే 5 నుంచి 10 ఏండ్లలో రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ట్రాన్సిస్ట్‌హబ్‌గా మారుస్తామని జీఎంఆర్ హైదరాబాద్ విమానాశ్రయం సీఈవో ఎస్‌జీకే కిశోర్ తెలిపారు. హైదరాబాద్ ద్వారా ఎక్కువ విమానాలు రాకపోకలు సాగించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. సంస్కరణల్లో భాగంగా ఈ-బోర్డింగ్ అమలుతోపాటు హ్యాండ్ బ్యాగేజ్ స్టాంపింగ్‌ను తీసేసినట్టు వివరించారు. భవిష్యత్తులో పేపర్‌లెస్ ట్రావెల్‌ను అందిస్తామన్నారు. టికెట్ స్థానంలో బయోమెట్రిక్ ఐడెంటిఫికేషన్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. దేశంలోనే మొదటి స్మార్ట్ ఆర్జీఐఏను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.

అంతర్జాతీయ అవార్డులు సొంతం

ఎయిర్‌పోర్టు ప్రారంభమైన 2008లోనే 'లీడర్‌షిప్ ఇన్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ డిజైన్'(లీడ్) అవార్డును కైవసం చేసుకుంది. డిజైన్, సహజ వెలుగులు, ఇతర పీచర్లకు ఈ అవార్డు లభించింది. ఇంధనం, నీటి వంటి సహజ వనరుల పరిరక్షణకు చేసిన కృషికి సిల్వర్ సర్టిఫికేషన్ పొందింది. 2009లోనే ఆర్జీఐ విమానాశ్రయం ప్రపంచంలోనే నంబర్‌వన్ ఎయిర్‌పోర్టుగా ప్రకటించబడింది. ఎయిర్‌పోర్టు కౌన్సిల్ ఇంటర్నేషనల్ చేసే ఎయిర్‌పోర్టు సర్వీస్ క్వాలిటీలో పదేండ్ల కాలంలో ఆర్జీఐ ఎయిర్‌పోర్టు మొదటి మూడుస్థానాల్లోనే కొనసాగుతున్నదంటే ఎంతటి ఉత్తమ సేవలను అందిస్తున్నదో అర్థం చేసుకోవచ్చు.

150 కోట్ల ప్రభుత్వ భూమి స్వాధీనం

- ఖాజాగూడలో ఐదెకరాల భూ కేటాయింపు రద్దుచేసిన సర్కారు
- నిబంధనలను ఉల్లఘించిన పసిఫిక్ హెల్త్‌కేర్ హోల్డింగ్ సంస్థపై కొరడా
- ప్రభుత్వభూమిని తాకట్టు పెట్టి బ్యాంకులకు కోట్ల రూపాయలు కుచ్చుటోపీ పెట్టిన సంస్థ

రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ప్రభుత్వం నుంచి అప్పనంగా భూములు పొంది వాటిని దుర్వినియోగం చేస్తున్న సంస్థలపై రంగారెడ్డి జిల్లా రెవెన్యూ యంత్రాంగం కొరడా ఝులిపించింది. నిబంధనలను ఉల్లఘించినందుకు శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడలో ఓ ప్రైవేట్ వైద్య సంస్థకు కేటాయించిన ఐదెకరాల భూమిని వెనక్కి తీసుకున్నది. జిల్లా కలెక్టర్ ఎం రఘునందన్‌రావు ఆదేశాల మేరకు పసిఫిక్ హెల్త్ కేర్ హోల్డింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు కేటాయించిన ఐదెకరాల భూమిని గురువారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. ఈ భూమి విలువ రూ.150 కోట్ల దాకా ఉంటుంది. 2005లో పసిఫిక్ హెల్త్‌కేర్ హోల్డింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడలో సర్వేనంబర్ 28లో ఐదెకరాల భూమిని నామమాత్రపు ధరకు కేటాయించింది. వైద్యరంగంలో ప్రజలకు సేవలందిస్తామంటూ ప్రభుత్వం నుంచి అప్పనంగా భూమిని పొందిన సదరు కంపెనీ యజమానులు, వందల కోట్ల విలువచేసే ప్రభుత్వ భూమిని రెండేండ్ల కిందట హైదరాబాద్‌లోని పలు బ్యాంకుల్లో తాకట్టు (మార్టిగేజ్) పెట్టి 22 కోట్ల రూపాయల రుణాలు తీసుకొన్నారు. ఆ రుణాలతో దవాఖాన నిర్మాణం చేపట్టలేదు సరికదా.. అప్పులు తిరిగి చెల్లించకుండా బ్యాంకులకు కుచ్చుటోపీ పెట్టారు. మరో వైపు 2007లో సంస్థ ఎగ్జిక్యూటివ్ బాడీని కూడా మార్చేందుకు ప్రయ త్నించారు. పసిఫిక్ హెల్త్‌కేర్ హోల్డింగ్ మోసాన్ని గ్రహించిన బ్యాంకుల అధికారులు అప్పులను రాబట్టుకొనేందుకు తమ వద్ద తాకట్టు పెట్టిన ఖాజాగూడ ప్రభుత్వ భూమిని వేలం వేసేందుకు ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న రెవె న్యూ అధికారులు బ్యాంకు అధికారుల భూవేలా న్ని అడ్డుకున్నారు. నిబంధనలను ఉల్లంఘించినందుకు పసిఫిక్ హెల్త్‌కేర్ హోల్డింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ భూ కేటాయింపును రద్దు చేయాలని అప్పటి జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి నివేదికను అందజేశారు. కలెక్టర్ సిఫార్సును ప్రభుత్వం ఆమోదించింది. న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకొని భూ కేటాయింపును రద్దుచేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అయినా, ఈ ఉత్తర్వులపై స్టే పొందడానికి పసిఫిక్ హెల్త్ కేర్ హోల్డింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు విశ్వప్రయత్నాలు చేశారు. దీంతో అప్రమత్తమైన రెవెన్యూ యంత్రాంగం.. కలెక్టర్ రఘునందన్‌రావు ఆదేశాలతో గురువారం హుటాహుటిన ఖాజాగూడ సర్వే నంబర్ 28లో గల పసిఫిక్ హెల్త్ కేర్ హోల్డింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు కేటాయించిన ఐదెకరాల భూమిని స్వాధీనంచేసుకున్నారు. ఈ భూమిని ప్రభుత్వానికి చెందినదిగా ప్రకటిస్తూ కబ్జాదారులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరికలతో బోర్డు ఏర్పాటుచేశారు. కాగా, ఫసిఫిక్స్ హాస్పిటల్స్ అక్రమ వ్యవహారాన్ని 'దవాఖాన పేరిట దగా' శీర్షికన 2015లో నమస్తే తెలంగాణ దినపత్రిక వెలుగులోకి తీసుకొచ్చింది. దీనిపై విచారణ జరిపిన జిల్లా రెవెన్యూ యంత్రాం గం.. సదరు సంస్థ పాల్పడిన ఉల్లంఘనలను పేర్కొంటూ భూ కేటాయింపులను రద్దుచేయాలని కోరుతూ ప్రభుత్వానికి నివేదించింది.

సెల్ఫీ దిగి.. వివాహిత ఆత్మహత్య!

- అదనపుకట్నం వేధింపులతో మరణశాసనం రాసుకున్న మహిళ
- ఉరేసుకుంటున్నట్టు ఫొటోను భర్తకు పంపి బలవన్మరణం
- హైదరాబాద్ యాకుత్‌పురాలో ఘటన

చార్మినార్: అదనపుకట్నం కోసం విదేశాల్లో ఉన్న భర్తతోపాటు అత్తింటివారి వేధింపులు ఎక్కువై.. పుట్టింటి వారు అదనపు కట్నం ఇచ్చుకోలేని పరిస్థితిలో ఉండటంతో ఓ మహిళ తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యే శరణ్యమనుకున్నది. తాను చనిపోతున్న విషయం భర్తకు తెలియాలని ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ సెల్ఫీ తీసి భర్తకు పంపించింది. ఆ తర్వాత బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన హైదరాబాద్ రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. యాకుత్‌పురా ఆర్టీసీకాలనీకి చెందిన ముస్తాఫాకు, హర్షియాబేగంతో 2013లో పెండ్లయ్యింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా భర్త ముస్తాఫా విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నాడు. దీంతో హర్షియాబేగం, ఆమె పిల్లలు, అత్తామామలతోపాటు ఇద్దరు మరుదులతో కలిసి ఉంటున్నది. తరుచు ఇంట్లో అదనపు కట్నం తేవాలంటూ కుటుంబసభ్యులు వేధించసాగారు. దుబాయ్‌లో ఉన్న భర్త సైతం అదనపు కట్నం కావాలని అడుగుతుండేవాడు. ఈ క్రమంలోనే ఇటీవల ముస్తాఫా ఇంటికి వచ్చి కొద్దిరోజులు ఉండి తిరిగి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి వరకట్నపు వేధింపులు ఎక్కువయ్యాయి. ముస్తాఫా సైతం ఫోన్ చేసి కట్నం కోసం ఒత్తిడి తెచ్చాడు. తమ పుట్టింటి వారు ఆర్థికంగా ఇబ్బందులో ఉన్నారని, ఈ సమయంలో అదనపుకట్నం తేలేనని చెప్పుకుంటూ వచ్చింది. అయినా వేధింపులు ఎక్కువవడంతో బుధవారం రాత్రి 10 గంటలకు భర్తకు ఫోన్ చేసి మాట్లాడింది. తాను చనిపోతున్నానని, ఉరేసుకునే ముందు ఫ్యాన్‌కు చున్నీ వేసి, దాంతో సెల్ఫీ దిగి భర్తకు రాత్రి 10.04 గంటలకు పంపించింది. భర్త నుంచి వెంటనే స్పందన రాకపోవడంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. ఇదే ఫొటోను ఆమె తన సోదరికి కూడా పంపించింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, బంధువులు 10.45 గంటలకు ఇంటికి వచ్చి చూసే సరికి విగత జీవిగా కనిపించింది. వరకట్నం వేధింపులతోనే హర్షియా మృతి చెందిందని, ఆమె మరణానికి ఏడుగురు బాధ్యులని బంధువులు ఫిర్యాదు చేశారని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామునాయక్ తెలిపారు.

పాతబస్తీకి మరిన్ని సొబగులు

ఇస్తాంబుల్ నగరానికి దీటుగా సుందరీకరణ • చిరువ్యాపారులకు ప్రత్యేక భవనాలు

పాతబస్తీ పర్యటనలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ



చార్మినార్ వద్ద పాదచారుల జోన్ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి తదితరులు

చార్మినార్: హైదరాబాద్‌ను ప్రపంచ వారసత్వ పర్యాటక నగరాల సరసన నిలుపుతూ పర్యాటకులను ఆకర్షించడానికి అనువైన చర్యలు చేపట్టడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని డిప్యూటీ సీఎం మహమూద్ అలీ పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్ ఒవైసీ, సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ, అహ్మద్ బలాలతోపాటు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డితో కలిసి పాతబస్తీలోని చార్మినార్ సమీపంలో చేపడుతున్న పాదచారుల జోన్ పనులనుతోపాటు లాడ్ బజార్, ముర్గీచౌక్, క్లాక్ టవర్, పార్కింగ్ టెర్మినల్ పనులను పరిశీలించారు. చార్మినార్ పాదచారుల జోన్ వల్ల ఉపాధి కోల్పోతున్న చిరు వ్యాపారుల సౌకర్యార్థం మూసీ నదిపై చేపట్టనున్న పలు ప్రాజెక్టులపై అధికారులతో చర్చించారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ హైదరాబాద్‌లో పురాతన కట్టడాలతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదన్నారు. చార్మినార్ చుట్టు పక్కల ప్రాంతాలను ఈస్టర్న్ దేశాల్లోని పర్యాటక ప్రాంతాల మాదిరిగా అభివృద్ధి చేయడానికి ఇప్పటికే చర్యలు చేపట్టామని, ఆ పనులను మరింత వేగవంతం చేస్తామన్నారు. ఇస్తాంబుల్ నగరానికి దీటుగా పాతబస్తీని సుందరంగా దీర్చిదిద్దుతామన్నారు. లాడ్ బజార్‌ను సైతం పంజాబ్‌లోని గోల్డెన్ టెంపుల్ సమీపంలోగల వ్యాపార కేంద్రాల మాదిరిగా మారుస్తామన్నారు. ముర్గీచౌక్‌ను కూడా ఆధునీకరించనున్నామన్నారు. పార్కింగ్ కోసం విశాలమైన ప్రత్యేక పార్కింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. చిరువ్యాపారుల కోసం ప్రత్యేకంగా కొత్త భవనాలను నిర్మిస్తామన్నారు. అఫ్జల్ గంజ్‌లోని సాలార్‌జంగ్ ఎదురుగా ఉన్న మూసీ నది నుంచి సెంట్రల్ లైబ్రరీ వరకు వీధి వ్యాపారులకు ప్రత్యేకంగా నిర్మించే వంతెనతోపాటు ఇతర ప్రతిపాదిత వంతెనల నిర్మాణాలకు సాధ్యమైనంత త్వరగా డిజైన్‌లను ఖరారు చేసి టెండర్లను ఆహ్వానించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డికి సూచించారు.



జలం-జీవం యాప్‌ను ఆవిష్కరిస్తున్న పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్. చిత్రంలో జలమండలి ఎండీ దానకిశోర్ తదితరులు

నీటి సంరక్షణ అందరి బాధ్యత

- జలం-జీవం వెబ్‌సైట్, యాప్ ఆవిష్కరణలో పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్
- నల్లా కనెక్షన్ల జారీ మరింత సులభతరం చేసిన జలమండలి
- వాటర్ కనెక్ట్ పేరిట అందుబాటులోకి యాప్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: మంచినీటి పొదుపుపై హైదరాబాద్ వాసులను చైతన్యపరిచేందుకు జలమండలి విశేష కృషి చేస్తున్నదని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ పేర్కొన్నారు. నీటి సంరక్షణ కార్యక్రమాల్లో ప్రజలు, ఎన్జీవోలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ఖైరతాబాద్‌లోని జలమండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అరవింద్‌కుమార్ పాల్గొని నీటి సంరక్షణ కోసం ఉత్తమంగా ఇంకుడు గుంతలు నిర్మించిన వారికి జలపురస్కారాలను అందజేశారు. ఆనంతరం ఇంకుడు గుంతల ఏర్పాటుపై జలమండలి రూపొందించిన జలం-జీవం యాప్, వెబ్‌సైట్, నూతన నల్లా కనెక్షన్లను మరింత సులభతరం చేసేందుకు వాటర్ కనెక్ట్ పేరిట ఏర్పాటైన యాప్‌ను ఆవిష్కరించారు. జలం-జీవంపై ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి మాట్లాడారు. నీటిని పొదుపు చేయడం, ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జలమండలి విశేష కృషి చేస్తున్నదని చెప్పారు. నీటి సరఫరా, మురుగునీటి నిర్వహణలో సమస్యలను అధిగమిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవలందిస్తున్నదని వివరించారు. ఆనంతరం జలమండలి ఎండీ దానకిశోర్ మాట్లాడుతూ నల్లా కనెక్షన్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగకుండా వాటర్ కనెక్ట్ అనే యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ముఖ్యంగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవడానికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తామన్నారు. వీటికి అయ్యే వడ్డీని జలమండలి భరిస్తుందన్నారు. జలం-జీవం యాప్ ద్వారా ఇంకుడు గుంతలను జీయో ట్యాగింగ్ చేయవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్, జలమండలి ఎండీ దానకిశోర్‌ను జలమండలి ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంబీ ప్రవీణ్‌కుమార్, ఇంజినీర్లు శాలువాతో సత్కరించారు.

హైదరాబాద్.. దేశంలోనే బెస్ట్ సిటీ

తక్కువ క్రైం, మంచి వాతావరణం - మన నగరంతోపాటు పుణెకు మొదటి ర్యాంక్

మెర్సర్స్ సర్వేలో వెల్లడి - హర్షం వ్యక్తంచేసిన సిటీ సీపీ అంజనీకుమార్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: దేశంలో బెస్ట్ సిటీగా హైదరాబాద్ మరోసారి గుర్తింపు తెచ్చుకున్నది. హైదరాబాద్‌లో తక్కువ క్రైం రేట్‌తోపాటు అనువైన వాతావరణ పరిస్థితులు ఉన్నాయని, అందుకే ఉత్తమ జీవన ప్రమాణాలు కలిగిన నగరమని మెర్సర్స్ అనే ఓ ప్రైవేట్ సంస్థ తన సర్వేలో వెల్లడిచింది. ప్రశాంతమైన వాతావరణం హైదరాబాద్‌లో ఉండటంతో ఇక్కడి ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులో ఉన్నాయని, ఈ సౌకర్యాలతో ఇక్కడ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగ్గా ఉండటంతోపాటు ఈ నగరంలో ప్రపంచస్థాయి ప్రజలు నివాసముండేందుకు ముందుకు వస్తున్నారని మెర్సర్స్ తన సర్వేలో వెల్లడించింది. ప్రపంచ దేశాల్లోని ప్రధాన పట్టణాల్లో ప్రజల నివాసానికి అనువైన పట్టణాలపై మెర్సర్స్-2018 సర్వే నిర్వహించి, నివేదికను విడుదల చేసింది. మన దేశంలోని ఏడు ప్రధాన పట్టణాల్లో ఈ సర్వే నిర్వహించగా, హైదరాబాద్, పుణె బెస్ట్ ఇండియన్ సిటీస్‌గా 142వ స్థానంలో నిలిచాయని ఈ సర్వే తెలిపింది. ఆ తర్వాత బెంగళూరు(149), చెన్నై (151), ముంబై (154), కోల్‌కతా(160), న్యూఢిల్లీ(162)వ స్థానాల్లో నిలిచాయి. ప్రపంచవ్యాప్తంగా 450 పట్టణాల్లో సర్వే చేయగా వియన్నా ప్రపంచంలో మెరుగైన ప్రమాణాలతో మొదటి స్థానంలో నిలిచిందని సర్వే తేల్చింది.

హైదరాబాద్‌లో తగ్గిన క్రైం రేట్!

శాంతిభద్రతలు బాగున్నప్పుడే ప్రజలు సుఖసంతోషాలతో ఉండటంతోపాటు ప్రపంచదేశాల నుంచి పెట్టుబడులు వచ్చి రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. అందులో భాగంగానే శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించింది. టెక్నాలజీ పరమైన సంస్కరణలతో హైదరాబాద్‌లో నేరాలను కట్టడి చేస్తూ, క్రైం రేట్‌ను భారీగా తగ్గించగలిగారు. నేరాలు జరుగకుండా కట్టుదిట్టమైన వ్యవస్థ, ఒక వేళ నేరం జరిగినా గంటల వ్యవధిలోనే ఛేదిస్తున్నారు. దీంతో మూడేండ్లుగా నగరంలో క్రమంగా క్రైం రేట్ తగ్గుతూ వస్తున్నది. క్రైం రేట్ తగ్గుదలతోపాటు ఇక్కడి వాతావరణం బాగుండటంతో ప్రజలు ఇక్కడ నివాసముండేందుకు ఎంతో ఉత్సాహం చూపుతున్నారని సర్వే వెల్లడిచింది. పుణె నగరంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడి ఇండ్లు, ఆయా దేశాల నుంచి వచ్చేవారికి కావాల్సిన వినియోగవస్తువులు లభ్యమవుతున్నాయని సర్వేలో తేలింది. ఇక బెంగళూరు సిటీ భద్రత విషయంలో ప్రజలు ఆందోళనలో ఉండటం, విద్యుత్, మంచినీటి వ్యవస్థ సరిగా లేకపోవడంతో సర్వేలో వెనుకంజలో ఉన్నది. ట్రాఫిక్, కాలుష్యం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నదని మెర్సర్స్ తన సర్వేలో ఆందోళన వ్యక్తం చేసింది. హైదరాబాద్‌లో ట్రాఫిక్ వ్యవస్థ క్రమంగా పటిష్టమవుతున్నదని సర్వే వెల్లడించింది.

నగరంలో శాంతిభద్రతలు భేష్



హైదరాబాద్‌లో నాలుగేండ్లుగా శాంతిభద్రతలు భేష్‌గా ఉండటంతోనే వరుసగా దేశంలోనే బెస్ట్ సిటీగా గుర్తింపు తెచ్చుకుంటున్నది. మెరుగైన శాంతిభద్రతలు ఉండటంతోనే ఉత్తమ జీవన ప్రమాణాలతో కూడిన నగరంగా ప్రైవేట్ సంస్థలు చెప్తున్నాయి. ప్రభుత్వం పోలీసులపై ఉంచిన నమ్మకానికి తగ్గట్టుగా శాంతిభద్రతలను పరిరక్షిస్తూ, నేరాలను పూర్తిస్థాయిలో కట్టడి చేస్తున్నాం.

– హైదరాబాద్ పోలీస్ కమిషనర్, అంజనీకుమార్

సెన్సెక్స్	నిఫ్టీ
33,006	10,115
↘ 130	↘ 40.50

ముడి చమురు (బ్రెంట్) ↘ 69.11 డాలర్లు

బంగారం ధరలు

ముంబై (రూ.లలో)

24 క్యారెట్లు	30,675
22 క్యారెట్లు	30,450
వెండి (కిలో)	38,480

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	59.26	68.72
బహ్రెయిన్ దినార్	160.49	183.91
కువైట్ దినార్	179.56	223.53
సౌదీ రియాల్	15.76	18.67
యూఏఈ దిర్హామ్	16.13	18.857

చికెన్ ధరలు (రూ.లలో)

ఫారం ధర	62.00
రిటైల్ లైవ్	84.00
డ్రెస్డ్	122.00
స్కిన్‌లెస్	139.00

నెక్ (వంద గుడ్లకు) (రూ.లలో)

హైదరాబాద్	315-00
రంగారెడ్డి	315-00
మెదక్	315-00
కరీంనగర్	317-00
వరంగల్	317-00
రిటైల్ ప్రైస్	3-75

నగదు నిల్వలు లేని డెబిట్ కార్డులపై చార్జీల మోత

ఒక్కో లావాదేవీపై రూ.17-25 వసూలు చేస్తున్న బ్యాంకులు



ముంబై, మార్చి 22: ఒకవైపు కేంద్ర ప్రభుత్వం నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహిస్తుంటే మరోవైపు బ్యాంకులు మాత్రం క్రెడిట్ కార్డులపై చార్జీల మోత మోగిస్తున్నాయి. అకౌంట్‌లో డబ్బులు లేకపోయిన డ్రా చేయడానికి ప్రయత్నిస్తే అందుకు తగిన చార్జీలు చెల్లించక తప్పదని బ్యాంకులు హెచ్చరిస్తున్నాయి. కనీస నగదు నిల్వలు లేని డెబిట్ కార్డుల ఒక్కో లావాదేవీపై రూ.17 నుంచి రూ.25 వరకు బ్యాంకులు చార్జీలు విధిస్తున్నాయి. జీఎస్టీని అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) అయితే ఏటీఎం లేదా పాయింట్ ఆఫ్ సేల్(పీవోఎస్) టర్మినల్ వద్ద స్వైపింగ్ ఫెయిల్ అయిన లావాదేవీపై రూ.17 చొప్పున చార్జీ విధిస్తున్నది. అలాగే హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్‌లు రూ.25 విధిస్తున్నాయి. ఈ చార్జీల విధింపుపై ఐఐటీ-బాంబే ప్రొఫెసర్ అశిష్ దాస్ అభ్యంతరాలను వ్యక్తంచేశారు. కేంద్రం ఒకవైపు రాయితీలు ప్రకటిస్తున్నప్పటికీ, మరోవైపు బ్యాంకులు మాత్రం జేబులకు చిల్లులు పెడుతున్నాయని ఆయన విమర్శించారు. ప్రస్తుత సిస్టమ్ డిజిటల్ రంగానికి వ్యతిరేకంగా ఉన్నదని(ఫీజు వసూలు), దీంతో సామాన్య ప్రజలు వారీ వేతనంలో ఎలా పొదుపు చేసుకోగలుగుతారని ఆయన ప్రశ్నించారు.

రెండేండ్ల గరిష్ఠానికి గ్యాస్ ధర?



న్యూఢిల్లీ, మార్చి 22: సహజ వాయువు ధరలను పెంచేయోచనలో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తున్నది. ఒకవేళ ధరలు పెంచితే గడిచిన రెండేండ్లలో ఇదే గరిష్ఠ స్థాయి ధర కానున్నది. దేశీయంగా ఉత్పత్తి అవుతున్న గ్యాస్ మిలియన్ బ్రిటిష్ థర్మల్ యూనిట్ ధరను 3.06 డాలర్లకు పెంచే అవకాశం ఉన్నదని విభిన్న వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం ఇది 2.89 డాలర్లుగా ఉన్నది. ఏప్రిల్ 1 నుంచి ఆరు నెలల పాటు ఈ ధరలు అమలులో ఉండనున్నాయి. అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా ప్రతి ఆరు నెలలకొకసారి ధరలను మార్చుకునేందుకు కేంద్రం అనుమతించిన విషయం తెలిసిందే. గతంలో అక్టోబర్ 1న ధరలను సవరించింది. కేంద్రం తీసుకునే ఈ నిర్ణయం ప్రభుత్వరంగ సంస్థయైన ఓఎన్‌జీసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్‌ల ఆదాయం పెరుగడానికి దోహదపడనున్నది. కానీ యూరియా, విద్యుత్ చార్జీలు పెరిగే అవకాశం కూడా ఉన్నది.

విలీన సంస్థకు బిర్లానే అధిపతి

ప్రకటించిన ఐడియా, వొడాఫోన్.. సీఈవోగా బాలేష్ శర్మ



న్యూఢిల్లీ, మార్చి 22: ఐడియా సెల్యులార్, వొడాఫోన్ గ్రూప్ విలీనానంతర సంస్థకు నాన్-ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా కుమార్ మంగళం బిర్లా వ్యవహరిస్తారని గురువారం ఇరు సంస్థలు ప్రకటించాయి. అలాగే ప్రస్తుతం వొడాఫోన్ ఇండియా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో)గా ఉన్న బాలేష్ శర్మ సీఈవోగా ఉంటారని తెలిపాయి. 'త్వరలో మా విలీనం జరిగేదాక ఐడియా సెల్యులార్, వొడాఫోన్ ఇండియాల్లోని ప్రస్తుత ఉద్యోగులు తమతమ పదవుల్లో కొనసాగుతారు. వారికి అప్పగించిన విధులను, బాధ్యతలను నిర్వర్తిస్తారు' అని ఐడియా సెల్యులార్ తెలిపింది. దేశీయ టెలికం రంగంలో రిలయన్స్ జియో దూకుడు, భారతీ ఎయిర్‌టెల్ ఆధిపత్యం నడుమ ఐడియా, వొడాఫోన్‌లు ఏకమవుతుండగా, విలీనం తర్వాతి సంస్థ విలువ 23 బిలియన్ డాలర్లకుపైగా ఉండనున్నది. దీని మార్కెట్ వాటా 35 శాతానికి చేరుకోనున్నది. గతేడాది అక్టోబర్ ఆఖరు నాటికి ఎయిర్‌టెల్ మార్కెట్ వాటా 24.21 శాతంగా ఉన్నది. ప్రస్తుతం భారతీయ మార్కెట్‌లో ఎయిర్‌టెలే అగ్రస్థానంలో ఉండగా, ఐడియా, వొడాఫోన్ విలీనంతో ఇది రెండో స్థానానికి పడిపోనున్నది.

పోంజీ స్కీం విచారణలో అవకతవకలు

మాజీ డిప్యూటీ డైరెక్టర్‌పై ఈడీ దాడులు

న్యూఢిల్లీ, మార్చి 22: పోంజీ స్కీంలపై ఉక్కుపాదం మోపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తాజాగా ఇందుకు సంబంధించిన వారి కార్యాలయాలపై దాడులను ముమ్మరం చేసింది. రూ.600 కోట్ల విలువైన మనీ లాండరింగ్ పాల్పడిన కేసులో ఈడీ మాజీ డిప్యూటీ డైరెక్టర్ గుర్‌నామ్ సింగ్, ప్రముఖ న్యాయవాది పునీత్ శర్మ, మరో వ్యక్తికి ఛండీగఢ్, మోహాలీలో ఉన్న ఇండ్లు, ఆఫీస్‌లపై గురువారం ఉదయం నుంచి దాడులు కొనసాగుతున్నాయని ఈడీ వర్గాలు వెల్లడించాయి. పోంజీ స్కీం కేసులపై ఇన్వెస్టిగేషన్ అధికారిగా విధులు నిర్వహించిన సింగ్ భారీ అవకతవకలకు పాల్పడినట్లు అనుమానం రావడంతో ఈడీ ఈ దాడులు చేస్తున్నది. గతేడాది నుంచి పలు దఫాలుగా దాడులు చేస్తున్న ఈడీ..ఇందుకు సంబంధించి పలువురిని ఇప్పటికే అరెస్ట్ చేసింది.

బ్యాంకులకు టోటెమ్ టోపీ

పెద్దమొత్తంలో రుణాల ఎగవేత • రూ.1,394.43 కోట్లకు మోసం

యూబీఐ ఫిర్యాదుతో సీబీఐ సోదాలు • పత్తాలేకుండా పోయిన ప్రమోటర్లు





హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బ్యాంకులను మోసం చేసే సంఘటనలు దేశంలో సంచలనం సృష్టిస్తున్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఓబీసీ), బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర తదితర బ్యాంకుల్లో ఇటీవల వెలుగులోకి వచ్చిన వేలాది కోట్ల రూపాయల కుంభకోణాలను మరువకముందే తాజాగా, మరో ఎనిమిది బ్యాంకులను 1,394 కోట్ల రూపాయలకు మోసగించిన కన్‌స్ట్రక్షన్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ టోటెం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) కేసు నమోదు చేసింది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న టోటెమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ అనేక పెద్దపెద్ద ఇన్‌ఫ్రా కంపెనీలకు సబ్-కాంట్రాక్టర్‌గా వ్యవహరిస్తున్నది. ఈ కంపెనీ వలన దారుణంగా నష్టపోయిన ఎనిమిది బాధిత బ్యాంకుల్లో ఒకటైన యూబీఐ (యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) ఫిర్యాదు మేరకు సీబీఐ కేసు నమోదు చేసి టోటెం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థతో పాటు దాని డైరెక్టర్లు తొట్టెంపూడి సలలిత్, తొట్టెంపూడి కవితలను నిందితులుగా చేర్చినట్లు అధికారులు గురువారం వెల్లడించారు. ఆదాయం పన్ను విభాగం 2015లో విడుదల చేసిన అతిపెద్ద పన్ను ఎగవేతదారుల జాబితా టోటెమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కూడా ఉన్నది. అప్పటికే ఈ సంస్థ ప్రభుత్వానికి 400 కోట్ల రూపాయలకు పైగా పన్నులు ఎగవేసినట్లు ఆదాయం పన్ను విభాగం స్పష్టం చేసింది. టోటెమ్ ప్రమోటర్లతో పాటు ఈ జాబితాలోని ఇతర పన్ను ఎగవేతదారుల ఆచూకీ 'తెలియడం లేదని', వీరిని వేటాడేందుకు ఉపకరించే సమాచారాన్ని అందించిన వారికి 15 లక్షల రూపాయల రివార్డును అందజేస్తామని ఆదాయం పన్ను విభాగం అప్పట్లోనే ప్రకటించింది. అలాగే టోటెమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ప్రమోటర్ల జాడ తెలియడం లేదని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా పేర్కొన్నది. అయితే పాత ప్రాంతం నుంచి మకాం మార్చి కొత్త ప్రాంతంలో నివసిస్తున్న వీరి జాడను సీబీఐ అధికారులు ఎట్టకేలకు పసిగట్టి గురువారం నాడు వారి ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారని, అంతేకాకుండా దేశం నుంచి పారిపోకుండా నిరోధించేందుకు వీరికి వ్యతిరేకంగా లుకౌట్ సర్క్యులర్‌ను కూడా జారీ చేశారని అధికారులు తెలిపారు. టోటెమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌కు తాము ఇచ్చిన రుణాలు 2012 జూన్‌లో మొండి బకాయి (ఎన్‌పీఏ)లుగా మారాయని, దీంతో తమకు 313.84 కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆరోపించింది. తమతో పాటు కన్సార్టియంలోని ఇతర ఏడు బ్యాంకులకు కలిపి టోటెమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ 1,394.43 కోట్ల రూపాయల బకాయిలు చెల్లించాల్సి ఉందని యూబీఐ తమ ఫిర్యాదులో పేర్కొన్నది. వేర్వేరు ప్రాజెక్టుల కోసం ఎనిమిది బ్యాంకుల నుంచి పెద్ద మొత్తాల్లో రుణాలను తీసుకున్న టోటెమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ప్రమోటర్లు ఆ మొత్తాలను నిర్దేశిత పనుల కోసం ఉపయోగించకుండా తమ వ్యక్తిగత ఖాతాలకు, ఇతర పనులకు మళ్లించారని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆరోపించింది.

టోటెమ్ చరిత్ర ఇదీ..

టోటెమ్ ఇన్‌ఫ్రా సంస్థ రహదారుల ప్రాజెక్టులు, మంచినీటి పథకాలు, ఇతరత్రా నిర్మాణాలను చేపడుతున్నది. ఎల్ అండ్ టీ, రైట్స్, ఐఆర్‌సీఓఎన్ ఇంటర్నేషనల్ వంటి కంపెనీలకు సబ్‌కాంట్రాక్టర్లుగా వ్యహరించేవారని సమాచారం. ఈ కంపెనీ 1997 నవంబర్ 7న నమోదు అయ్యింది. తొట్టెంపూడి సలలిత్ ఎండీగా వ్యవహరిస్తున్నారు. అజయ్ సింగ్ చౌహాన్ పూర్తికాలం డైరెక్టర్‌గా సంస్థలో 2012 నవంబర్ 1న చేరారు. 2016 సెప్టెంబరు 1న అదనపు డైరెక్టర్‌గా మదుసూధన్‌రావు ముట్టే చేరారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 5లో ఈ సంస్థ కార్యకలాపాలను నిర్వహిస్తున్నది. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను టోటెమ్ సంస్థ బదిలీ చేసిందని.. ఖర్చులను పెంచి చూపెట్టిందని ఓ అధికారి తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను దగా చేసిన టోటెమ్ ఇన్‌ఫ్రా ప్రమోటర్లు గత కొంతకాలం నుంచి తప్పించుకుని తిరుగుతున్నారని బ్యాంకు వెల్లడించింది. ప్రస్తుతం ఎక్కడున్నారో కూడా తెలియదని తెలియజేసింది. అయితే, హైదరాబాద్‌కు చెందిన సంస్థ కావడంతో, నగరంలోని సంస్థ కార్యాలయాలపై సోదాలను నిర్వహిస్తున్నది.

సీబీఐ అదుపులో జైన్ దంపతులు!

- కనిష్క్ గోల్డ్ మోసం కేసులో ప్రశ్నించిన అధికారులు
- పారిపోకుండా లుకౌట్ నోటీసుల జారీ



బెంగళూరు, మార్చి 22: కనిష్క్ గోల్డ్ యజమానులు, డైరెక్టర్లైన భూపేశ్ కుమార్ జైన్, ఆయన భార్య నీతా జైన్‌లను గురువారం ఇక్కడ సీబీఐ ప్రశ్నించింది. గతేడాదే వీరిరువురు విదేశాలకు పారిపోయారన్న వార్తలు రాగా, మారిషస్‌లో ఉంటున్నారని తెలియవచ్చింది. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం బెంగళూరుకు వచ్చిన ఈ దంపతుల్ని అదుపులోకి తీసుకున్న సీబీఐ అధికారులు.. విచారిస్తున్నట్లు పీటీఐ వార్తా కథనం స్పష్టం చేసింది. చెన్నైకి చెందిన కనిష్క్ గోల్డ్.. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ నేతృత్వంలోని 14 బ్యాంకులకు రూ.824.15 కోట్ల రుణాలను ఎగవేసిందన్న ఆరోపణల్ని ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. వడ్డీ బకాయిలతో కలుపుకుంటే బ్యాంకులకు వాటిల్లిన నష్టం వెయ్యి కోట్లపైమాటే. ఎస్‌బీఐ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన కేంద్ర దర్యాప్తు సంస్థ.. బుధవారం కనిష్క్ గోల్డ్ కార్యాలయాలు, దుకాణాలతోపాటు జైన్ నివాసాల్లోనూ సోదాలను నిర్వహించింది. అయితే ఈ కేసులో కీలక సమాచారాలేవీ కూడా లభించకపోవచ్చన్న ఆందోళనను సీబీఐ వ్యక్తం చేస్తున్నది. దర్యాప్తులో భాగంగా సీబీఐ సోదాలు పూర్తికాకముందే ఈ వ్యవహారం మొత్తం బయటకు పొక్కడమే కారణం. అయినప్పటికీ ఈ కేసులో జైన్ దంపతులతోపాటు మరికొందరినీ, ప్రభుత్వ అధికారులనూ బుక్ చేసిన సీబీఐ.. వీరిలో కొందరికి ఇప్పటికే దర్యాప్తునకు హాజరుకావాలని ఆదేశించింది. కాగా, ఈ కేసులో అరెస్టులు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల విచారణల నుంచి తప్పించుకోవడానికే జైన్ దంపతులు విదేశాలకు పారిపోయారని, ఆచూకీ తెలియకుండా వెళ్లిపోయారంటూ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారమవుతున్న నేపథ్యంలో వారిరువురు తిరిగి స్వదేశానికి రావడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఎస్‌బీఐకి రూ.240 కోట్ల మేర బకాయిపడిన కనిష్క్ గోల్డ్.. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)కు రూ.128 కోట్ల వరకు ఇవ్వాలని సీబీఐ ఎఫ్ఐఆర్ ప్రకారం తెలుస్తున్నది. మరో 12 బ్యాంకులకు రూ.50 కోట్ల నుంచి 20 కోట్ల మేర అప్పు పడింది. బ్యాంక్ రుణాలు పొందేందుకు కనిష్క్ గోల్డ్.. తప్పుడు రికార్డులను చూపించిందని, అసత్య ఆర్థిక ఫలితాలను ప్రకటించిందని సీబీఐకి చేసిన ఫిర్యాదులో ఎస్‌బీఐ పేర్కొన్నది. బ్యాంకు నిధులను కనిష్క్ గోల్డ్, దాని డైరెక్టర్లు పక్కదారి పట్టించారని చెప్పింది. ఇక 'క్రిజ్' బ్రాండ్ పేరిట మార్కెట్‌లో బంగారు ఆభరణాలను విక్రయించిన కనిష్క్ గోల్డ్.. 2014 వరకు పంపిణీదారుల ద్వారా అమ్మకాలు జరిపింది. 2015లో తమ వ్యాపార స్వరూపాన్ని బిజినెస్ టు బిజినెస్‌లోకి మార్చుకున్నది. బడా రిటైల్ జ్యూయెల్లర్స్‌కు మాత్రమే ఆభరణాలను సరఫరా చేయడం మొదలు పెట్టింది. గతేడాది మే నుంచి వ్యాపారాన్ని మూసేసిందని మద్రాస్ ఆభరణాల వర్తకులు చెబుతున్నారు. కాగా, ప్రమోటర్లు పారిపోకుండా సీబీఐ లుకౌట్ నోటీసులు జారీ చేసింది.

యాక్సిస్‌కు ఇద్దరు సీనియర్ అధికారులు గుడ్‌బై

ముంబై, మార్చి 22: దేశంలో మూడో అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకైన యాక్సిస్ బ్యాంకుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కార్పొరేట్ బ్యాంకింగ్ హెడ్ సిద్దార్థ్ రాథ్, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ వీ శ్రీనివాసన్‌లు తమ పదవులకు రాజీనామా చేశారు. ఆస్తుల నాణ్యత ప్రమాణాల విషయంతో అవకతవకలు జరిగినందుకు వీరు వీడినట్లు తెలుస్తున్నది. 2001 నుంచి వివిధ హోదాల్లో పనిచేసిన రాథ్ స్థానంలో స్టాండర్డ్ చార్టర్డ్ కార్పొరేట్ బ్యాంకింగ్ హెడ్ ఎస్ఎం సుందరేసన్‌ను యాక్సిస్ బ్యాంక్ నియమించుకున్నది. కానీ రాథ్..స్టాండర్ చార్టర్డ్ బ్యాంకులో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2009లో యాక్సిస్ బ్యాంక్ ఈడీగా చేరిన శ్రీనివాసన్..2012లో డైరెక్టర్‌గా పదొన్నతి పొందారు. ఈ విషయంపై యాక్సిస్ బ్యాంక్ వర్గాలు స్పందించడానికి నిరాకరించారు.

సీఐఐ రాష్ట్ర మహిళా విభాగ చైర్మన్‌గా శోభా దీక్షిత్



హైదరాబాద్, మార్చి 22: భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) ఇండియన్ వుమెన్ నెట్‌వర్క్ రాష్ట్ర విభాగ చైర్‌పర్సన్‌గా శోభా దీక్షిత్ నియమితులయ్యారు. రాష్ట్రానికి చెందిన అల్ప్లా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్‌గా ఆమె వ్యవహరిస్తున్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను నూతన కార్యవర్గాన్ని గురువారం ప్రకటించారు. ఆమె చైర్మన్‌గా నియమితులు కావడం ఇది రెండోసారి. వైస్ చైర్‌పర్సన్‌గా నందితా సేథీ ఎంపికయ్యారు.

పీఎన్‌బీకి 14,506 కోట్ల నష్టం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ప్రభుత్వరంగ సంస్థ పీఎన్‌బీకి మోసాల ద్వారా రూ.14,500 కోట్ల నష్టం వాటిల్లిందని పార్లమెంట్‌కు కేంద్ర ప్రభుత్వం సమాచారం అందించింది. 2015-16లో మోసాలతో రూ.341.04 కోట్లు నష్టపోయిన బ్యాంక్..ఆ తర్వాతి ఏడాదిలో రూ.2,633.82 కోట్లకు పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇప్పటి వరకు ఈ నష్టం రూ.14,506.39 కోట్లకు చేరుకున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా రాజ్యసభకు లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ బ్యాంకును రూ.13,923.14 కోట్ల మేర మోసం చేసిన విషయం తెలిసిందే. మూలధన నిధుల కేటాయింపుపై మంత్రి స్పందిస్తూ..ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.5,473 కోట్ల మేర నిధులను చొప్పించడానికి కేంద్రం నిర్ణయం తీసుకుందన్నారు.



41 వేలకుపైగా ఎల్‌వోయూలు

2011 నుంచి జారీచేసిన పంజాబ్ నేషనల్ బ్యాంక్

నీరవ్, చోక్సీలకే 1,590 ఎల్‌వోయూలు • పార్లమెంట్‌లో ఆర్థిక శాఖ వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 22: దేశ చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణంతో కుదేలైన పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) 2011 సంవత్సరం నుంచి దాదాపు 41,178 అండర్‌టేకింగ్ లెటర్లను (ఎల్‌వోయూలను) జారీచేసింది. వీటిలో 1,590 ఎల్‌వోయూలను ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, ఆయన మామ మెహుల్ చోక్సీతో పాటు వారి అనుయాయులకే ఇచ్చినట్లు కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. 90 రోజుల చెల్లుబాటుతో 7,672 ఎల్‌వోయూలను, 180 రోజుల చెల్లుబాటుతో 20,078 ఎల్‌వోయూలను, 365 రోజుల చెల్లుబాటుతో 11,224 ఎల్‌వోయూలను, 365 కంటే ఎక్కువ రోజుల చెల్లుబాటుతో మరో 2,204 ఎల్‌వోయూలను జారీచేసినట్లు పీఎన్‌బీ తెలియజేసిందని ఆర్థిక శాఖ కొద్ది రోజుల క్రితం రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో వివరించింది.పంజాబ్ నేషనల్ బ్యాంకు జారీ చేసిన తప్పుడు అండర్‌టేకింగ్ లెటర్లను ఉపయోగించుకుని నీరవ్ మోదీ ఆయన అనుయాయులు ఆ బ్యాంకును దాదాపు రూ.13,600 కోట్లకు మోసగించిన విషయం తెలిసిందే. ఈ కుంభకోణం వెలుగులోకి రావడంతో వాణిజ్య రుణాల కోసం కార్పొరేట్ సంస్థలకు బ్యాంకులు అండర్‌టేకింగ్ లెటర్లతో పాటు కంఫర్ట్ లెటర్లను జారీచేయకుండా రిజర్వు బ్యాంకు నిషేధాన్ని విధించింది.

ఆర్‌కామ్‌కు 'సుప్రీం' షాక్

- ఆస్తుల అమ్మకంపై స్టే ఎత్తివేతకు నిరాకరణ
- యథాతథ స్థితి కొనసాగించాలని ఆదేశం
- ఏప్రిల్ 5న తదుపరి విచారణ



న్యూఢిల్లీ, మార్చి 22: అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్)కు సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. ఆర్‌కామ్ ఆస్తులను రిలయన్స్ జియోకి అమ్మకుండా నిరోధిస్తూ బాంబే హైకోర్టు విధించిన స్టేని ఎత్తివేసేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. ఈ విషయంలో యథాతథ స్థితిని కొనసాగించాలని జస్టిస్ ఏకే గోయల్, జస్టిస్ ఆర్ఎఫ్ నారీమన్, జస్టిస్ యూయూ లలిత్‌లతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం గురువారం నాడు స్పష్టం చేసింది. ఈ అంశంపై మళ్లీ విచారణ జరిపే వరకూ బాంబే హైకోర్టు తీర్పు కొనసాగుతుందని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంటూ తదుపరి విచారణను ఏప్రిల్ 5వ తేదీకి వాయిదా వేసింది. పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన ఆర్‌కామ్ ఆ భారాన్ని తగ్గించుకునేందుకు తన ఆస్తులను రిలయన్స్ జియో ఇన్ఫోకామ్‌కు అమ్ముతున్నట్లు గతేడాది డిసెంబర్‌లో ప్రకటించిన విషయం విదితమే. ఈ మేరకు ఆర్‌కామ్ అధినేత అనిల్ అంబానీకి, ఆయన సోదరుడు రిలయన్స్ జియో అధినేత ముఖేశ్ అంబానీకి మధ్య ఒప్పందం కుదిరింది. అయితే దీనిపై ఎరిక్సన్ సంస్థ ఆర్బిట్రేషన్ కోర్టును ఆశ్రయించింది. తమ బకాయిలను చెల్లించకుండా రిలయన్స్ కమ్యూనికేషన్స్ ఆస్తులను అమ్ముతున్నారని ఆరోపించింది. దీంతో అనుమతులు లేకుండా ఆర్‌కామ్ ఆస్తులను అమ్మరాదని ఆర్బిట్రేషన్ కోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పుపై ఆర్‌కామ్ బాంబే హైకోర్టును ఆశ్రయించగా.. అక్కడ కూడా నిరాశే ఎదురైంది. ఆస్తులు విక్రయించకుండా బాంబే హైకోర్టు ఈ నెల 8వ తేదీన స్టే విధించింది. తాజాగా ఈ కేసు సుప్రీం కోర్టు పరిధిలోకి వచ్చింది. అయితే బాంబే హైకోర్టు విధించిన స్టేని ఎత్తివేసేందుకు సర్వోన్నత న్యాయస్థానం కూడా నిరాకరించడంతో రిలయన్స్ కమ్యూనికేషన్స్ మళ్లీ చిక్కుల్లో పడింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తదితర 24 బ్యాంకులకు ఆర్‌కామ్ మొత్తం రూ.42 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉన్నది.

ఆర్‌కామ్ ధీమా: ఇదిలావుంటే, ఆస్తుల అమ్మకంపై గురువారం సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ తగిలినప్పటికీ ఈ ప్రక్రియ వేగవంతంగా ముగుస్తుందని, రుణదాతల ప్రయోజనాలను పరిరక్షించేందుకు వీలుగా గతంలో రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) నిర్దేశించిన గడువు (ఆగస్టు 31వ తేదీ) కంటే చాలా ముందుగానే ఈ ప్రక్రియ పూర్తవుతుందన్న విశ్వాసం తమకు ఉందని ఆర్‌కామ్ ఒక ప్రకటనలో పేర్కొన్నది.



లండన్‌లో తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ వీరేంద్రశర్మ, తెలంగాణ ఎన్నారై ఫోరం అధ్యక్షుడు ప్రమోద్

లండన్‌లో తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ

హైదరాబాద్: యూకే కాలమానం ప్రకారం తెలుగు క్యాలెండర్‌ను తెలంగాణ ఎన్నారై ఫోరం రూపొందించింది. యూకే తెలుగు బ్రాహ్మణ సంఘం సహకారంతో ప్రముఖ సిద్ధాంతి శ్రీ ములుగు రామలింగేశ్వరశర్మ ద్వారా రూపొందించిన తెలుగు పంచాంగ క్యాలెండర్‌ను గురువారం లండన్‌లో స్థానిక ఎంపీ వీరేంద్రశర్మ ఆవిష్కరించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు విశ్వమానవాళికి ఆదర్శణీయమని ఆయన చెప్పారు. ఈ క్యాలెండర్ కోసం సంస్థ వ్యవస్థాపక చైర్మన్ గంప వేణుగోపాల్ ఎంతో శ్రమించారని తెలంగాణ ఎన్నారై ఫోరం అధ్యక్షుడు ప్రమోద్ అంతటి కొనియాడారు. కార్యక్రమంలో తెలంగాణ ఎన్నారైఫోరం నాయకులు రంగు వెంకట్, కూర రవికుమార్, రాజు కొయ్యడ, మీనాక్షి అంతటి, జయశ్రీ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధి

- ప్రజల సంతోషమే అభివృద్ధికి ప్రామాణికం
- రాష్ట్రంలో త్వరలో మిగులు విద్యుత్
- సైనిక అధికారుల బృందంతో గవర్నర్

ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ: ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలతో ప్రజలు సంతోషంగా ఉండటమే ఆర్థికాభివృద్ధికి ప్రధాన ప్రామాణికంగా చెప్పుకోవచ్చని రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ పేర్కొన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం, గూడు వంటి సంక్షేమ పథకాలు అందితే ఆర్థికవృద్ధి చెందినట్టేనని ఆయన అన్నారు. నేషనల్ డిఫెన్స్ కాలేజీ తరపున 'ఎకనామిక్ సెక్యూరిటీ స్టడీ టూర్'లో భాగంగా నేషనల్ డిఫెన్స్ కాలేజీ కార్యదర్శి బ్రిగేడియర్ విపుల్ సింఘాల్ నేతృత్వంలో ఆర్మీ అధికారుల బృందం గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌ను కలిసింది. గవర్నర్ వారితో మాట్లాడుతూ, 'ఆర్థికాభివృద్ధి అంటే కేవలం లెక్కలు కాదు. ఎంతవరకు గ్రామీణ, పట్టణ ప్రజల మధ్య అంతరాన్ని తగ్గించాం. ఆర్థిక, అభివృద్ధి సమతుల్యత ఎంతవరకు సాధించగలిగామనేది ముఖ్యం' అని చెప్పారు. సమాజంలోని అన్నివర్గాల ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందాల్సిన అవసరముందని చెప్పారు. నాణ్యమైన విద్య అంటే ఎక్కువ విద్యాసంస్థలు ఉండటం కాదని, విద్యార్థులకు ఉపాధిని కల్పించే నైపుణ్యాన్ని అందించే విద్య కావాలని ఆయన చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్, పారిశుద్ధ్యం, పర్యావరణం అనే విషయాలను పాఠ్యాంశాలలో ప్రధాన అంశాలుగా చేర్చాలని సూచించారు. సమీప భవిష్యత్‌లో పారిశ్రామికీకరణ వల్ల వ్యవసాయరంగానికి సవాల్ ఎదురవుతుందని, వ్యవసాయ ఉత్పత్తులకు భూముల కొరత ఏర్పడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సాంకేతిక పురోగతి బాగా ఉన్నప్పటికీ అది మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం కానేరదని, అది కేవలం ఫెసిలిటేటర్‌గా మాత్రమే ఉండాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్‌రంగం పురోగతిలో ఉందని, కొన్ని నెలల్లోనే విద్యుత్ మిగులు రాష్ట్రంగా అవతరించనున్నదని గవర్నర్ సైనిక అధికారులకు తెలిపారు. సులభతర వాణిజ్య విధానం (ఈజ్ ఆఫ్ డూయింగ్)లో మొదటిస్థానంలో ఉన్నదని వివరించారు. పరిశ్రమలకు దరఖాస్తు చేసుకున్న నిర్ణీత గడువులోపల అధికారులు అనుమతి ఇవ్వకపోతే అనుమతి వచ్చినట్టే భావించాలన్న విషయంలో తెలంగాణ ప్రభుత్వం చట్టాన్ని తీసుకురావడం విశేషమన్నారు.



గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌ను కలిసిన సైనికాధికారులు

శరవేగంగా తెలంగాణలో అభివృద్ధి: సీఎస్ ఎస్కే జోషి
మిలటరీ అధికారుల బృందం గురువారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎస్కేజోషిని కలిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో కొత్తగా ఏర్పడిన రాష్ట్రం అన్నిరంగాలలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వం వ్యవసాయం, నీటిపారుదల రంగం,పారిశ్రామికరంగాలకు ప్రాధాన్యమిస్తున్నదని, వ్యవసాయానికి కూడా నిరంతర విద్యుత్‌ను అందిస్తున్నామని, పవర్ హాలిడేలు అసలే లేవని చెప్పారు.



తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మాక్‌పోలింగ్‌లో ఓటువేస్తున్న సీఎం కేసీఆర్



గురువారం తెలంగాణ భవన్‌లో రాజ్యసభ ఎన్నికలపై మంత్రులు, ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

కనీస స్పృహలేని కాంగ్రెస్

గుడ్డి వ్యతిరేకత వారిది.. ప్రజల్లో ప్రభుత్వానికి మంచి స్పందన.. రాజ్యసభ ఎన్నికలపై టీఆర్ఎస్ ఎమ్మెల్యేల సమావేశంలో సీఎం కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు కనీస స్పృహ లేకుండా వ్యవహరిస్తున్నారని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజార్టీ ఎమ్మెల్యేలు ఉన్నా.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని బరిలో నిలిపిందన్నారు. కాంగ్రెస్ మొత్తం ఎమ్మెల్యేలు ఓటువేసినా వారి అభ్యర్థి గెలిచే అవకాశమే లేదన్నారు. టీఆర్ఎస్ ఏది చేసినా వ్యతిరేకించాలనే గుడ్డి వ్యతిరేకతతో కనీస స్పృహను మరిచిపోతున్నారని అన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ ఎమ్మెల్యేలందరూ క్రమశిక్షణతో సక్రమంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని చెప్పారు. గురువారం తెలంగాణభవన్‌లో రాజ్యసభ ఎన్నికలపై ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడుస్థానాలూ సులభంగా గెలుపొందుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎంఐఎం కూడా మద్దతు పలికిందని గుర్తుచేశారు. ప్రతి ఎమ్మెల్యే ఓటింగ్‌ను సీరియస్‌గా తీసుకొని ఓటు వేయాలన్నారు. ప్రతిఒక్కరు ఓటింగ్‌కు హాజరుకావాలన్నారు. క్రమశిక్షణతో ఉదయాన్నే ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజలకు, మీడియాకు మంచి సంకేతాలు పంపాలని చెప్పారు. ఓటు వేయడంలో ఎలాంటి పొరపాట్లు జరిగినా ప్రజల్లో చులకనై పోతామని అన్నారు. బీజేపీ, టీడీపీ, సీపీఎం ఓటింగ్‌లో పాల్గొనవద్దని నిర్ణయించినందున గెలుపునకు అవసరమైన ఓట్ల సంఖ్య ఇంకా తగ్గుతుందన్నారు. రాష్ట్రంలోని అన్ని సామాజికవర్గాలను ఆదుకునే విధంగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకున్నదని, త్వరలో మరికొన్ని సామాజికవర్గాలను ఆదుకునే విధంగా నిర్ణయాలు తీసుకుందామని చెప్పారు. వీరితోపాటుగా ఉద్యోగులకు అనేకమందికి వేతనాలు పెంచామని, ఇంకా పెంచనివారికి సైతం జీతాలు పెంచడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం, ఎమ్మెల్యేలపై ఇటీవల నిర్వహించిన సర్వేలో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు కే తారకరామారావు, టీ హరీశ్‌రావు, ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, రాజ్యసభ అభ్యర్థులు జోగినిపల్లి సంతోష్‌కుమార్, బండ ప్రకాశ్, బడుగుల లింగయ్యయాదవ్ పాల్గొన్నారు. సీఎం కేసీఆర్, మంత్రులు, ఎమ్మెల్యేలు మాక్ పోలింగ్‌లో పాల్గొన్నారు.

మొదటి ఓటు సీఎం కేసీఆర్‌దే

అసెంబ్లీలో రాజ్యసభ ఎన్నికల్లో మొదటి ఓటును సీఎం కేసీఆర్ వినియోగించుకోనున్నారు. ఉదయం 9 గంటలకు అసెంబ్లీలో ఆయన ఓటు వేయనున్నారు. కేసీఆర్ టీఆర్ఎస్ అభ్యర్థి బండ ప్రకాశ్‌కు ఓటు వేయనున్నారు. పాత వరంగల్, ఖమ్మం, మెదక్ జిల్లాల ఎమ్మెల్యేలను బండ ప్రకాశ్‌కు కేటాయించినందున సీఎం కేసీఆర్ ఆయనకు ఓటు వేయనున్నారు.

నేడు తెలంగాణ భవన్ నుంచి అసెంబ్లీకి..

టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శుక్రవారం ఉదయం తెలంగాణ భవన్‌కు చేరుకోవాలని సీఎం కేసీఆర్ సూచించారు. అల్పాహారం అనంతరం ప్రత్యేక బస్సుల్లో అసెంబ్లీకి బయలుదేరనున్నారు. ప్రతి ఎమ్మెల్యే ఓటింగ్‌లో పాల్గొనేవిధంగా ఆయాజిల్లాల మంత్రులకు బాధ్యతలు అప్పగించారు. అసెంబ్లీ ప్రారంభమయ్యే వరకు అత్యధిక ఎమ్మెల్యేలు ఓటుహక్కు వినియోగించుకునే విధంగా చూడాలని సీఎం కేసీఆర్ సూచించారు.

టీఆర్ఎస్ గెలుపు ఖాయం

- నేడే పోలింగ్.. ఐదు గంటలకు కౌంటింగ్
- ఓటింగ్‌కు బీజేపీ, టీడీపీ, సీపీఎం దూరం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి తెలంగాణ రాష్ట్ర సమితి నేతలు పకడ్బందీ వ్యూహాన్ని సిద్ధం చేశారు. శుక్రవారం పోలింగ్ జరుగనున్న మూడు సీట్లలో పార్టీ అభ్యర్థుల గెలుపు దాదాపు ఖరారైంది. ఒక్కో అభ్యర్థి గెలుపునకు అవసరమైన ఓట్ల కంటే ఎక్కువఓట్లను కేటాయించారు. మరోవైపు ఎంఐఎం టీఆర్ఎస్‌కు మద్దతు పలుకడంతో టీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు మరింత సులువైంది. రాష్ట్రంలో రాజ్యసభ ఎన్నికలకు దూరంగా ఉండాలని బీజేపీ, టీడీపీ, సీపీఎం నిర్ణయించాయి. టీఆర్ఎస్ పార్టీ ఒకేసారి ఇద్దరు బీసీలకు రాజ్యసభ టికెట్లు ఇచ్చి తన ప్రాధాన్యాన్ని చాటింది.

టీఆర్ఎస్ అభ్యర్థులకు 97 ఓట్లు

రాజ్యసభ ఎన్నికల్లో మూడు స్థానాలను టీఆర్ఎస్ సులువుగా గెలుచుకోనున్నది. ప్రస్తుతం పార్టీకి 90మంది సభ్యులు ఉండగా ఏడుగురు సభ్యులు ఉన్న ఎంఐఎం మద్దతు ప్రకటించడంతో బలం 97కు చేరింది. ఈ నేపథ్యంలో ఇద్దరు అభ్యర్థులకు 32ఓట్లు, మరో అభ్యర్థికి 33 ఓట్లు కేటాయించారు. ఎన్నికల్లో గెలవడానికి 30ఓట్లు సరిపోతాయి.

ఇద్దరేసి మంత్రులకు బాధ్యతలు

ఒక్కో టీఆర్ఎస్ అభ్యర్థి బాధ్యతను ఇద్దరేసి మంత్రులకు అప్పగించారు. జోగినిపల్లి సంతోష్‌కుమార్‌కు కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు ఓటు వేయనున్నారు. వీరిని సమన్వయం చేసే బాధ్యతను మంత్రులు కే తారకరామారావు, ఈటలరాజేందర్‌కు అప్పగించారు.బండ ప్రకాశ్‌కు వరంగల్, ఖమ్మం, మెదక్, ఎంఐఎం ఎమ్మెల్యేలను కేటాయించారు. వీరిని సమన్వయం చేసే బాధ్యతను ఉపముఖ్యమంత్రి కడియంశ్రీహరి, తుమ్మల నాగేశ్వర్‌రావుకు అప్పగించారు. బడుగుల లింగయ్యయాదవ్‌కు నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల ఎమ్మెల్యేలను కేటాయించారు. వీరిని మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి సమన్వయం చేస్తారు. పోలింగ్‌లో పార్టీ అధికారిక ఏజెంట్‌గా టీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయ కార్యదర్శి మాదాడి రమేశ్‌రెడ్డిని నియమించారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

పోలింగ్ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జరుగుతుంది. శాసనసభ కమిటీ హాలు-1లో పోలింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ఐదు గంటలకు కౌంటింగ్ మొదలవుతుంది. కౌంటింగ్ తర్వాత వెంటనే ఫలితాలను వెల్లడిస్తారు. ఎన్నికైన అభ్యర్థులు ఏప్రిల్ రెండో తేదీ తర్వాత ప్రమాణం స్వీకరిస్తారు.

29న హైకోర్టు న్యాయవాదుల సంఘం ఎన్నికలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉమ్మడి హైకోర్టులోని తెలంగాణ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఎన్నికలు ఈ నెల 29న జరుగనున్నాయి. వీటికి సంబంధించిన నామినేషన్ల గడువు గురువారంతో ముగిసింది. అధ్యక్ష, ఉపాధ్యక్ష, ఇద్దరు కార్యదర్శులు, కోశాధికారితోపాటు వివిధ పోస్టులకు ఎన్నికలను నిర్వహించనున్నారు. అధ్యక్ష పదవికి మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన టీఆర్ఎస్‌కు చెందిన న్యాయవాది ఆర్ వినోద్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ న్యాయసలహాదారుడు దామోదర్‌రెడ్డి, అదే పార్టీకి చెందిన పొన్నం అశోక్‌గౌడ్ అధ్యక్ష పదవికి పోటీ పడుతున్నారు. వినోద్‌రెడ్డికి తెలంగాణ ఉద్యమకారులు తమ మద్దతు ప్రకటించారు.



అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేస్తున్న ఆర్ వినోద్‌రెడ్డి

పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ మేళా రేపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వేలసంఖ్యలో వచ్చిన పాస్‌పోర్టు దరఖాస్తులను క్లియర్ చేసేందుకు శనివారం (ఈ నెల 24న) పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ (పీసీసీ) మేళా నిర్వహించనున్నట్టు రీజినల్ పాస్‌పోర్టు అధికారి ఈ విష్ణువర్ధన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గల్ఫ్ దేశాలకు వెళ్లేవారి పాస్‌పోర్టు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ నెల 20 వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నీ అదేరోజు క్లియరెన్స్ చేయనున్నట్టు వెల్లడించారు.

ఎక్సైజ్ ఈఎస్‌ల బదిలీలకు మరోమారు ఆప్షన్లు

- రాష్ట్ర పునర్విభజన నిబంధనల ప్రకారం బదిలీలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎక్సైజ్‌శాఖకు చెందిన ఎక్సైజ్ సూపరింటెండెంట్లు(ఈఎస్) ఇరురాష్ట్రాల్లో బదిలీల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఏపీ పునర్విభజన సెల్ మరోమారు ఆప్షన్లు ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రస్థాయి ఉద్యోగుల బదిలీలు జరుగాల్సి ఉంది. పునర్విభజన యాక్టు ప్రకారంగా తెలంగాణకు 42 శాతం, 58 శాతం ఆంధ్రప్రదేశ్‌కు నిర్దేశించిన విషయం విదితమే. సీనియార్టీ విషయంలో వచ్చిన విబేధాల కారణంగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ల బదిలీలు పెండింగ్‌లో ఉండిపోయాయి. తాజాగా ఇరురాష్ట్రాల ఈఎస్‌లందరూ బదిలీల కోసం ఇరు రాష్ట్రాల్లో పనిచేసేందుకు ఆప్షన్లు ఇవ్వాలని రాష్ట్ర పునర్విభజనసెల్ గురువారం సర్క్యులర్ జారీచేసింది. ఈఎస్‌లు వచ్చేనెల 4వతేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించింది. కోర్టు ఆదేశానుసారం 01.06.2014 వరకు సీనియార్టీ ప్రకారంగా ఈఎస్‌లను పరిగణలోకి తీసుకుని బదిలీ చేయాలని నిర్ణయించింది.

గ్రేడ్-1 అభ్యర్థులకు ఎడిట్ ఆప్షన్

- రేపటినుంచి ఈ నెల 27 వరకు అవకాశం: టీఎస్‌పీఎస్సీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖలో సూపర్‌వైజర్ గ్రేడ్-1, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ గ్రేడ్-1 పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఎడిట్ ఆప్షన్‌కు శనివారం నుంచి ఈ నెల 27 వరకు అవకాశం ఇచ్చినట్టు టీఎస్‌పీఎస్సీ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. కొందరు అభ్యర్థులు తమ దరఖాస్తుల్లో బయోడేటా నింపడంలో తప్పులు చేసినట్టు కమిషన్ పేర్కొన్నది. దరఖాస్తుల్లో తప్పులను సరిచేసుకొనేందుకు ఎడిట్ ఆప్షన్‌ను వినియోగించుకోవాలని, ఈ అవకాశం ఒకేసారి ఉంటుందని తెలిపింది.

గ్రూప్-2 ఓఎమ్మార్ షీట్లపై హైకోర్టుకు నివేదిక

- ఐదువేల ఓఎమ్మార్ షీట్లను పరిశీలించిన న్యాయవాదుల కమిటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రూప్-2 పోస్టుల భర్తీలో భాగంగా టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన రాతపరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన మొదటి ఐదువేల మంది అభ్యర్థుల ఓఎమ్మార్ షీట్లను పరిశీలించిన న్యాయవాదుల కమిటీ గురువారం ఉమ్మడి హైకోర్టుకు నివేదిక సమర్పించింది. అసంపూర్తి బబ్లింగ్, వైట్‌నర్‌వాడకం తదితర విషయాలపై తాము గమనించిన అంశాలను ముగ్గురు న్యాయవాదుల కమిటీ నివేదిక రూపంలో సీల్డ్‌కవర్‌లో హైకోర్టు సమర్పించింది. నివేదికను స్వీకరించిన జస్టిస్ పొనుగోటి నవీన్‌రావు నేతృత్వంలోని ధర్మాసనం వ్యాజ్యాలు దాఖలుచేసిన న్యాయవాదులకు నివేదికలను ఇచ్చేందుకు విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. గ్రూప్-2 రాతపరీక్షల్లో అక్రమాలు జరిగాయని, సరిగా బబ్లింగ్ చేయని, వైట్‌నర్ ఉపయోగించినవారిని మౌఖిక పరీక్షలకు అనుమతించారంటూ హైకోర్టులో కొందరు వ్యాజ్యాలు వేశారు.

శ్రీరామ రథయాత్రపై పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో శ్రీరామ రథయాత్ర నిర్వహణకు అనుమతించేలా పోలీసులకు ఆదేశాలు జారీచేయాలని వీహెచ్‌పీ తరపున దాఖలైన పిటిషన్‌ను ఉమ్మడి హైకోర్టు గురువారం కొట్టివేసింది. రాష్ట్రవ్యాప్తంగా పక్షంరోజులు నిర్వహించే ఈయాత్రకు ప్రతిచోట పోలీసులు రక్షణ కల్పించాలంటే సాధ్యపడదని పేర్కొన్నది. శాంతిభద్రతల దృష్ట్యా యాత్రకు పోలీసుల రక్షణ అవసరముంటుందని అభిప్రాయపడింది. దీంతో అనుమతులివ్వాలని పోలీసులకుఆదేశాలు జారీచేయలేమంటూ పిటిషనర్ అభ్యర్థనను తోసిపుచ్చింది.

పరిజ్ఞానం పెంపుపై ఉపాధ్యాయులకు శిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నాణ్యమైన విద్యాబోధన కోసం ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఆధునిక పాఠ్యాంశాలకు అనుగుణంగా శిక్షణ ఇవ్వడంపై విద్యాశాఖ దృష్టి సారించింది. ప్రభుత్వబడుల్లో అర్హులైన ఉపాధ్యాయులు పనిచేస్తున్నప్పటికీ.. మారుతున్న సిలబస్, నిరంతర సమగ్ర మూల్యాంకనంపై ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పాఠ్యాంశాలకు సంబంధించి సబ్జెక్టులపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడం వల్ల పిల్లలకు మరింత మెరుగైన పద్ధతిలో పాఠాలు బోధించడానికి అవకాశం ఉంటుందని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ అభిప్రాయపడ్డారు. వచ్చేనెల టీఆర్టీ ఫలితాలు వెలువడనుండటం.. కొత్తగా భర్తీకానున్న 8,792 ఉపాధ్యాయులకు అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్టీ)ను కూడా బలోపేతం చేయాలని విద్యాశాఖ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. డిజిటల్ పాఠాల బోధనపై పలుచోట్ల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు ఐదురోజుల శిక్షణ కొనసాగుతుండగా, మిగతాచోట్ల కూడా శిక్షణ ఇవ్వనున్నారు.

ఏపీలో జాతీయ రహదారుల దిగ్బంధం

హైదరాబాద్ / అమరావతి, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకోసం ప్రత్యేక హోదా సాధన సమితి గురువారం ఏపీ వ్యాప్తంగా జాతీయ రహదారుల దిగ్బంధం చేసింది. ఏపీలోని జాతీయ రహదారులపై ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిరసనలు, ఆందోళనలు, ర్యాలీలతో రాకపోకలు స్తంభించాయి. తెలుగుదేశంతోపాటు వైసీపీ, జనసేన, కాంగ్రెస్, వామపక్షాలు, ప్రజాసంఘాలు ఈ కార్యక్రమానికి మద్దతు పలికాయి.



యాసంగి కార్యాచరణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న మంత్రి ఈటల

మే నుంచి కొత్త రేషన్ కార్డుల జారీ

- మంత్రి ఈటల రాజేందర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్న వారికి శుభవార్త! మే నెల నుంచి కొత్త ఆహారభద్రత కార్డులను జారీచేస్తామని ఆర్థిక, పౌరసరఫరాలశాఖ మంత్రి ఈటల రాజేందర్ గురువారం చెప్పారు. ఈ కార్డులను ఇతర సంక్షేమ కార్యక్రమాలకు ఉపయోగించకూడదని, బియ్యం అవసరం ఉన్న వాళ్లు మాత్రమే తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రతి రైతుకు కనీస మద్దతు ధర లభించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 2017-18 యాసంగి కార్యాచరణపై మంత్రి ఈటల జాయింట్ కలెక్టర్లు, డీసీఎస్‌వో, డీఎంవోలతో సచివాలయంలో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ-పాస్ నెట్‌వర్క్ సమస్యలు, రేషన్ పోర్టబిలిటీ, గోదాముల్లో సీసీ కెమెరాల పనితీరు పరిశీలన, కిరోసిన్ బకాయిల వసూలు, దీపం కనెక్షన్లు తదితర అంశాలపై చర్చించారు. యాసంగిలో పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని, రైతులు ఎక్కడా ఇబ్బందులు పడకుండా కనీస మద్దతు ధర లభించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కమిషనర్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ ఈ ఏడాది వానకాలంలో 18 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, ఈ యాసంగిలో 36 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

మైనారిటీ వెల్ఫేర్ డైరెక్టర్‌గా షానవాజ్ ఖాసీం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ జాయింట్ కమిషనర్ షానవాజ్ ఖాసీంను ప్రభుత్వం బదిలీ చేసి, మైనారిటీ వెల్ఫేర్ డైరెక్టర్‌గా నియమించింది. ఈమేరకు గురువారం ప్రభుత్వ సీఎస్ డాక్టర్ శైలేంద్రకుమార్ జోషి ఉత్వర్వులు జారీచేశారు. ప్రస్తుతం మైనారిటీ వెల్ఫేర్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఐఏఎస్ అధికారి ఎం దానకిశోర్‌ను రిలీవ్ చేస్తున్నట్టు ఉత్వర్వుల్లో పేర్కొన్నారు.

రిజిస్ట్రేషన్‌శాఖలో డీఐజీల బదిలీ


హైదరాబాద్, నమస్తే తెలంగాణ: స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ) హోదాలోని పలువురు అధికారులను బదిలీచేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రాజేశ్వర్‌తివారీ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న కే రఘుబాబును హైదరాబాద్ డీఐజీగా, ఎన్ సైదిరెడ్డిని వరంగల్ డీఐజీగా నియమించారు. మేడ్చల్ జిల్లా డీఐజీగాఉన్న మధుసూదన్‌రెడ్డిని నిజామాబాద్‌కు, అక్కడఉన్న ఎం సుభాషిణిని మేడ్చల్ జిల్లా డీఐజీగా బదిలీచేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

ప్లాస్టిక్ రంగంలో విశేష ఉద్యోగావకాశాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రెండంకెల విశేషవృద్ధితో దూసుకుపోతున్న ప్లాస్టిక్‌రంగంలోని అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని సౌదీ అరేబియా కేంద్రంగా విస్తరించిన సాబిక్ సంస్థ దక్షిణాసియా ఉపాధ్యక్షుడు జనార్దన్ రామానుజులు పిలుపునిచ్చారు.

దసరాకల్లా ప్యాకేజీ-9 పూర్తిచేయాలి

- యుద్ధప్రాతిపదికన కాళేశ్వరం పనులు
- 9 నుంచి 12 వరకు ప్యాకేజీల పనుల్లో ఇంకా వేగం పెరుగాలి
- కాళేశ్వరంతో సిరిసిల్ల జిల్లాలో వీలైనన్ని ఎక్కువ చెరువులు నింపాలి
- నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించిన మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్



గురువారం కాళేశ్వరం ప్రాజెక్టు పనులపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్యాకేజీ-9 పనులను (మిడ్ మానేరు నుంచి అప్పర్ మానేరుకు గోదావరిజలాలు తరలించేందుకు చేపడుతున్న పనులు) వచ్చే దసరానాటికి పూర్తిచేయాలని నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు, పురపాలక, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు అధికారులను ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్యాకేజీ-9, 10, 11, 12లను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని సూచించారు. గురువారం అసెంబ్లీ కమిటీహాలులో నాలుగు ప్యాకేజీలకు సంబంధించిన సొరంగం, పంపుహౌజ్, సర్జ్‌పూల్, ప్రధాన కాల్వ, డిస్ట్రిబ్యూటరీ, ఇతర పనుల పురోగతిపై మంత్రులు సమీక్ష నిర్వహించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు, పంపుహౌజ్ పనులు వేగంగా జరుగుతున్నట్టుగానే మిగతా ప్యాకేజీల పనులు కూడా జరుగాలన్నారు. ఈనాలుగు ప్యాకేజీల కింద సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో 3,51,150 ఎకరాలు సాగులోకి రానున్నట్టు తెలిపారు. ఇకపై ప్రతివారం లక్ష్యం మేరకు పనులు జరుగుతున్నదీ, లేనిదీ సమీక్షిస్తామని చెప్పారు. ఈ నాలుగు ప్యాకేజీల పరిధిలోని సిరిసిల్ల జిల్లాలో 253 చెరువులు నింపనున్నట్టు అధికారులు మంత్రులకు తెలిపారు. ఎమ్మెల్యేలు చెన్నమనేని రమేశ్, రసమయి బాలకిషన్, సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్, ఈఎన్సీ మురళీధర్‌రావు, సీఈ హరిరాం, రిటైర్డ్ ఈఎన్సీ విజయప్రకాశ్, కాంట్రాక్టు ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.38 కోట్లతో నర్మాల కాల్వల మరమ్మతు

సిరిసిల్ల జిల్లాలోని అప్పర్‌మానేరు ప్రాజెక్టును కాళేశ్వరం పరిధిలోకి తీసుకురావాలని గురువారం జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్ణయించింది. అప్పర్‌మానేరు ప్రాజెక్టు (నర్మాల) 2.2 టీఎంసీల సామర్థ్యంతో ఉన్న రిజర్వాయర్ కాగా.. చాలా కాలంగా పూడుకుపోయిందని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్టు పూడికతీతకు చర్యలు చేపట్టాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. నర్మాలకు వెళ్లే కాలువలను రూ.38 కోట్లతో మరమ్మతులు చేయనున్నట్టు చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జూన్‌కల్లా కాళేశ్వరం ప్రాజెక్టు పంపుల వెట్‌రన్ నిర్వహించాలని హరీశ్‌రావు ఆదేశించారు.

ఆ రెండు బరాజ్‌లతో తెలంగాణ వాటాకు గండి

గత కొన్నేండ్లుగా కృష్ణాబేసిన్‌లో నానాటికీ ఇన్‌ఫ్లోలు తగ్గిపోవడం ఒకవంతైతే.. కర్ణాటక కృష్ణానదిపై ఇంకా అడ్డుకట్టలు వేసి నీటిని తోడేందుకు చేస్తున్న ప్రయత్నాలపై తెలంగాణ ఆందోళన వ్యక్తంచేసింది. ఇందులో భాగంగా గుర్జాపూర్, గుగల్ బరాజ్‌ల ద్వారా కర్ణాటక కృష్ణాజలాలను వాడుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలను వెంటనే నిలువరించాలని నీటిపారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్‌రావు గురువారం కేంద్ర జలసంఘానికి లేఖ రాశారు. ఈరెండు బరాజ్‌ల నిర్మాణంతో నీటిని వాడుకోవడమంటే కర్ణాటక కృష్ణాజలాల వివాద ట్రిబ్యునల్ కేటాయించిన నీటివాటాకంటే ఎక్కువ వాడుకోవడమేనని స్పష్టంచేశారు. తద్వారా దిగువన ఉన్న తెలంగాణకు అన్యాయం జరుగుతున్నదని, రాష్ట్ర వాటాకు గండి పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.


సీతారామ ప్రాజెక్ట్ అనుమతులపై సమావేశం

- ఈ నెల 27నేషనల్ వైల్డ్‌లైఫ్ బోర్డు సమావేశం
- వన్యప్రాణుల రక్షణపై కేంద్రానికి నివేదిక అందించిన అటవీశాఖ

ప్రత్యేక ప్రతినిధి,నమస్తే తెలంగాణ: ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్ట్‌కు వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద అనుమతులిచ్చే విషయంలో ఈ నెల 27న ఢిల్లీలో కీలక సమావేశం జరుగనుంది. నేషనల్ బోర్డు ఫర్ వైల్డ్‌లైఫ్ సమావేశంలో అటవీశాఖ సర్వోన్నతాధికారి ప్రశాంత్‌కుమార్ ఝా తదితరులు పాల్గొంటారు. ఇప్పటికే ప్రాజెక్ట్ వల్ల వన్యప్రాణుల మనుగడకు ఎలాంటి ఢోకాలేదని రాష్ట్ర అటవీశాఖ కేంద్రానికి సమగ్ర నివేదిక పంపింది. సీతారామ ప్రాజెక్ట్‌కు కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ సమతుల్యత మంత్రిత్వశాఖ ఇటీవల తొలిదశ అటవీ అనుమతులను జారీచేయగా.. పూర్తిస్థాయి అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం తన ప్రయత్నాలను వేగిరం చేసింది. ఈ ప్రాజెక్ట్‌కు కీలకమైన వైల్డ్‌లైఫ్ బోర్డు అనుమతులను సాధించడానికి అధికారులు రంగం సిద్ధంచేశారు. ప్రాజెక్ట్‌కు వైల్డ్‌లైఫ్ బోర్డు అనుమతుల విషయంలో డిసెంబర్‌లో మొదటి సమావేశం జరిగింది. వన్యప్రాణుల సంరక్షణకు నిర్ధిష్టమైన చర్యలు చేపట్టాలని బోర్డు సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం వన్యప్రాణుల మనుగడకు ఎలాంటి ప్రమాదం లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట అటవీశాఖ.. కేంద్ర వైల్డ్‌లైఫ్ బోర్డుకు నివేదిక సమర్పించింది. ఈ ప్రాజెక్ట్ కింద వన్యప్రాణి సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం రెండు కోట్ల 42 లక్షల రూపాయలను విడుదలచేయాలని నిర్ణయించింది. ఈ మొత్తాన్ని నేషనల్ బోర్డు ఫర్ వైల్డ్‌లైఫ్ నుంచి అనుమతి రాగానే 'బయోడైవర్సిటీ సొసైటీ' ఖాతాలో జమచేస్తారు. దీనిపై ఇప్పటికే కేంద్రం సంతృప్తి వ్యక్తంచేసినట్టు సమాచారం. దీంతో ఈ నెల 27న జరిగే నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్‌లైఫ్ సమావేశంలో అదేరోజు అనుమతులు లభించే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. వైల్డ్‌లైఫ్ బోర్డు అనుమతి లభించిన తర్వాత రెండోదశ అటవీ అనుమతులు, పర్యావరణ అనుమతి సులువవుతుంది.

ఐదు నగరాల్లో ఆవిష్కరణ కేంద్రాలు

■ శాసనసభలో మంత్రి కేటీఆర్




హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పల్లె, పట్టణం అనే తేడాలేకుండా ఆవిష్కర్తలకు పెద్దపీట వేసేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కే తారకరామారావు పేర్కొన్నారు. ఇందులో టీహబ్ ముందంజలో ఉన్నదని తెలిపారు. గురువారం నాడు అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో టీహబ్ విస్తరణ, ఎంతమందికి ఉపయోగం, ఖమ్మం ఐటీ హబ్ ఇంక్యుబేటర్ ఏర్పాటు వంటి అంశాలపై సభ్యులు గణేష్‌గుప్తా, పువ్వాడ అజయ్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. మహబూబ్‌నగర్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ ఐదు నగరాల్లో ఐటీని విస్తరిస్తున్నట్టు, టీహబ్ ఆవిష్కరణ కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు. టీహబ్ దేశంలోనే అతిపెద్ద ఇంక్యుబేటర్ అని.. టీహబ్-2 ప్రపంచంలోనే అతిపెద్ద ఇంక్యుబేటర్ కాబోతున్నదని చెప్పారు. మూడు లక్షల 60 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో టీహబ్-2 నిర్మాణం రూపుదిద్దుకుంటుందన్నారు. ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు టీహబ్‌తో కలిసి పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. గోవా, అస్సాం, ఢిల్లీ రాష్ట్రాలకు టీహబ్ గైడెన్స్ ఇస్తున్నదని చెప్పారు. స్టార్టప్ ద్వారా రాబోయే రోజుల్లో పెద్దఎత్తున ఉపాధి లభిస్తుందని, ప్రస్తుత పరిశ్రమల కంటే ఇవి అత్యుత్తమ ఫలితాలను ఇస్తాయన్నారు. టీహబ్ ద్వారా ఇప్పటికీ 346 అంకుర ఇంక్యుబేటర్లు, 835 అనుబంధ అంకురాలు, 190 పూర్వ అంకురాలు, 117 మెంటర్లు, 32 సామాజిక భాగస్వామ్యాలు ఏర్పడినట్టు వివరించారు. నెలకు 376 మెంటర్ సెషన్లు, 16 ఈవెంట్లు, 19 వర్క్‌షాపులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 33.6 మిలియన్ల నిధులను 57 అంకుర సంస్థలు సమీకరించినట్టు తెలిపారు. 14 అంతర్జాతీయ భాగస్వామ్యాలు జరిగాయని, 27 మంది వైస్ చాన్స్‌లర్లు, 3,320 మంది సందర్శకులు టీహబ్‌ను సందర్శించారని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

బాండ్ల జారీ సొమ్ములన్నీ ఎస్సార్డీపీకే

హైదరాబాద్ నగర అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్టు మంత్రి కేటీఆర్ చెప్పారు. మున్సిపల్ బాండ్ల ద్వారా నిధులను సమీకరిస్తున్నట్టు, ప్రతి పైసా రోడ్ల అభివృద్ధికే ఖర్చు పెట్టనున్నట్టు పేర్కొన్నారు. ఎస్సార్డీపీ కింద మొదటి దశలో రూ.200 కోట్ల సమీకరణ చేపట్టినట్టు చెప్పారు. మున్సిపల్ బాండ్ల ద్వారా నిధులు సేకరించడాన్ని ప్రధాని మోదీ ప్రశంసించినట్టు తెలిపారు. జీఈఎస్‌కు ప్రధానమంత్రి వచ్చిన సమయంలో బాండ్ల జారీ గురించి అడిగి అభినందించారని వెల్లడించారు.

కొత్త మండలాల్లో గోదాముల నిర్మాణం

■ శాసనమండలిలో మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కొత్తగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 164 మండలాల్లో గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హరీశ్‌రావు గురువారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో వివరించారు. సభ్యులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పురాణం సతీశ్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానాలను చెప్పారు. రైతుల అవసరాలకు అనుగుణంగా గోదాముల నిర్మాణాలు జరుగుతున్నాయని వివరించారు. రూ.1024.50 కోట్ల వ్యయంతో 18.30 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం గల 364 గోదాములు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు.

స్థలం ఉంటే పట్టణాల్లో ఆదర్శ రైతుబజార్లు

పట్టణాలు, జిల్లా కేంద్రాల్లో స్థలం అందుబాటులో ఉంటే ఆధునిక సదుపాయాలతో ఆదర్శ రైతుబజార్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని మంత్రి హరీశ్‌రావు గురువారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సందర్భంగా స్పష్టంచేశారు. సభ్యులు పాతూరి సుధాకర్‌రెడ్డి, పురాణం సతీశ్, ప్రభాకర్‌రావు, బీ వెంకటేశ్వర్లు, గంగాధర్‌గౌడ్, వీ భూపాల్‌రెడ్డి, ఫారూక్‌హుస్సేన్ తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి వివరంగా సమాధానాలను చెప్పారు. ప్రజ్ఞాపూర్ దారిలో ఏర్పాటుచేసిన రైతుబజార్‌కు మంచి ఆదరణ వచ్చిందని, రోజూ సుమారు 800 కార్లలో వచ్చి ప్రజలు కూరగాయలు తీసుకుపోతున్నారని ఆయన చెప్పారు. ఇదే తరహాలో మహబూబ్‌నగర్, భువనగిరి, చేర్యాల, జోగిపేట, సిరిసిల్ల, మెదక్, జమ్మికుంట, హుజూరాబాద్ ప్రాంతాల్లో ఆధునిక రైతుబజార్ల నిర్మాణం చేపట్టామని మంతి పేర్కొన్నారు.

అత్తాకోడళ్ల మధ్య అనుబంధం పెంచిన కేసీఆర్ కిట్

■ ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వరరెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆరోగ్యశాఖ ద్వారా బాలింతలకు ఇస్తున్న కేసీఆర్ కిట్, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన ఆర్థిక ప్రోత్సాహకం తెలంగాణలో అత్తాకోడళ్ల మధ్య అనుబంధం పెంచిందని గురువారం శాసనమండలిలో పల్లా రాజేశ్వరరెడ్డి అన్నారు. కేసీఆర్ కిట్ పథకంపై జరిగిన స్వల్ప వ్యవధి చర్చలో కేసీఆర్ కిట్ సాధించిన అద్భుత ఫలితాలను ఆయన వివరించారు. ఈ పథకం అమలులోకి వచ్చిన నాటి నుంచి అత్తలు గర్భిణులుగా ఉన్న కోడళ్లను తల్లిగారింటికి పంపించడం లేదని, అత్తగారింటి దగ్గర ప్రభుత్వ దవాఖానల్లోనే కాన్పు చేయిస్తున్నారని పేర్కొన్నారు.





అసెంబ్లీ ఆవాజ్



గిన్నిస్‌బుక్‌లో సీఎం కేసీఆర్ పేరు చేర్చాలి

■ రెండేండ్లలో రికార్డు స్థాయిలో 204 మైనారిటీ గురుకులాలు

■ మైనారిటీ బడ్జెట్ పద్దు ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం మహమూద్ అలీ

■ రూ.2 వేల కోట్ల మైనారిటీ బడ్జెట్ పద్దుకు అసెంబ్లీ ఆమోదం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రెండేండ్లలో 204 మైనారిటీ రెసిడెన్షియల్ స్కూళ్లను రికార్డుస్థాయిలో నెలకొల్పడం, రాష్ట్రం ఏర్పడిన తర్వాత మూడేండ్లలో మైనారిటీలకు చేసిన బడ్జెట్ కేటాయింపులు, చేపడుతున్న కార్యక్రమాలతో రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పేరును గిన్నిస్‌బుక్‌లో చేర్చాలని డిప్యూటీ సీఎం మహమూద్ అలీ ఆకాంక్షించారు. సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధిని మైనారిటీలు ఇప్పటి వరకు ఊహించి ఉండరని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి తరఫున గురువారం అసెంబ్లీలో మైనారిటీల సంక్షేమానికి ఉద్దేశించి.. 2018-19 వార్షిక బడ్జెట్‌లో రూ.రెండు వేల కోట్లతో కూడిన పద్దు(నంబర్ 24)ను ప్రవేశపెట్టి ఆమోదం పొందారు. ఈ సందర్భంగా సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు మహమూద్ అలీ బదులిస్తూ.. సీఎం కేసీఆర్ మైనారిటీలకు కేటాయించిన బడ్జెట్, చేపడుతున్న కార్యక్రమాలు ప్రజల ప్రశంసలు అందుకుంటున్నాయన్నారు. ఇలాంటి కార్యక్రమాలు దేశంలో మరే రాష్ట్రంలో అమలు కావడం లేదన్నారు. ఏటేటా సీఎం మైనారిటీల బడ్జెట్‌ను పెంచుతూ వస్తున్నారని, గతంలో కోటి రూపాయలున్న బడ్జెట్‌ను ఇప్పుడు రెండు వేల కోట్లకు పెంచారని చెప్పారు. పెద్ద రాష్ట్రాలు, 25 శాతానికి పైగా ముస్లిం జనాభా ఉన్న రాష్ట్రాల్లో కూడా తెలంగాణ తరహాలో మైనారిటీల సంక్షేమానికి బడ్జెట్ కేటాయింపులు జరుగలేదన్నారు. మైనారిటీల విద్యపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి మైనారిటీల రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని, గత సంవత్సరంలో రూ.248 కోట్లు, ఇప్పుడు రూ.735 కోట్లు కేటాయించారంటే సీఎం మైనారిటీ విద్యకు ఎంత ప్రాధాన్యమిస్తున్నారో అర్థం చేసుకోవాలన్నారు. తమ పిల్లలు ఇంత మంచి చదువులు చదువుతారని మైనారిటీ పేదలు ఎన్నడూ ఊహించి ఉండరని పేర్కొన్నారు.

87 వేలమంది మహిళలకు లబ్ధి

షాదీముబారక్ పథకం ద్వారా ఇప్పటివరకు రాష్ట్రంలో 87 వేల మంది పేద మైనారిటీ యువతులు లబ్ధిపొందారని మహమూద్ అలీ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కేవలం రూ.5 నుంచి రూ.6 కోట్ల నిధులు మాత్రమే కేటాయించేవారని, నగదు ఇవ్వకుండా నామ్‌కే వాస్తే అన్నట్టు సామాగ్రిని ఇచ్చి పెండ్లి సమయంలో వెళ్ళి.. గ్రూప్ ఫోటోలు దిగి వచ్చే వారని ఎద్దేవా చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన కిరణ్‌కుమార్‌రెడ్డి.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే.. మతఘర్షణలు జరుగుతాయని, శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని.. ఇలా ఏదేదో అన్నారని.. ఇప్పుడు రాష్ట్రంలో గంగా-జమునా తహెజీబ్ కనిపిస్తున్నదని చెప్పారు. ఉర్దూ భాషను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఉర్దూ అకాడమీకి రూ.40 కోట్ల నిధులు కేటాయించిందన్నారు. 45వేల ఎకరాల వక్ఫ్‌భూములను రెవిన్యూ రికార్డులో వక్ఫ్‌భూములుగా నమోదుచేసినట్టు తెలిపారు. వక్ఫ్‌బోర్డుకు ప్రభుత్వం రూ.80 కోట్ల నిధులు కేటాయించిందని, ఇందులో నుంచే ఇమామ్‌లు, మౌజన్‌లకు నెలకు రూ.1,500 చొప్పున గౌరవ వేతనం ఇస్తున్నట్టు వివరించారు. మైనారిటీలను పారిశ్రామికరంగం వైపు ప్రోత్సహించే ఉద్దేశంతో టీ-ప్రైమ్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి.. రూ.25 కోట్ల నిధులు బడ్జెట్‌లో కేటాయించిందన్నారు. అంతర్జాతీయ ఇస్లామిక్ కల్చరల్ సెంటర్‌కు 10 ఎకరాల స్థలాన్ని కేటాయించి, రూ.40 కోట్ల నిధులను బడ్జెట్‌లో కేటాయించినట్టు చెప్పారు. రూ.7 కోట్లతో సిక్కుభవన్, క్రిస్టియన్‌భవన్, జామేనిజామియాలో రూ.14.60 కోట్లతో అధునాతన ఆడిటోరియం నిర్మిస్తున్నట్టు తెలిపారు. మైనారిటీ సంక్షేమశాఖలోని ఖాళీలను త్వరలో భర్తీ చేస్తామన్నారు. గతంలో కుటుంబ నియంత్రణకు డబులిచ్చేవారనీ, ఇప్పుడు పిల్లలు పుడితే ప్రభుత్వం డబ్బులిస్తున్నదని చెప్పారు.

బేటీ పఢావో.. బేటీ బచావోకు కార్యరూపమేదీ?

■ విభజన చట్టంలోని అంశాల అమలును విస్మరిస్తున్న కేంద్రం

■ నాణ్యమైన విద్య కోసం అనేక సంస్కరణలు తీసుకొచ్చాం

■ శాసనసభలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తాను 2014లో ఎంపీగా ఉన్నపుడు పంద్రాగస్టు రోజున ప్రధాని మోదీ ఎర్రకోటపై జాతీయ జెండా ఎగురవేసి, 'బేటీ పఢావో.. బేటీ బచావో' పథకాన్ని ప్రకటించారని, కానీ నాలుగేండ్లయినా దాని కార్యరూపం మాత్రం కనిపించడంలేదని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. శాసనసభలో గురువారం విద్యాశాఖ పద్దులపై జరిగిన చర్చకు ఆయన సమాధానమిచ్చారు. తెలంగాణ విద్యార్థి కేవలం దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఇతర దేశాల విద్యార్థులతోనూ పోటీపడేస్థాయిలో ఉండాలని సీఎం కేసీఆర్ సూచించిన మేరకు విద్యాశాఖ ప్రణాళికలు రూపొందించుకున్నదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇబ్బడిముబ్బడిగా జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలతోపాటు యూనివర్సిటీలను ఏర్పాటు చేసిందే తప్ప వాటికి కావాల్సిన నిధులు, మౌలిక వసతులను సమకూర్చలేదని అన్నారు. దీంతో విద్యా ప్రమాణాలు గణనీయంగా పడిపోయి.. మంచి జరగాల్సింది పోయి చెడు జరిగిందన్నారు. సీఎం కేసీఆర్ వీటన్నిటిని దృష్టిలో ఉంచుకునే ప్రస్తుతం ఉన్నవాటిని పటిష్టం చేసి, ముందుకు సాగాలని తమను ఆదేశించినట్టు చెప్పారు.

విద్యార్థులకు ఉచిత యూనిఫాంలు

కేంద్ర ప్రభుత్వం కేవలం ఎనిమిదో తరగతి వరకు మాత్రమే విద్యార్థులకు యూనిఫాంల నిధులు ఇస్తున్నదని, కానీ 9, 10 తరగతుల విద్యార్థులకు ఇవ్వడం లేదని ఉప ముఖ్యమంత్రి కడియం అన్నారు. ఈ లోటును సరిదిద్దాలనే ఉద్దేశంతో నూతన విద్యాసంవత్సరం నుంచి అన్నిరకాల ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి వరకు విద్యార్థులకు ఉచితంగా యూనిఫాంలను ఇవ్వనున్నట్టు మంత్రి ప్రకటించారు. తద్వారా అదనంగా 5.17 లక్షల మంది విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.34.31 కోట్ల వ్యయంతో యూనిఫాంలను సమకూరుస్తుందని చెప్పారు. సీఎం కేసీఆర్ దూరదృష్టితో రూ.315 కోట్లు వెచ్చించి రాష్ట్రంలోని 404 జూనియర్ కళాశాలలకు సొంత భవనాలు, మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు తెలిపారు. పాత, కొత్త వాటికి సొంత భవనాలు, ల్యాబ్‌ల ఏర్పాటుకు రూ.100 కోట్లు వెచ్చిస్తున్నామని తెలిపారు.

వచ్చేనెల చివర్లో టీఆర్టీ ఫలితాలు

రాష్ట్రంలో 8792 ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకిగాను గతంలోనే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు నిర్వహించిందని, దీనిని అడ్డుకునేందుకు అనేక మంది ప్రయత్నించినా పరీక్షలు సజావుగా జరిగాయని కడియం అన్నారు. ఏప్రిల్ చివరిలో ఈ ఫలితాలు రావచ్చని, మే నెలలో అన్ని ప్రక్రియలు ముగించి కమిషన్ ఎంపిక చేసిన అభ్యర్థుల సేవలను జూన్‌లో మొదలయ్యే విద్యా సంవత్సరంలో వినియోగించుకుంటామని చెప్పారు.గతంలో ఎన్నడూలేని విధంగా జూనియర్ కాలేజీల్లో 1202, డిగ్రీ కాలేజీల్లో 1384, పాలిటెక్నిక్ కాలేజీల్లో 519, యూనివర్సిటీల్లో 1551 పోస్టులకు అనుమతి ఇచ్చామన్నారు. శాసనసభలో గురువారం పలు పద్దులపై పలువురు సభ్యులు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గీత కార్మికులకు ప్రకటించిన వరాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు సతీష్‌కుమార్, విఠల్‌రెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, మనోహర్‌రెడ్డి, ఆర్ కృష్ణయ్య, సున్నం రాజయ్య తదితరులు మాట్లాడారు.

ప్రశ్నోత్తరాల సమయం

శాంతిభద్రతల్లో ఘన విజయానికి చిహ్నం

■ పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు జాతీయగుర్తింపు

■ మండలిలో హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు జాతీయస్థాయిలో రెండోర్యాంకు వచ్చిందని, శాంతిభద్రతల విషయంలో రాష్ట్రం సాధించిన ఘనవిజయానికి ఇది చిహ్నమని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం శాసనమండలిలో సభ్యులు పాతూరి సుధాకర్‌రెడ్డి, ఎంఎస్ ప్రభాకర్‌రావు, మైనంపల్లి హనుమంతరావు, రాములు నాయక్ తదితరులు అడిగిన ప్రశ్నలకు నాయిని సమాధానాలు చెప్పారు. జాతీయస్థాయిలో నిబంధనలను పాటించడం, పౌరులకు అత్యుత్తమ సేవలు అందించడం, కార్యనిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవడం వంటి కారణాలతో పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చిందని తెలిపారు.


రైతు సంఘటిత వేదికలే సమన్వయ సమితులు

■ అసెంబ్లీలో మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అన్నదాతలు తలెత్తుకొని వ్యవసాయం చేసేందుకు రైతు సమన్వయ సమితులు వేదికగా నిలుస్తాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నిజమైన రైతులకు మాత్రమే ఈ సమితుల్లో భాగస్వామ్యం కల్పిస్తున్నామని స్పష్టంచేశారు. మంచి వంగడాలు అందించడం, పెట్టుబడి సాయం, దళారి వ్యవస్థను రూపుమాపడమే లక్ష్యంగా రైతు సమన్వయ సమితులు పనిచేస్తాయని వెల్లడించారు. గురువారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో భాగంగా పలువురు సభ్యులు రైతు సమన్వయ సమితుల ఏర్పాటు, వాటి పని తీరుపై అడిగిన పశ్నలకు మంత్రి సమాధానమిస్తూ.. 'గత ప్రభుత్వ హయాంలో ఎద్దు లేదు.. ఎవుసం లేదు.. అయినా ఆదర్శరైతే. నాయకుల అనుచరులు ఆదర్శరైతులే. ఆటోడ్రైవరూ ఆదర్శరైతే అన్నట్లుగా నియామకాలు చేశారు. కానీ ప్రస్తుత ప్రభుత్వంలో అసలు సిసలైన రైతులకే రైతు సమన్వయ సమితుల్లో అవకాశం కల్పించాం' అని తెలిపారు.

ఏటీఎంలలో నగదు కొరత ఏర్పడకుండా చర్యలు : మంత్రి ఈటల



రాష్ట్రంలోని 8వేల ఏటీఎంల్లో నగదు కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ఈటల రాజేందర్ గురువారం శాసనమండలిలో వివరించారు. నగదు కొరత సమస్యను అధిగమించేందుకు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీకి చాలాసార్లు విజ్ఞప్తులు చేశామని, ఆర్బీఐ అధికారులతో సంప్రదింపులు జరిపామని తెలిపారు. సభ్యుడు సయ్యద్ జాఫ్రీ అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. మరో ప్రశ్నకు సమాధానమిస్తూ రాష్ట్రం అద్భుత ఆవిష్కరణల కేంద్రంగా భాసిల్లుతున్నదని పేర్కొన్నారు. శాసనమండలిలో సభ్యులు ప్రశ్నలు అడుగుతున్న తీరుపై ఆయన సున్నితంగా అసహనం ప్రకటించారు. రాష్ట్రం అనేక రంగాల్లో దేశానికే ఆదర్శంగా ఉన్న విషయాన్ని సభ్యులందరూ గమనంలో ఉంచుకోవాలని సూచించారు.


గొర్రెల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ



■ మండలిలో తలసాని శ్రీనివాస్‌యాదవ్

రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నదని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ గురువారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సందర్భంగా పేర్కొన్నారు. గొర్రెల యూనిట్లను పంపిణీ చేయడమే కాకుండా వాటి సంరక్షణకోసం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇంతవరకు 2,42,349 యూనిట్ల గొర్రెలను 30 జిల్లాల్లో పంపిణీ చేసినట్లు తెలిపారు. కర్నె ప్రభాకర్, బీ వెంకటేశ్వర్లు, యాదవరెడ్డి, రాములునాయక్ తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి వివరంగా సమాధానాలను చెప్పారు. వంద సంచార పశువైద్యశాలలను అందుబాటులోకి తెచ్చామని వివరించారు.

మునుపెన్నడూ లేనిరీతిలో రోడ్ల నిర్మాణం, మరమ్మతులు: మంత్రి జూపల్లి కృష్ణారావు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రం ఏర్పడిన తర్వాత మునుపెన్నడూ లేని రీతిలో రోడ్ల నిర్మాణం, మరమ్మతు చేపడుతున్నట్టు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో కాళ్లరిగేలా తిరిగినా రహదారుల నిర్మాణం జరుగలేదని, అన్ని ప్రాంతాలకు కనెక్టివిటీ పెంచేందుకు సీఎం కేసీఆర్ రోడ్లకు ప్రాధాన్యమిస్తున్నారని వెల్లడించారు. గురువారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. 2004 నుంచి 2014వరకు రూ.416 కోట్లు ఖర్చు చేస్తే.. ఈ మూడేండ్ల కాలంలో రూ.14,980 కోట్లతో కొత్త రోడ్ల నిర్మాణం, మరమ్మతులు చేసినట్టు వివరించారు. గ్రామాల్లోని బీటీ రోడ్లను పునరుద్ధరిస్తున్నట్టు తెలిపారు. 14,980 కి.మీ. రోడ్ల నిర్మాణానికి రూ.2,246 కోట్లు మంజూరు చేసి, ఇప్పటికే రూ.17 వందల కోట్లు ఖర్చు చేసినట్టు మంత్రి వివరించారు.

ఆర్టీసీ వనరులు సద్వినియోగం

■ అసెంబ్లీలో మంత్రి మహేందర్‌రెడ్డి వెల్లడి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆర్టీసీ అదనపు ఆదాయం కోసం సంస్థకున్న వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగిస్తున్నట్టు రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి చెప్పారు. గురువారం శాసనసభలో మంత్రి వివరణ ఇస్తూ సంస్థ ట్రాఫికేతర ఆదాయం.. దుకాణాల కిరాయితో రూ.50 కోట్లు, బస్సులపై ప్రకటనల ద్వారా రూ.17 కోట్లు, బస్‌స్టేషన్లలో ప్రకటనల ద్వారా రూ.2 కోట్లు, బీవోటీ పథకం ద్వారా రూ.32కోట్లు, సరుకు రవాణా ద్వారా రూ.6 కోట్లు, ఆయిల్ బంక్‌ల లీజ్‌తో రూ.32 కోట్ల ఆదాయం ప్రతి ఏటా వస్తుందని తెలిపారు. బీవోటీ పథకం కింద సంస్థకు చెందిన 31 స్థలాల్లో 54.39 ఎకరాల భూమిని గుర్తించి 33 ఏండ్ల లీజుకాలంతో ఏడు ప్రాజెక్టులను వివిధ సంస్థలకు ఇచ్చామని చెప్పారు. ఐదు బంకుల లీజ్ ప్రారంభమైందని, మరో పది పెట్రోల్ బంకుల అనుమతులను ఆయా జిల్లా కలెక్టర్లు ఇచ్చారని వివరించారు. ఖాళీస్థలాల్లో రిటైల్ ఇంధన ఔట్‌లేట్లను మార్కెటింగ్ కంపెనీలకు అనుమతులు ఇస్తున్నమని మంత్రి వెల్లడించారు. 23 బస్‌స్టేషన్లలో మినీ థియేటర్ల కోసం గుర్తించగా అందులో కొన్ని టెండర్ దశలో ఉన్నాయని, వీటి ద్వారా ఆర్టీసీకి ఏటా రూ. 3 కోట్ల ఆదాయం వస్తుందని అన్నారు. కొత్తగా 1100 బస్సులు ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు.

ఎస్సీల అభివృద్ధికి 22 వేల కోట్లు ఖర్చు చేశాం

■ దళితుల పట్ల విజన్ ఉన్న నేత కేసీఆర్:మంత్రి జగదీశ్‌రెడ్డి

■ రూ.12708.73 కోట్ల పద్దును ఆమోదించిన అసెంబ్లీ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణలో గడచిన మూడున్నర సంవత్సరాల్లో రూ.22 వేల కోట్లు దళితుల అభివృద్ధికి ఖర్చు చేసినట్లు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి, విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి వెల్లడించారు. దళితుల పట్ల విజన్ ఉన్న నాయకుడు కేసీఆర్ అని ఆయన పేర్కొన్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను గిరిజనుల అభివృద్ధికి రూ.12708.73 కోట్ల పద్దు (నంబర్-21)ను గురువారం అసెంబ్లీలో జగదీశ్‌రెడ్డి ప్రవేశపెట్టారు. చర్చ అనంతరం సభ పద్దును ఆమోదించింది.

డిసెంబర్ నాటికి 2 లక్షల ఇండ్ల నిర్మాణం పూర్తి

■ 2018-19 బడ్జెట్ హౌసింగ్ పద్దును సభలో ప్రవేశపెట్టిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

■ రూ.2795.15 కోట్ల పద్దుకు అసెంబ్లీ ఆమోదం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ ఏడాది డిసెంబర్ నాటికి రాష్ట్రంలో రెండు లక్షల డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం పూర్తిచేస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి ఏ ఇంద్రకరణ్‌రెడ్డి ప్రకటించారు. 2018-19 ఆర్థిక సంవత్సరానికి గాను హౌసింగ్‌కు సంబంధించి రూ.2795.15 కోట్ల పద్దు (డిమాండ్ నంబర్-18)ను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి గురువారం సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ 2017-18 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణలో 2,72,763 ఇళ్ళు మంజూరు చేయగా, గత నెల 28వ తేదీ నాటికి 9,522 ఇండ్ల నిర్మాణం పూర్తిచేసినట్లు తెలిపారు. కాగా 2,19,699 ఇండ్లకోసం టెండర్లు ఆహ్వానించామని, 1,78,503 ఇండ్లకోసం ఒప్పందాలు చేసుకున్నామని, వీటిలో 1,50,542 ఇండ్ల నిర్మాణ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతిపాదిత ఇండ్ల నిర్మాణం కోసం రూ.1277.81 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఒక లక్ష ఇండ్ల నిర్మాణానికి టెండర్లు ఫైనల్ అయ్యాయని, వీటిలో 95.531 ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు, రూ. 575 కోట్లు ఈ నిర్మాణానికి ఖర్చు చేశామన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ''షేర్‌వాల్'' టెక్నాలజీతో 550 ఇండ్ల నిర్మాణం పూర్తి కావస్తున్నదని వివరించారు.

సంక్షేమ పథకాలను కొనియాడిన ఎమ్మెల్యేలు

■ మైనార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ పద్దులపై చర్చలో హర్షం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర సర్కార్.. సంక్షేమానికి చేపడ్తున్న చర్యలపై ఎంఐఎంతోపాటు పలువురు ఎమ్మెల్యేలు ప్రశంసలు కురిపించారు. గురువారం అసెంబ్లీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమం, మహిళా, శిశు సంక్షేమం.. వికలాంగుల సంక్షేమం, వైద్య, ఆరోగ్యశాఖలకు చెందిన పద్దులపై చర్చలో భాగంగా పలువురు సభ్యులు మాట్లాడారు. ఎంఐఎం సభ్యుడు జాఫర్ హుస్సేన్ మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలు భేష్ అని ప్రశంసించారు. ఎమ్మెల్యే జలగం వెంకట్రావ్ మాట్లాడుతూ, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద ఇస్తున్న మొత్తాన్ని పెంచుతూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషమని చెప్పారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. అన్ని కులాలను ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతం చేసేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని స్పష్టంచేశారు. ఎమ్మెల్యే పువ్వాడ అజయ్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో స్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామి పేరిట ఒక యూనివర్సిటీని నెలకొల్పాలని కోరారు. బీజేపీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ, బడ్జెట్‌లో కేటాయింపులకు అనుగుణంగా నిధుల ఖర్చు ఉండడం లేదని తెలిపారు.

సీఎం విజన్‌కు నిదర్శనం కేసీఆర్ కిట్ల పథకం

■ ప్రభుత్వ దవాఖానల్లో 55 శాతం పెరిగిన ప్రసవాలు

■ రాష్ట్రవ్యాప్తంగా 1,83,382 కేసీఆర్ కిట్ల పంపిణీ

■ శాసనమండలిలో వైద్యారోగ్య శాఖ మంత్రి సీ లక్ష్మారెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రసవానికి ముందు, ప్రసవ సమయంలో, ప్రసవం తరువాత తల్లీబిడ్డల సంరక్షణే కేసీఆర్ కిట్ల పథకం ప్రధాన ఉద్దేశమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సీ లక్ష్మారెడ్డి తెలిపారు. గర్భిణుల ఆత్మగౌరవాన్ని పెంపొందించడం, అనవసరపు ఆపరేషన్లను తగ్గించి సాధ్యమైనంతవరకు సహజ ప్రసవాలను ప్రోత్సహించడం, శిశువుకు వందశాతం టీకాలు వేయించడం అనే లక్ష్యాలతో రూపొందించిన కేసీఆర్ కిట్ల పథకం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు విజన్‌కు నిదర్శనమని చెప్పారు. కేసీఆర్ కిట్ల పథకంపై గురువారం శాసనమండలిలో జరిగిన స్వల్పకాలిక చర్చకు మంత్రి లక్ష్మారెడ్డి సమాధానమిచ్చారు. ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రామచంద్రరావు, కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, ఎస్ రాములునాయక్, ఎలిమినేటి కృష్ణారెడ్డి, ఫరూక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ కిట్ల పథకం లక్ష్యాలు, సాధించిన విజయాలను మంత్రి వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏడాదికి 6,50,000 ప్రసవాలు జరిగితే 30శాతం మాత్రమే ప్రభుత్వ దవాఖానల్లో జరిగేవని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ కిట్ల పథకం ప్రారంభమయ్యాక ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు 55 శాతం పెరిగాయని, మాతా, శిశు మరణాలు గణనీయంగా తగ్గాయన్నారు. ఇప్పటివరకు జరిగిన 1,96,702 ప్రసవాల్లో 1, 05,888 సహజప్రసవాలేనని చెప్పారు. గతంతో పోలిస్తే సిజేరియన్ల సంఖ్య చాలావరకు తగ్గిందన్నారు. ఇప్పటివరకు మొత్తం 1,83,382 కేసీఆర్ కిట్లను పంపిణీ చేశామని మంత్రి వివరించారు. 4,60,000 మంది గర్భిణుల పేర్లు నమోదు చేశామన్నారు. ఆడపిల్ల పుడితే నాలుగు విడతలుగా రూ.13వేలు, అబ్బాయి పుడితే రూ. 12 వేలు ఇచ్చే ఆర్థిక సహాయం కింద ఇప్పటివరకు రూ. 201.37 కోట్లు పంపిణీ చేసినట్టు చెప్పారు.

గర్భిణులకు 102తో ఉచిత సేవలు


గర్భిణులను గుర్తించడం, వారి పేర్లను నమోదు చేసి ఆన్‌లైన్‌లో చేర్చడం, నెలనెలా పరీక్షలు ఉచితంగా చేయించడంతోపాటు, ప్రసవ సమయంలో వారిని దవాఖానకు తీసుకొచ్చేందుకకు 102 వాహనం ద్వారా ఉచిత సేవలు అందిస్తున్నట్టు మంత్రి లక్ష్మారెడ్డి చెప్పారు. అవసరమైన మందులు, ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా పౌష్టికాహారం, రూ. 3వేల ఆర్థిక సహాయం అందిస్తున్నట్టు తెలిపారు.

రూ.7375.20 కోట్ల వైద్య ఆరోగ్య శాఖ పద్దుకు సభ ఆమోదం

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ దవాఖానలను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నామని వైద్యారోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు. 2018-19 ఆర్థిక సంవత్సరానికివైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన రూ.7375.20 కోట్ల పద్దు (డిమాండ్ నంబర్-16) ను గురువారం ఆయన ఆమోదం కోసం శాసనసభలో ప్రవేశపెట్టారు. 2018-19 ఆర్థిక సంవత్సరపు గిరిజన అభివృద్ధికి సంబంధించిన రూ. 8063.47 కోట్ల పద్దును ఆ శాఖ మంత్రి చందూలాల్, మహిళా శిశు అభివృద్ధికి సంబంధించిన రూ. 1798.82 కోట్ల పద్దును ఆ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, క్రీడలు, యువజన సర్వీసుల శాఖకు సంబంధించిన రూ.112.63 కోట్ల పద్దును ఆ శాఖ మంత్రి టీ పద్మారావు సభలో ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకున్నారు.

నల్లగొండలో అన్ని సీట్లు గెలుస్తాం

■ కోమటిరెడ్డి గన్‌మెన్ల ఉపసంహరణలో ఎలాంటి దురుద్దేశంలేదు: ఎమ్మెల్యే వేముల వీరేశం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాంగ్రెస్ నాయకుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి గన్‌మెన్ల ఉపసంహరణ వెనుక ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. గురువారం టీఆర్‌ఎస్ ఎల్పీ కార్యాలయంలో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ.. నల్లగొండలో కోమటిరెడ్డి పతనం ఎప్పుడో ప్రారంభమైందని, డబ్బు అహంకారం తప్ప ప్రజలు ఏమనుకుంటున్నారో అన్నదానితో ఆయనకు సంబంధం ఉండదని అన్నారు. నల్లగొండలోని మొత్తం 12 స్థానాలను టీఆర్‌ఎస్ గెలుచుకుంటుందని వీరేశం ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో రూ.100 కోట్లు ఖర్చుచేసినా కోమటిరెడ్డి గెలువడని అన్నారు. ఆయనవన్ని దొంగదీక్షలు, దొంగనాటకాలని, ఎమ్మెల్యే సభ్యత్వం రద్దయిన తరువాత గాంధీ భవన్‌లో చేసిన దీక్షకు ప్రజల నుంచి ఎలాంటి స్పందన రాలేదని చెప్పారు. టీడీపీకి తెలంగాణలో 2 శాతానికి మించి ఓటుబ్యాంకు లేదని, కాంగ్రెస్, టీడీపీలు పొత్తు పెట్టుకున్నా ఎలాంటి ఇబ్బంది ఉండదని అన్నారు. నల్లగొండ లోక్‌సభ స్థానానికి సీఎం కేసీఆర్ పోటీచేయాలని ఆకాంక్షిస్తున్నట్టు వీరేశం చెప్పారు. కాంగ్రెస్ నాయకులు సభ్యత్వం రద్దుపై కోర్టును ఆశ్రయించినప్పుడే ఓటమిని అంగీకరించారని అన్నారు.

బీసీ సంక్షేమానికి అనేక కార్యక్రమాలు

■ బీసీ సంక్షేమశాఖ పద్దును అసెంబ్లీలో ప్రవేశపెట్టిన మంత్రి జోగు రామన్న

■ రూ.5919.83 కోట్ల వార్షిక బడ్జెట్ పద్దుకు సభ ఆమోదం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బీసీ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలుచేస్తున్నదని బీసీ సంక్షేమ, అటవీ శాఖ మంత్రి జోగు రామన్న చెప్పారు. కులాంతర వివాహాల ప్రోత్సాహకాల పెంపు అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నదని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని 26 కులాలను బీసీ జాబితాలో చేర్చే విషయం కూడా పరిశీలనలో ఉందన్నారు. 2018-19 వార్షిక బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి ప్రభుత్వం కేటాయించిన రూ.5919.83 కోట్ల పద్దును ఆమోదం కోసం గురువారం అసెంబ్లీలో మంత్రి జోగు రామన్న ప్రవేశపెట్టారు. ఆయా పార్టీల సభ్యులు అడిగిన ప్రశ్నల అనంతరం మంత్రి బదులిస్తూ.. విదేశాల్లో ఉన్నత చదువులకు వెళ్లే బీసీ విద్యార్థులకు గతంలో ఐదుదేశాలకు వెళ్లే వారికే ప్రభుత్వం ఆర్థికసాయం అందజేసేదని, ఇప్పుడు దానిని 10 దేశాలకు పెంచామని తెలిపారు. వచ్చే ఆర్థికసంవత్సరంలో గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలకు హాజరయ్యే 500 మంది బీసీ విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన శిక్షణ ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిపారు. బీసీ ఫెడరేషన్లకు రూ.1600 కోట్ల నిధులు కేటాయించామని అన్నారు. దేశంలో మరే రాష్ట్రంలో కూడా బీసీల సంక్షేమానికి ఇలాంటి కార్యక్రమాలు అమలు చేయడం లేదన్నారు.

బీసీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ సదా సానుకూలం: కృష్ణయ్య

బీసీ సంక్షేమం విషయంలో సీఎం కేసీఆర్ ఎప్పుడూ సానుకూలంగా ఉంటారని టీడీపీ ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య ప్రశంసించారు. రాజ్యసభ ఎన్నికల్లో ఇద్దరు బీసీలకు అవకాశం ఇవ్వడమే నిదర్శనమని కృష్ణయ్య పేర్కొన్నారు.

బౌల్ట్ విధ్వంసం

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 58కే ఆలౌట్.. నిప్పులు చెరిగిన సౌతీ.. న్యూజిలాండ్ 175/3

5, 11, 0, 2, 0, 0, 0, 5, 33, 0, 1... టెస్టు క్రికెట్‌ను పెంచి పోషిస్తున్నది మేమే అని చెప్పుకునే ఇంగ్లండ్ స్టార్ బ్యాట్స్‌మెన్ చేసిన పరుగులివి.. కివీస్ పేసర్లు ట్రెంట్ బౌల్ట్ (6/32), టిమ్ సౌతీ (4/25) విధ్వంసం సృష్టించిన వేళ.. 23 పరుగులకే 8 వికెట్లు చేజార్చుకున్న తరుణంలో కొత్త కుర్రాడు ఓవర్టన్ బ్యాటే అడ్డేయకపోతే టెస్టు క్రికెట్ చరిత్రలోనే అతి తక్కువ స్కోరుకే ఆలౌటైన జట్టుగా ఓ చెత్త రికార్డు ఇంగ్లండ్ ఖాతాలో పడేది..!


బౌల్ట్ (6/32)

ఆక్లాండ్: వారెవ్వా ఏం ఆట..! ఒకే ఒక్క సెషన్.. మూడో బౌలర్ అవసరమే లేకుండా.. ఇద్దరే ఇద్దరు పేసర్లు.. వేసింది 20.4 ఓవర్లు.. ఇచ్చింది ఒకే ఒక్క ఎక్స్‌ట్రా.. కానీ 11 మంది బ్యాట్స్‌మెన్‌ను ముప్పుతిప్పలు పెట్టారు. బుల్లెట్‌ను మించి వేగం.. అంతుమించిన కచ్చితత్వంతో బంతులు వేస్తూ ఇంగ్లీష్ బ్యాట్స్‌మెన్ నిలువెల్లా వణికించారు. ఫలితంగా గురువారం న్యూజిలాండ్‌తో ప్రారంభమైన తొలి డే నైట్ టెస్టులో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 20.4 ఓవర్లలో 58 పరుగులకు కుప్పకూలింది. ఇంగ్లండ్ టెస్టు చరిత్రలో ఇది ఆరో అత్యల్ప స్కోరు. ఓవర్టన్ (33 నాటౌట్) మినహా మిగతా వారందరూ పెవిలియన్‌కు క్యూ కట్టారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన కివీస్ ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 69 ఓవర్లలో 3 వికెట్లకు 175 పరుగులు చేసింది. విలియమ్సన్ (91 బ్యాటింగ్), నికోలస్ (24 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. లాథమ్ (26)తో రెండో వికెట్‌కు 84 పరుగులు జోడించిన విలియమ్సన్.. నికోలస్ నాలుగో వికెట్‌కు అజేయంగా 52 పరుగులు జత చేశాడు. టేలర్ (20), రావల్ (3) విఫలమయ్యారు. ప్రస్తుతం కివీస్ 117 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతున్నది.

థండర్ బౌల్ట్..

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్‌కు బౌల్ట్ చుక్కలు చూపెట్టాడు. పిచ్‌పై ఉన్న పచ్చికను ఆసరాగా చేసుకుంటూ సూపర్ స్వింగ్, సీమ్‌తో దెబ్బకొట్టాడు. ఫుల్ లెంగ్త్, ఎక్స్‌ట్రా బౌన్స్, ఆఫ్ అండ్ ఔట్ స్వింగర్లు.. యార్కర్లు.. ఇలా ప్రతి ఓవర్‌లో వైవిధ్యమైన బంతులను సంధిస్తూ తన తొలి 7 ఓవర్లలో ఇంగ్లీష్ టాప్ ఆర్డర్ భరతం పట్టాడు. ఇతని దెబ్బకు కుక్ (5), రూట్ (11), మాలన్ (2), స్టోక్స్ (0) కుదురుకోకుండానే పెవిలియన్‌కు చేరిపోయారు. ఓవరాల్‌గా తొలి స్పెల్ ముగిసేసరికి బౌల్ట్ బౌలింగ్ గణాంకాలు 5/9. మధ్యలో స్టోన్‌మన్ (11)ను సౌతీకి చిక్కడంతో ఇంగ్లండ్ జట్టు స్కోరు 6/32కు పడిపోయింది. ఇక ఇక్కడి నుంచి సౌతీ మొదలుపెట్టాడు. బెయిర్‌స్టో (0), అలీ (0)ల వికెట్లను తీయడంతో ఇంగ్లండ్ 23 పరుగులకే 8 వికెట్లు కోల్పోయింది. 1955లో ఇదే గడ్డపై ఇంగ్లండ్... న్యూజిలాండ్‌ను 26 పరుగులకే (టెస్టుల్లో అతి తక్కువ స్కోరు) ఆలౌట్ చేసింది. కనీసం ఈ చెత్త రికార్డును ఇంగ్లండ్ దాటుతుందో లేదో అనుకుంటున్న సమయంలో ఓవర్టన్ బౌండరీ బాదడంతో రూట్‌సేన ఊపిరి పీల్చుకుంది. దీంతో స్కోరు 27 పరుగులకు చేరింది. కానీ వెంటనే బ్రాడ్ (0) వికెట్‌ను కోల్పోయింది. ఇక 1887లో ఆసీస్‌తో మ్యాచ్‌లో ఇంగ్లండ్ 45 పరుగులకే కుప్పకూలింది. దీనిని అధిగమించాలంటే..18 పరుగులు కావాలి. ఈ దశలో ఓవర్టన్.. అండర్సన్ (1)తో కలిసి పదో వికెట్‌కు 31 పరుగులు జోడించడంతో పర్యాటక జట్టు రెండు చెత్త రికార్డుల నుంచి గట్టెక్కింది.

బ్రాడ్ @ 400

టెస్టు కెరీర్‌లో స్టువర్ట్ బ్రాడ్ అరుదైన మైలురాయిని అందుకున్నాడు. ఇంగ్లండ్ తరఫున ఐదు రోజుల ఫార్మాట్‌లో 400ల వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా రికార్డులకెక్కాడు. తొలి టెస్టులో లాథమ్ వికెట్ తీయడం ద్వారా అతను ఈ ఘనత అందుకున్నాడు.


అమ్మాయిలకు మరో ఓటమి


మందన (67)

ముంబై: భారత మహిళల జట్టు ముక్కోణపు టీ20 సిరీస్ తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో ఆరు వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. ఓపెనర్ స్మృతి మందన (41 బంతుల్లో 67 పరుగులు) హాఫ్ సెంచరీ చేయగా, అనూజ (35) ఫరవాలేదనిపించింది. ఆసీస్ బౌలర్లలో గార్డ్‌నర్, పెర్రీ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. 153 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 18.1 ఓవర్లలోనే ఛేదించింది. మూనీ (45), విలానీ (39), లానింగ్ (35) రాణించారు. జులన్ గోస్వామి (3/30) ఆకట్టుకున్నది.

స్మృతి రికార్డు: ఆస్ట్రేలియా చేతిలో భారత మహిళ జట్టు ఓటమిపాలైనప్పటికీ స్మృతి మందన అద్భుతమైన బ్యాటింగ్‌తో అభిమానుల మనసులు గెలుచుకున్నది. మందన 30 బంతుల్లోనే (9 ఫోర్లు, 2 సిక్సర్లు)హాఫ్ సెంచరీ పూర్తి చేసి టీ20ల్లో వేగవంతమైన అర్ధశతకం సాధించిన భారత మహిళా క్రికెటర్‌గా రికార్డులకెక్కింది. స్మృతి టీ20 కెరీర్‌లో ఇది మూడో హాఫ్ సెంచరీ. 67 పరుగులు చేసిన స్మృతికి టీ20ల్లో ఇదే అత్యధిక స్కోరు.

షమీకి ఊరట



న్యూఢిల్లీ: మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణల్లో టీమ్‌ఇండియా పేస్ బౌలర్ మహ్మద్ షమీకి ఊరట లభించింది.ఏసీయూ (అవినీతి నిరోధక విభాగ) చీఫ్ నీరజ్ కుమార్.. ఫిక్సింగ్ ఆరోపణలు నిరాధారమైనవని క్రికెట్ పాలక మండలి (సీవోఏ)కి నివేదిక సమర్పించాడు. దీంతో సీవోఏ షమీకి క్లీన్ చిట్ ఇచ్చింది. ఈ మేరకు షమీ సెంట్రల్ కాంట్రాక్టును కొనసాగిస్తున్నట్టు బీసీసీఐ గురువారం ప్రకటించింది. బీ క్యాటగిరీలో ఉన్న షమీకి రూ.3కోట్ల వార్షిక వేతనం దక్కనున్నది. మరోవైపు ఐపీఎల్‌లో ఆడేందుకూ బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.



సౌమ్యజిత్ ఘోష్‌పై కేసు

న్యూఢిల్లీ: భారత టేబుల్ టెన్నిస్ ప్లేయర్, అర్జున అవార్డు గ్రహీత సౌమ్యజిత్ ఘోష్‌పై బుధవారం లైంగిక ఆరోపణల కేసు నమోదైంది. ఘోష్ తనను మోసం చేసి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడని 18 ఏండ్ల యువతి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నార్త్ 24 పరగణాస్ జిల్లాలోని బారసత్ మహిళా పోలీస్ స్టేషన్ అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రాథమిక విచారణ జరిపిన పోలీసులు 2014 నుంచి వీరిద్దరికి సంబంధం ఉందని తేల్చారు. కోల్‌కతాలోని ఘోష్ ఫ్లాట్‌లో, తన స్వగ్రామమైన సిలిగురిలోని ఫ్లాట్‌లో ఈ ఇద్దరు కలుసుకునేవారని, ఈ క్రమంలో ఓసారి గర్భవతి అయిన బాధితురాలికి అబార్షన్ కూడా చేయించాడని స్పష్టం చేశారు. వీరిద్దరు అనధికారికంగా ఓ

సహజీవనం పేరుతో లైంగికదాడి

దేవాలయంలో పెండ్లి కూడా చేసుకున్నారని తెలిపారు. అయితే ఈ పెండ్లిని ఘోష్ అంగీకరించడం లేదని బాధితురాలు ఆరోపించింది. డబ్బు కోసం అమ్మాయి తనను బ్లాక్ మెయిల్ చేస్తున్నదని ఘోష్ ప్రత్యారోపణలు చేశాడు.

కామన్వెల్త్ జట్టు నుంచి ఔట్!

లైంగిక దాడి ఆరోపణలతో ఘోష్‌ను కామన్వెల్త్ గేమ్స్ జట్టు నుంచి తప్పించనున్నారు. ఈ మేరకు శుక్రవారం జరుగనున్న ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామని టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (టీటీఎఫ్ఐ) కార్యదర్శి ఎంపీ సింగ్ వెల్లడించారు.

సైనా, సింధు తల్లిదండ్రులను అనుమతించండి

క్రీడా శాఖకు ఐవోఏ వినతి

న్యూఢిల్లీ: కామన్వెల్త్ గేమ్స్‌కు తమ వెంట తల్లిదండ్రులను తీసుకెళ్లేందుకు స్టార్ షట్లర్లు సైనా నెహ్వాల్, పీవీ సింధులకు కేంద్ర క్రీడాశాఖ అనుమతి ఇస్తే బాగుంటుందని భారత ఒలింపిక్ సంఘం (ఐవోఏ) అధ్యక్షుడు నరేంద్ర బాత్రా అన్నారు. 'తల్లిదండ్రులను తీసుకెళ్తామంటే క్రీడా శాఖ ఎందుకు వద్దంటుందో తెలియడం లేదు. వాళ్ల ఖర్చును ప్రభుత్వం భరించడం లేదు. సింధు, సైనా చాలా పెద్ద స్టార్లు. వాళ్లకు మద్దతివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గతంలో సచిన్, కోహ్లీ తీసుకెళ్లినట్లే.. ఇప్పుడు సింధు, సైనా విజ్ఞప్తి చేసుకుంటున్నారు. ఒకవేళ క్రికెటర్లకు వద్దని చెబితే వీళ్లకూ చెప్పొచ్చు' అని బాత్రా పేర్కొన్నారు. ప్రభుత్వ సొమ్ముతో కామన్వెల్త్‌కు వెళ్లే ఐవోఏ అధికారుల జాబితాలో సైనా తండ్రి హర్‌వీర్ సింగ్, సింధు తల్లి విజయ పేర్లు ఉన్నట్లు వార్తలు రావడంతో దీనిపై క్రీడాశాఖ అభ్యంతరాలు తెలిపింది. అయితే బాయ్.. ఐవోఏకు పంపిన జాబితాలో ఈ ఇద్దరి పేర్లు లేకపోవడం గమనార్హం. ఇవన్నీ నిరాధార వార్తలని బాయ్ కొట్టి పారేసింది. మరోవైపు సొంత ఖర్చుతో గోల్డ్‌కోస్ట్ వెళ్లేందుకు తమకు అనుమతి ఇవ్వాలని సైనా తండ్రి హర్‌వీర్, సింధు తండ్రి రమణ బాయ్‌కు విజ్ఞప్తి చేశామన్నారు.

జింబాబ్వే ఆశలు గల్లంతు

ప్రపంచకప్ అర్హత పోటీలో యూఏఈ చేతిలో ఓటమి

ఐర్లండ్, ఆఫ్ఘనిస్థాన్ జట్లకు దారి సుగమం



హరారే: ప్రపంచకప్‌లో ఆడాలన్న జింబాబ్వే ఆశలు ఆవిరయ్యాయి. క్వాలిఫయర్స్‌లో భాగంగా యూఏఈతో ఆఖరి బంతి వరకు ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో జింబాబ్వే ఓటమిపాలైంది. చివరి బంతికి సిక్సర్ కొడితే జింబాబ్వే గెలిచేదే, కానీ క్రీజులో ఉన్న ఇర్విన్ రెండు పరుగులే చేయడంతో యూఏఈ 3 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన యూఏఈ 47.5 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 235 పరుగులు చేసింది. రమీజ్ (59) టాప్ స్కోరర్. వర్షం కారణంగా జింబాబ్వే లక్ష్యాన్ని 40 ఓవర్లలో 230కి కుదించగా..సీన్ విలియమ్స్ (80) పోరాడినా, జింబాబ్వే 226/7కే పరిమితమై ఓటమిపాలైంది. ఆతిథ్య జట్టు ఓటమితో ఆఫ్ఘనిస్థాన్, ఐర్లండ్ జట్లకు ఫైనల్ దారి సుగమమైంది. నేడు ఈ రెండు జట్ల మధ్య జరుగబోయే మ్యాచ్‌లో విజయం సాధించిన జట్టు ఈనెల 25న వెస్టిండీస్‌తో ఫైనల్లో తలపడటంతో పాటు 2019 ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధిస్తుంది.


మణిపూర్‌లోని తౌబెల్ పట్టణంలో ఈ నెల 26 నుంచి 30 వరకు జరిగే 37వ జాతీయ జూనియర్ బాలబాలికల ఖోఖో చాంపియన్‌షిప్-2018లో పాల్గొంటున్న బాలబాలికల జట్లకు తెలంగాణ క్రీడాప్రాధికార సంస్థ(సాట్స్) చైర్మన్ ఏ వెంకటేశ్వరరెడ్డి ట్రాక్‌సూట్లను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసరావు, కే రామ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎలావెనిల్‌కు స్వర్ణం



సిడ్నీ: అర్హత రౌండ్‌లో ప్రపంచ రికార్డును బద్దలుకొట్టిన భారత యువ షూటర్ ఎలావెనిల్ వాలారివాన్.. ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ వరల్డ్‌కప్‌లో స్వర్ణంతో మెరిసింది. గురువారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో ఎలావెనిల్ 249.8 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. కీలకమైన 24వ షాట్‌లో ఆమె 10.7 పాయింట్లు రాబట్టడంతో విజయం సొంతమైంది. కెరీర్‌లో రెండో ప్రపంచకప్ ఆడుతున్న ఈ 18 ఏండ్ల ఎలావెనిల్‌కు ఇది తొలి ఫైనల్. అంతకుముందు జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లోనూ భారత అమ్మాయి 631.4 పాయింట్లతో సరికొత్త ప్రపంచ రికార్డును సృష్టించింది. టీమ్ ఈవెంట్‌లోనూ ఎలావెనిల్, శ్రేయా అగర్వాల్, జీనా కిట్టా పసిడిని సొంతం చేసుకున్నారు. ఎలావెనిల్.. స్టార్ షూటర్ గగన్ నారంగ్‌కు చెందిన 'గన్ ఫర్ గ్లోరీ' అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నది.


అసెంబ్లీలో క్లౌడ్ కంప్యూటింగ్, ఐటీ సర్వీస్ మేనేజ్‌మెంట్ సంస్థ సర్వీస్ నౌ సీఈవో జాన్ డోనామోకు జ్ఞాపికను అందజేస్తున్న ఐటీశాఖ మంత్రి కేటీఆర్

హైదరాబాద్‌కు సర్వీస్ నౌ

- రెండువేల మందికి ఉపాధి
- మంత్రి కేటీఆర్‌తో సమావేశమైన సంస్థ సీఈవో జాన్ డోనామో
- ఐటీ రంగంలో తెలంగాణ విశేష వృద్ధి సాధిస్తున్నదని ప్రశంస
- ద్వితీయశ్రేణి నగరాల్లో ఐటీ విస్తృతికి కృషిచేస్తామని హామీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఐటీ రంగంలో తెలంగాణ విశేష వృద్ధి సాధిస్తున్నదని అమెరికాలోని సిలికాన్ కేంద్రంగా ఏర్పాటైన క్లౌడ్ కంప్యూటింగ్, ఐటీ సర్వీస్ మేనేజ్‌మెంట్ సంస్థ సర్వీస్ నౌ సీఈవో జాన్ డోనామో ప్రశంసించారు. ఈ రంగం వృద్ధిలో తాము సైతం భాగం పంచుకుంటామన్నారు. హైదరాబాద్‌లో త్వరలోనే సర్వీస్ నౌ కార్యకలాపాలు ప్రారంభించనున్న నేపథ్యంలో రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కే తారకరామారావును ఆ సంస్థ సీఈవో గురువారం అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ సంస్థ ఆ బృందంతో మాట్లాడుతూ.. వరుసగా నాలుగో ఏడాది మెర్సర్ సర్వేలో హైదరాబాద్ అత్యుత్తమ జీవన ప్రమాణాలున్న నగరంగా నిలిచిందని గుర్తుచేశారు. ప్రపంచంలోని టాప్ కంపెనీలన్నీ హైదరాబాద్ కేంద్రంగా తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయని చెప్పారు. రాష్ట్రం ఐటీ ఎగుమతుల్లో విశేష వృద్ధి సాధిస్తున్నదని గణాంకాలతో వివరించారు. హైదరాబాద్ ఆవిష్కరణల కేంద్రంగా ఎదిగిందని, వాణిజ్యపరమైన అద్దెల విషయంలో టాప్‌లో నిలుస్తున్నదన్నారు. పెట్టుబడులు ఆకర్షించడంలో హైదరాబాద్ ముందంజలో ఉందన్నారు. ద్వితీయ శ్రేణి నగరాల్లోకి ఐటీ విస్తరణకు గల అవకాశాలు గుర్తించాలని కోరారు. దానికి సర్వీస్‌నౌ సీఈవో సానుకూలంగా స్పందించారు.

రెండువేల మందికి ఉపాధి:

సర్వీస్ నౌ సంస్థ.. అమెరికా వెలుపల తన విస్తరణ కేంద్రాన్ని నెలకొల్పేందుకు బెంగళూరు, హైదరాబాద్ నగరాలను తొలుత పరిశీలించింది. ఎక్కడ పెడితే బాగుంటుందన్నదానిపై సర్వేలు చేయించింది. గత ఏడాది రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అమెరికా వెళ్లినపుడు సర్వీస్‌నౌ సంస్థతో చర్చలు జరిపారు. రాష్ట్రంలో ఐటీకి ఇస్తున్న ప్రోత్సాహకాల గురించి సంస్థకు వివరించి హైదరాబాద్‌లో కేంద్రం నెలకొల్పాల్సిందిగా కోరగా, వారు ముందుకొచ్చారు. అమెరికా వెలుపల ఆ సంస్థ ఏర్పాటుచేస్తున్న అతిపెద్ద కార్యాలయం హైదరాబాద్‌లోనే కావడం గమనార్హం. తొలుత వెయ్యిమందికి ఇక్కడ కొత్తగా ఉద్యోగం లభించనున్నది. తర్వాత రెండు వేలమందికి పెంచనున్నారు. ఇప్పటికే సంస్థ కార్యాలయానికి స్థలాన్ని లీజుకు తీసుకున్నది. కార్యకలాపాల ప్రారంభానికి ఏర్పాట్లు చేసింది.

సీబీఐ ఏడీజీపీ లక్ష్మీనారాయణ వీఆర్ఎస్‌కు దరఖాస్తు

ముంబై: మహారాష్ట్ర సీబీఐ అదనపు డీజీపీ వీవీ లక్ష్మీనారాయణ స్వచ్ఛంద పదవీవిరమణ కోరుతూ గురువారం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. 1990 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన లక్ష్మీనారాయణ ఆంధ్రప్రదేశ్‌లో డిప్యూటేషన్‌పై సంచలనం సృష్టించిన జగన్ అక్రమాస్తుల కేసు, గాలి జనార్దన్‌రెడ్డి కేసుల విచారణలో కీలకపాత్ర పోషించారు. పదవీ విరమణ తర్వాత ఏపీ రాజకీయాల్లోకి వచ్చే అవకాశముందని ప్రచారం జరుగుతున్నది.

రైతులకు అండగా నిలువాలి

- పంట ఉత్పత్తుల కొనుగోళ్లు సక్రమంగా జరిగేలా చూడాలి
- అభివృద్ధికి వారధులు.. రైతు సమితి కోఆర్డినేటర్లు
- రాష్ట్ర సమన్వయ సమితి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి


హైదరాబాద్‌లోని తెలంగాణ వ్యవసాయ కమిషనర్ కార్యాలయంలో జిల్లా రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్లతో రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్లు అభివృద్ధికి వారధులుగా నిలువాలని రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచించారు. రైతులు నిరాశ, నిస్పృహలకు లోనుకాకుండా వారికి భరోసాగా, అండగా రైతు సమన్వయ సమితి సభ్యులు నిలువాలని చెప్పారు. పంట ఉత్పత్తుల కొనుగోళ్లు సక్రమంగా, సకాలంలో జరిగేలా చొరవ చూపాలని ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ వ్యవసాయ కమిషనర్ కార్యాలయంలో జిల్లా రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్లతో నిర్వహించిన తొలిసమావేశంలో గుత్తా మాట్లాడారు. త్వరలో జిల్లా, మండలస్థాయి రైతు సమన్వయ సమితి సభ్యులకు ఏడు విడుతల్లో రెండురోజుల చొప్పున శిక్షణ ఉంటుందని తెలిపారు. రైతు వేదికల నిర్మాణానికి భూములను గుర్తించడంలో జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని కోరారు. రైతుల సమగ్ర సమాచారాన్ని జిల్లాస్థాయి కోఆర్డినేటర్లు కలిగి ఉండాలని గుత్తా సూచించారు.

రాష్ట్ర రైతు సమన్వయ సమితి కార్పొరేషన్ కార్యవర్గ సమావేశం

తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి కార్పొరేషన్ కార్యవర్గ తొలి సమావేశం సమితి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేషన్ భవన నిర్మాణం, విధుల గురించి సభ్యులు చర్చించారు. వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లలో పౌరసరఫరాలశాఖ, మార్క్‌ఫెడ్, ఆయిల్‌ఫెడ్ తదితరశాఖల ప్రమేయం ఉండటంతో ఆయా శాఖల మేనేజింగ్ డైరెక్టర్లను బోర్డుసభ్యులుగా చేర్చుకోవాల్సిన అవసరం ఉందని చైర్మన్ గుత్తా సూచించారు. అందువల్ల బోర్డుసభ్యుల సంఖ్యను పెంచాల్సి ఉన్నదని పేర్కొన్నారు. సమావేశంలో కార్యవర్గసభ్యులు వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం జగన్ మోహన్, ఉద్యానశాఖ కమిషనర్ ఎల్ వెంకట్రామి రెడ్డి, డైరెక్టర్ లక్ష్మీబాయి, ఆర్థికశాఖ సంయుక్త కార్యదర్శి సీహెచ్ వీ సాయిప్రసాద్, అపెడా డీజీఎం సుధాకర్ పాల్గొన్నారు.

మహాసభకు ఉద్యోగులు భారీగా తరలిరావాలి

- తెలంగాణ ఉద్యోగసంఘాల జేఏసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి పిలుపు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, సీపీఎస్ ఉద్యోగులు మహాసభకు భారీగా తరలిరావాలని తెలంగాణ ఉద్యోగసంఘాల జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 25న సరూర్ నగర్‌లో తలపెట్టిన సకల ఉద్యోగుల మహాసభ ఏర్పాట్లపై, ఉద్యోగులను సమీకరించే విధానంపై గురువారం టీఎన్జీవో భవన్‌లో ఉద్యోగ సంఘాల జేఏసీ భేటీలో ఆయన మాట్లాడారు.

అసెంబ్లీ ఫుటేజీ సమర్పణ గడువు పెంపు

- 27 వరకు సమర్పించవచ్చన్న హైకోర్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా గవర్నర్ ప్రసంగం నాటి వీడియో ఫుటేజీని సమర్పించేందుకు మరికొంత సమయం కావాలని హైకోర్టుకు రాష్ట్ర అదనపు అడ్వకేట్ జనరల్ జే రామచంద్రరావు కోరారు. సభ తీర్మానం చేసిన తర్వాతే అసెంబ్లీ ఫుటేజీని తీసుకోవాల్సి ఉంటుందని, అందుకు కొంచెం సమయం పడుతుందని ఆయన కోర్టుకు నివేదించారు. ఫుటేజీ సమర్పించాలనే కోర్టు ఆదేశాలను శాసనసభ కార్యదర్శికి లేఖ ద్వారా తెలియచేసినట్టు వివరించారు. అదనపు ఏజీ అభ్యర్థనను అంగీకరించిన న్యాయస్థానం.. ఈ నెల 27 వ తేదీ వరకు సమర్పించాలని ఆదేశించింది. గవర్నర్ ప్రసంగం సందర్భంగా సభకు అప్రతిష్ఠ కలిగించేలా వ్యవహరించినందుకు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్‌లపై బహిష్కరణ వేటు వేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై వారిరువురు హైకోర్టును ఆశ్రయించడంతో.. విచారణ చేపట్టిన న్యాయస్థానం వీడియో ఫుటేజీని సమర్పించాలని ఆదేశించింది.

చెక్కుల పంపిణీ పారదర్శకంగా నిర్వహించాలి

- రెవెన్యూశాఖ వద్ద ఉన్న డాటా ప్రకారం పథకం అమలు
- 60 లక్షలకుపైగా రైతుల ఖాతాలు
- స్థానికంగా ఎదురయ్యే సమస్యలపై బ్యాంకుల అధికారులతో వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి చర్చలు


గురువారం సచివాలయంలో బ్యాంకుల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చెక్కుల పంపిణీ పారదర్శకంగా నిర్వహించాలని బ్యాంకర్లను వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి కోరారు. ఎలాంటి పక్షపాతం లేకుండా అక్షర క్రమానుసారంగా గ్రామాలకు చెక్కుల పంపిణీ చేస్తామని చెప్పారు. ఆయన గురువారం బ్యాంకుల అధికారులతో సచివాలయంలో సమావేశమయ్యారు. ప్రతి రైతు సాగుభూమి అంతటికి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. గతంలో రైతులక్ష్మి పథకంగా ఉన్న సాగు పెట్టుబడి పథకాన్ని రైతుబంధు పథకంగా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మార్చిన విషయాన్ని బ్యాంకర్లకు తెలియజేశారు. ఈ పథకం కింద రైతులకు చెక్కులు అందించడానికి భూ సమగ్రసర్వే ద్వారా సాగు భూముల వివరాలన్నింటిని ప్రభుత్వం సేకరించిందని, రెవెన్యూశాఖ వద్ద ఉన్న డాటా ప్రకారం రైతులకు పథకాన్ని అమలుచేస్తామన్నారు. తమ వద్ద ఉన్న సమాచారం ప్రకారం రాష్ట్రంలో స్థిరీకరించిన వివరాల ప్రకారం 60 లక్షలకు పైగా రైతుల ఖాతాలున్నాయన్నారు. ఈ సందర్భంగా ఒక్క రైతుకు వివిధ గ్రామాల్లో రెండు అంతకన్నా ఎక్కువ పాస్ పుస్తకాలు ఉండే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకోవాలని చెప్పారు. క్షేత్ర స్థాయిలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జిల్లా కలెక్టర్ నాయకత్వంలో రెవెన్యూశాఖ అధికారుల సహకారంతో ఆచరణాత్మకమైన, కచ్చితమైన పద్ధతిలో ముందుకు వెళ్లామన్నారు. బ్యాంకులు ఎక్కడి నుంచి చెక్కులు అందిస్తే అక్కడి నుంచి తీసుకునేలా శాఖాపరమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. చెక్కుపైన పథకం పేరు, లబ్ధిదారుని పేరు, పట్టాదార్ పాస్ పుస్తకం నంబరు, ఇవ్వనున్న నగదు మొత్తం, రెవెన్యూగ్రామం పేరు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ కమిషనర్ జగన్‌మోహన్, ఆర్థికశాఖ సంయుక్త కార్యదర్శి సాయిప్రసాద్, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్, సిండికేట్ బ్యాంక్, కెనరా బ్యాంకు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రాబ్యాంకు ప్రతినిధులు, వ్యవసాయశాఖ అధికారులు, ఎన్ఐసీ అధికారులు పాల్గొన్నారు.

60 లక్షల రైతు ఖాతాలకు పెట్టుబడి సాయం!

- తేల్చిన రెవెన్యూ, వ్యవసాయశాఖలు!
- ఏప్రిల్ 20 నుంచి రాష్ట్రవ్యాప్తంగా చెక్కుల పంపిణీ
- ఆరు రకాల బ్యాంకుల్లో ఖాతాలు తెరిచిన వ్యవసాయశాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యవసాయాన్ని పండుగ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పెట్టుబడి సాయం ఖాతాల లెక్క తేలింది. రాష్ట్రవ్యాప్తంగా అరవై లక్షల రైతు ఖాతాలున్నట్టు ప్రభుత్వం అంచనా. ఈ లెక్క తేల్చేందుకు గత ఆరు నెలల నుంచి వ్యవసాయ, రెవెన్యూశాఖలు సుదీర్ఘ కసరత్తు చేపట్టాయి. ఇప్పటికే ఈ పథకాన్ని ఏప్రిల్ 20 నుంచి అమలుచేస్తామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. బడ్జెట్‌లో ప్రత్యేకంగా రూ.12వేల కోట్లను కేటాయించారు. ఏడాదికి ఎకరానికి రూ.8వేల చొప్పున చెక్కుల రూపంలో అందించేందుకు అవసరమైన ఏర్పాట్లను వ్యవసాయ శాఖ ముమ్మరం చేసింది. పంపిణీ చేసేందుకు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఆరు రకాల బ్యాంకులతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఎస్బీఐ ద్వారా 321 మండలాలు, ఆంధ్రాబ్యాంకు 128, సిండికేట్ బ్యాంకు 38, కెనరాబ్యాంకు 23, కార్పొరేషన్ బ్యాంకు 31, ఐవోబీ ద్వారా 27 మండలాల్లోని రైతులకు నగదు అందించనున్నారు. రాష్ట్రస్థాయిలో బ్యాంకు ఖాతాలను తెరిచేందుకు బ్యాంకు ప్రతినిధులతో వ్యవసాయశాఖ సంప్రదింపులను పూర్తిచేసింది. రైతుల సంఖ్యకు సంబంధించి రెండు రోజుల్లో లెక్క తేలనుంది. 45.33 లక్షల మందిరైతులు ఉండే అవకాశం ఉందని అధికారుల అంచనా. భూ రికార్డుల ప్రక్షాళన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 1.62 కోట్లఎకరాల సాగుభూమిని ప్రభుత్వం గుర్తించింది. దీనికి ఏడాదికి ఎకరానికి రూ.8 వేల చొప్పున అందించనున్నారు. మొదటివిడత వానకాలంలో పంటకు ఏప్రిల్ 20 నుంచి వ్యవసాయానికి పెట్టుబడి సాయం చెక్కులు అందించేందుకు ఏర్పాట్లను చేపడుతున్నది.

బీజేపీకి నాగం రాజీనామా

- 27న కాంగ్రెస్‌లో చేరిక?
- కాంగ్రెస్‌లో చేరితే సహకరించేది లేదు: ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి హెచ్చరిక


మాట్లాడుతున్న నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్రనాయకుడు నాగం జనార్దన్‌రెడ్డి గురువారం బీజేపీకి రాజీనామా చేశారు. నాగర్‌కర్నూల్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు ప్రకటించారు. ప్రజావ్యతిరేక నిర్ణయాలపై బీజేపీ సరిగ్గా పోరాడటం లేదని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ సరైన వేదికగా భావిస్తున్నట్టు నాగం చెప్పారు. కొంతకాలంగా తన అభిమానులతో చర్చించి, బీజేపీకి రాజీనామా చేయడమే సరైనదని నిర్ణయించినట్టు పేర్కొన్నారు. తనతోపాటుగా తన కుమారుడు నాగం శశిధర్‌రెడ్డి, ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు బీజేపీకి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. తనకు రాజకీయ జన్మనిచ్చిన నాగర్‌కర్నూల్ నుంచే రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ నెల 27న ఢిల్లీలో ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్నట్టుగా అనుచరుల ద్వారా తెలిసింది.

కాంగ్రెస్‌లో చేరితే సహకరించం..

నాగం జనార్దన్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీలో పరాభవం తప్పదని ఎమ్మెల్సీ, నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఇంచార్జి దామోదర్‌రెడ్డి స్పష్టం చేశారు. గురు వారం ఆయన నాగర్‌కర్నూల్‌లోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. నాగం పార్టీలో చేరుతున్నందుకు కాం గ్రెస్ నాయకులు, కార్యకర్తలెవ్వరూ భయపడొద్దని, వారందరికీ తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్‌లో చేరినా సహకరించేది లేదన్నారు. నాగంతో కాంగ్రెస్‌కు నష్టమే జరుగుతుందని, పార్టీ టికెట్ కూడా రాదన్నారు.

బోగస్ పత్రాలతో బ్యాంకు రుణాలు

- ఆర్డీవో, తహశీల్దార్ సంతకాల ఫోర్జరీతో పాస్‌పుస్తకాల తయారీ
- వీఆర్వో, వీఆర్‌ఏతోపాటు పదిమంది రైతుల అరెస్టు


నిందితులను విలేకరుల ఎదుట హాజరుపర్చిన కోదాడ పట్టణ సీఐ శ్రీనివాస్‌రెడ్డి

కోదాడ, నమస్తేతెలంగాణ: ఫోర్జరీ సంతకాలతో పాస్‌పుస్తకాలు, టైటిల్ డీడ్ తయారుచేసి కోదాడ కార్పొరేషన్ బ్యాంకు నుంచి రూ.8.5 లక్షల రుణాలు స్వాహా చేసిన వ్యవహారం వెలుగుచూసింది. ఈ కేసుకు సంబంధించి ఎనిమిది మంది రైతులతోపాటు వీఆర్వో, వీఆర్‌ఏలను గురువారం సూర్యాపేట జిల్లా కోదాడ పోలీసులు అరెస్టు చేశారు. పట్టణ సీఐ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించిన వివరాలు ఇలా.. 2014లో కోదాడలోని కార్పొరేషన్ బ్యాంకు నుంచి రుణాలు ఇప్పిస్తామని పాలవరం తండాకు చెందిన భూక్యా నారాయణ, భూక్యా బాలాజీ, భూక్యా కోటేశ్వర్‌రావు, ఆ గ్రామ వీఆర్వో రెడపంగు రామారావు కలిసి అదే తండా రైతులను నమ్మించారు. సదరు రైతులు గతంలోనే త్రిపురవరం ఎస్‌బీఐ నుంచి రుణాలు పొందినట్టు స్పష్టం చేసినప్పటికీ రైతులు బ్యాంకులో దాఖలు చేసిన పట్టాదారు పాస్‌పుస్తకాలు, టైటిల్ నకళ్లతోపాటు రెండు ఫొటోలు తీసుకుని వాటితో నకిలీ పాస్‌పుస్తకాలను తయారుచేశారు. వీఆర్వో రామారావు, వీఆర్‌ఏ సాలె వెంకటనర్సయ్యల ఆధ్వర్యంలో ఈ తతంగం జరిగింది. దీంతోపాటు ఆ నకళ్లపై తహసీల్దార్, ఆర్డీవో సంతకాలను ఫోర్జరీ చేసి మధ్యవర్తులు భూక్యా నారాయణ, భూక్యా బాలాజీకి అప్పగించారు. అవగాహన లేని పాలవరం తండాకు చెందిన పదిమంది రైతులు కోదాడ కార్పొరేషన్ బ్యాంకు నుంచి రూ.8.5 లక్షల రుణాలు తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా తాజా వివరాల కోసం కోదాడ కార్పొరేషన్ బ్యాంకు వారు సదరు పత్రాలను కోదాడ తహసీల్దార్‌కు పంపగా బ్యాంకులో దాఖలు చేసిన పట్టాదారు పాస్‌పుస్తకాలు, టైటిల్ డీడ్‌లు నకిలీవని తేలింది. దీంతో బ్యాంకు మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కోదాడ పట్టణ పోలీసులు ఎనిమిది మంది రైతులతోపాటు వీఆర్వో రామారావు, వీఆర్‌ఏ సాలె వెంకటనర్సయ్యలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులోని నిందితులైన భూక్యా బాలాజీ, భూక్యా కోటేశ్వర్‌రావు మృతిచెందారు. వీఆర్వో రామారావు నుంచి కొన్ని స్టాంపులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నిందితులైన మరికొందరిని త్వరలో అరెస్టు చేయిస్తామని పట్టణ సీఐ తెలిపారు.


నిజామాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియం వద్ద బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ కల్వకుంట్ల కవిత

హామీలన్నీ నెరవేర్చాం

పసుపు రైతులను ఆదుకునేందుకు అన్ని చర్యలు: ఎంపీ కల్వకుంట్ల కవిత

నిజామాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన ప్రధానమైన హామీలన్నీ నెరవేర్చామని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. నిజామాబాద్ నగరంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సాధారణ ఎన్నికలకు ముందు ఎక్కడా లేని విధంగా తనకు తానే స్వయంగా మేనిఫెస్టో తయారు చేసుకొని ఇచ్చిన హామీలను నెరవేర్చినట్టు తెలిపారు. పసుపు బోర్డు కోసం అలుపెరుగని పోరాటం చేశానని, ప్రధానమంత్రితో సహా అన్ని రాష్ట్రాల సీఎంలను కలిసి విన్నవించానని, బోర్డు ఏర్పాటయ్యేంత వరకు పోరాటం చేస్తూనే ఉంటానని ఎంపీ కవిత ప్రకటించారు. ఇంటింటికీ తాగునీటిని అందించేందుకు ఇచ్చిన వాగ్దానం మేరకు త్వరలో మిషన్ భగీరథ నీటిని అందించనున్నట్టు తెలిపారు. 22 ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న పెద్దపల్లి-నిజామాబాద్ రైల్వేలైన్‌ను పూర్తి చేయిస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చుకున్నామన్నారు. అంతకుముందు నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.


కరీంనగర్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గౌడ సంఘం నాయకులు, గీత కార్మికులు


నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో కేసీఆర్ చిత్రపటానికి కల్లుతో అభిషేకం చేస్తున్న గౌడ కులస్థులు

హర్షాతిరేకం

- గౌడ కులస్థులకు సీఎం వరాలపై ఆనందం
- ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం


ఖమ్మంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గౌడ సంఘం నాయకులు

నమస్తే తెలంగాణ, నెట్‌వర్క్: ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా గౌడ కులస్థులపై వరాల జల్లు కురిపించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. రాష్ట్రవ్యాప్తంగా గురువారం సీఎం కేసీఆర్ చిత్రపటాలకు గౌడ కులస్థులు క్షీరాభిషేకం చేసి, స్వీట్లు పంచిపెట్టారు. సీఎం కేసీఆర్ చరిత్రలో నిలుస్తారనీ, సబ్బండ వర్గాలను ఆదరిస్తున్న ఏకైక సీఎం అని కొనియాడారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో, హుజురాబాద్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, డప్పు చప్పుళ్లతో సంబరాలు జరుపుకున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంతో పాటు సిరికొండ, బోధన్‌లో సీఎం కేసీఆర్, ఎంపీ కవిత ఫ్లెక్సీలకు, కామారెడ్డి జిల్లా కేంద్రంలో గీత పారిశ్రామిక సహకార సంఘం-1 ఆధ్వర్యంలో, పిట్లంలో వైస్ ఎంపీపీ నర్సాగౌడ్ ఆధ్వర్యంలో, దోమకొండ మండలం ముత్యంపేటలో గౌడ కులస్థులు, సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్ ఆవరణలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమరగాని వెంకన్న గౌడ్ అధ్యక్షతన, పెద్దపల్లి జిల్లా మంథనిలో ఎంపీపీ ఏగోళపు కమల శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం వద్ద, కమాన్‌పూర్ మండల కేంద్రంలో కేసీఆర్, ఎమ్మెల్యే పుట్ట మధు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి, స్వీట్లు పంచుకున్నారు. వరంగల్ అర్బన్ జిల్లా ఐనవోలు మండలం కేంద్రంలో, వరంగల్ రూరల్ జిల్లా వర్ధన్నపేటలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో గీత కార్మికులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణ పరిధిలోని తాటికల్ రోడ్డులో వినూత్నరీతిలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి కల్లుగీత కార్మికులు మొదట పాలతో, తర్వాత కల్లుతో అభిషేకించారు.

గులాబీ గుబాళింపు


జనగామ జిల్లా సీతారాంపురంలో టీఆర్‌ఎస్‌లో చేరిన కుటుంబాలతో ఎమ్మెల్యే దయాకర్‌రావు

నమస్తే తెలంగాణ, నెట్‌వర్క్: టీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. గురువారం నిజామాబాద్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో మాదిగ యువసేన నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు బరికుంట శ్రీనివాస్ మాదిగతో పాటు 60 మంది కార్యకర్తలు టీఆర్‌ఎస్‌లో చేరగా, వారికి ఎంపీ కవిత కండువాలు కప్పి పార్టీలోకి సాదారంగా ఆహ్వానించారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సీతారాంపురం వడ్డెర కాలనీకి చెందిన 50కుటుంబాలు(సుమారు 200మంది) కాంగ్రెస్‌ను వీడి, ఎమ్మెల్యే దయాకర్‌రావు సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని మాచర్లలో 50 మంది గీత కార్మికులు, నాయకులు టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువాలు కప్పుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్, టీడీపీ యువకులు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే గువ్వల బాలరాజు స్వగృహంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

గన్నేరువరం: కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండల కేంద్రంలో చదువుకుంటున్న మైలారం గ్రామానికి చెందిన బాలికపై ఓ యువకుడు గురువారం లైంగిక దాడికి యత్నించాడు. పోలీసుల వివరాల మేరకు.. మధ్యాహ్న సమయంలో పాఠశాల నుంచి మైలారం వెళ్తున్న బాలికను తహసీల్దార్ కార్యాలయం వద్ద గన్నేరువరం గ్రామానికి చెందిన న్యాత ప్రేమ్‌సాగర్(21) పిలిచాడు. దగ్గరలో ఉన్న గడ్డివాము వద్దకు తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నించగా, బాలిక కేకలు వేసింది. అటు వైపు వెళ్తున్న వారు అక్కడికి చేరుకునే సరికి యువకుడు పారిపోయాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వారు సీసీ కెమెరా పుటేజీని పరిశీలించి, ఆ యువకుడిని పట్టుకున్నారు.

మావోయిస్టు డీసీ అరెస్టు


భద్రాచలం టౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మణుగూరు ఏరియా కమిటీ సీపీఐ మావోయిస్టు డిప్యూటీ కమాండర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ అంబర్ కిషోర్‌ఝా తెలిపారు. చర్ల మండలంలోని కలివేరు వద్ద బుధవారం సాయంత్రం వాహన తనిఖీలు చేస్తుండగా, మణుగూరు ఏరియా కమిటీ సీపీఐ మావోయిస్టు డిప్యూటీ కమాండర్ సోడి ఉంగయ్య అలియాస్ ఉంగా అలియాస్ సురేశ్ పట్టుబడ్డాడన్నారు. అతని వద్ద 20 డిటోనేటర్లు, 8 జిలెటిన్ స్టిక్స్ ఉన్నట్టు చెప్పారు. గతంలో లొంగిపోయిన నలుగురు మావోయిస్టులకు ప్రభుత్వ పునరావాసం చెక్కులను ఎస్పీ అందజేశారు.

కొడిమ్యాలలో మాల్‌ప్రాక్టీస్

- ఎంఈవో సహా 9మంది ఉపాధ్యాయులపై కేసు
- ఏడుగురి సస్పెన్షన్


మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఎస్సై

కొడిమ్యాల: పదో తరగతి పరీక్షల సందర్భంగా పలువురు ఉపాధ్యాయులే మాల్‌ప్రాక్టీస్‌ను ప్రోత్సహిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడి చేసి గుట్టురట్టు చేశారు. ఈ ఘటనలో ఎంఈవో సహా 9మంది ఉపాధ్యాయులపై కేసు నమోదు కాగా, వీరిలో ఏడుగురి సస్పెన్షన్‌కు గురయ్యారు. జగిత్యాల జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, మల్యాల సీఐ నాగేంద్రగౌడ్ వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి గణితం-2 పరీక్ష నిర్వహించారు. ఈ కేంద్రం పక్కనే సూరంపేట ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు కొండూరి సతీష్ ఇల్లు ఉన్నది. ఇక్కడ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బత్తిని సత్యనారాయణగౌడ్, ఒడ్నాల శ్రీనివాస్(రామ్‌సాగర్ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు), వడ్లకొండ రమేశ్(కోనాపూర్ ప్రభుత్వ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు), కస్తూర్బా పాఠశాల ప్రత్యేకాధికారి బండి లింగవ్వ, ఉరకంటి రాధ(మోడల్ స్కూల్ గణిత ఉపాధ్యాయిని), గట్టిపల్లి పద్మ(కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల గణిత ఉపాధ్యాయిని) నకలు చిట్టీలు తయారు చేస్తుండగా పక్కా సమాచారంతో ఎస్ఐ సోమ సతీష్ వెళ్లి సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తుండగా అందరూ పారిపోయే ప్రయత్నం చేశారు. ప్రిన్సిపాల్ సత్యనారాయణగౌడ్, వడ్లకొండ రమేశ్‌ను ఠాణాకు తరలించే ప్రయత్నంలో సత్యనారాయణకు, ఎస్ఐకి కొంతసేపు గలాటా జరిగింది. మాల్‌ప్రాక్టీస్ జరిగిందని భావిస్తున్న పరీక్ష గదిలో పదో తరగతి మ్యాథ్స్ -2 పేపర్‌కు సంబంధించి తెల్లకాగితంపై ప్రశ్నలు రాసి ఉండగా, ఆ పేపర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాట్సాప్ ద్వారా ఉపాధ్యాయులకు క్వశ్చన్ పేపర్ వచ్చిందా? లేదా ప్రశ్నలు రాసిన తెల్లకాగితం వచ్చిందా? దానిని ఎవరు పంపారు? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో ఏడుగురు ఉపాధ్యాయులు బత్తిని సత్యనారాయణగౌడ్, వడ్లకొండ రమేశ్, వొడ్నాల శ్రీనివాస్, మంద లింగవ్వ, గట్టిపల్లి పద్మ, ఉరకంటి రాధ, ఇంట్లో ఆశ్రయమిచ్చిన కొండూరి సతీష్‌ను సస్పెండ్ చేసినట్లు జగిత్యాల జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. వీరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంఈవో కల్వకోట వెంకటేశ్వర్‌రావు, సీఆర్‌పీ బండి చంద్రమోహన్, ఏడుగురు ఉపాధ్యాయులపై పోలీసులు కేసు నమోదు చేసి, ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు.


కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానళ్లు, ఇన్‌సెట్‌లో రైల్వే ఇన్ఫోయాప్ గురించి వివరిస్తున్న జీఎం వినోద్‌కుమార్ యాదవ్

అన్ని రైల్వేస్టేషన్లలో సోలార్ ప్లాంట్లు

రైల్వే జీఎం వినోద్‌కుమార్‌యాదవ్ వెల్లడి


కాచిగూడ: అన్ని రైల్వేస్టేషన్లలో త్వరలో సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటుచేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ చెప్పారు. రైల్వే ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు సమకూర్చడమే ధ్యేయమని అన్నారు. కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ఏర్పాటుచేసిన 400 కిలోవాట్స్ సోలార్ ప్లాంట్‌ను గురువారం ఆయన సందర్శించారు. అది పనిచేసే విధానాన్ని సిబ్బందిని అడిగి తెలుకున్నారు. రైల్వేస్టేషన్ ప్లాట్ ఫారం-1లో మొబైల్ యాప్‌ను ఆవిష్కరించారు. సోలార్ విద్యుత్ ప్లాంట్ ద్వారా రైల్వేకు ఏడాదికి రూ.21.66 లక్షలు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో రైల్వే డీఆర్‌ఎం అరుణ్‌కుమార్‌జైన్, ఏడీఆర్‌ఎంఐ సాయిప్రసాద్, సీనియర్ డీసీఎం శ్రీధర్, సీనియర్ డీఎస్టీ లక్ష్మణ్‌రాజు, సీనియర్ డీఈఎన్ మోతీలాల్ భూక్యా, సీనియర్ డీఎంఎం కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఎల్‌ఎం పరీక్ష రాసిన ఎమ్మెల్యే


పరీక్ష రాస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి


ఆర్మూర్, నమస్తే తెలంగాణ: వరంగల్ నగరంలోని కాకతీయ యూనివర్సిటీలో 'మాస్టర్ ఆఫ్ లా'(ఎల్‌ఎల్‌ఎం) పరీక్షను గురువారం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి రాశారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి వరంగల్‌లోని ఆదర్శ లా కాలేజ్‌లో దూరవిద్యలో ఎల్‌ఎల్‌ఎం కోర్సు చేస్తుండగా, గురువారం కోర్సు మొదటి సంవత్సర ఇంటర్నల్ పరీక్షను కేయూ పరీక్ష కేంద్రంలో రాశారు. పరీక్ష అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తనకు కళాశాల రోజులు గుర్తుకువచ్చాయని 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వర్తిస్తూ నిత్యం బిజీగా ఉండే ఎమ్మెల్యే ఉన్నత విద్యను అభ్యసిస్తుండడం విశేషం.

టీఎస్ ఆర్టీసీ జేడీ వెంకటరావుకు డాక్టరేట్


టీ వెంకటరావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఎస్ ఆర్టీసీ జాయింట్ డైరెక్టర్ (విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ) టీ వెంకటరావుకు కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. పోలీస్ అండ్ లా-ఏ క్రిటికల్ స్టడీ ఆఫ్ కానిస్ట్యూషన్ అండ్ హ్యూమన్ రైట్స్ డైమెన్షన్ అనే అంశంపై వెంకటరావు పరిశోధన చేశారు. దీనిపై వెంకటరావుకు డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్నట్లు కేయూ గురువారం ప్రకటించింది.

ఇనుప మేకు మింగి బాలుడి మృతి


రిశ్విత్ (ఫైల్)

గాంధారి: ప్రమాదవశాత్తు బాలుడు ఇనుప మేకు మింగి మృతి చెందాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా గాంధారి మండలం కరక్‌వాడీలో చోటుచేసుకున్నది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. కరక్‌వాడీకి చెందిన బీమిలైనీ భాస్కర్‌రావు చిన్నకొడుకు రిశ్విత్(3) బుధవారం సాయంత్రం ఇంటి వద్ద ఆడుకుంటూ, అక్కడే దొరికిన ఇనుప మేకును నోట్లో పెట్టుకోగా, అది గొంతులోకి జారింది. గమనించిన కుటుంబ సభ్యులు దవాఖాన తరలిస్తుండగా ఊపిరాడక మార్గమధ్యం లో మృతిచెందాడు.

అగ్నికి ఆహుతైన 'కెన్' వృక్షాలు

వెంకటాపురం: తెలంగాణలో అత్యంత అరుదైన వృక్ష సంపద అగ్నికి ఆహుతైంది. పరిశోధనలకు జంతు జీవాల మనుగడకు దోహదపడుతున్న వృక్షాలన్నీ కాలిబూడిదయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపురం మండలంలోని పాలంపేట ప్రధాన రహదారిపై కెన్ వృక్ష సంపద విస్తరించి ఉన్నది. గురువారం పట్టపగలు ఒక్కసారిగా కారుచిచ్చురేగి వృక్షాలు కాలిపోయాయి. అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యంతో సంపద బుగ్గిపాలు అయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అక్రమ దందాలపై నిఘా: ఏసీపీ

చెన్నూర్, నమస్తే తెలంగాణ: అక్రమ దందాలపై నిఘా పెట్టినట్లు జైపూర్ సబ్ డివిజనల్ ఏసీపీ సీతారాములు అన్నారు. చెన్నూర్‌లోని కొత్తగూడెం కాలనీలో గురువారం పోలీసులు కార్డెన్ సెర్చ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలు లేని 32ద్విచక్ర వాహనాలు, 7ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే బెల్టు షాపుపై దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాడెంట్ రవికుమార్, తదితరులున్నారు.

విదేశీభవన్‌తో విశేష సేవలు

'మదద్' పోర్టల్ వినియోగంలో తెలంగాణ ఉత్తమం.. మృతదేహాలను వీలైనంత త్వరగా రప్పిస్తున్నాం

గుడ్ కండక్ట్ సర్టిఫికెట్‌కు ఇక స్వస్తి: విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి రవీశ్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రం నుంచి విదేశాలకు వెళ్లేవారికి హైదరాబాద్‌లో ప్రారంభించబోయే 'విదేశీభవన్' మార్గదర్శిగా నిలుస్తుందని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి, అధికార ప్రతినిధి రవీశ్‌కుమార్ అన్నారు. మదద్ పోర్టల్ ద్వారా సమస్యలు తమ దృష్టికి తీసుకురావడంలో, పరిష్కారం లభించేలా శ్రద్ధ చూపడంలో తెలంగాణ ముందుందని ప్రశంసించారు. విదేశాంగశాఖను అన్ని ప్రాంతాలవారికి చేరువ చేసేందుకు 'విదేశీ ఆయా ప్రదేశ్ కే ద్వార్' పేరిట గురువారం ఐటీసీ కాకతీయలో ప్రచార కార్యక్రమాన్ని ఆ శాఖ నిర్వహించింది. ఈ సందర్భంగా మీడియా అడిగిన పలు ప్రశ్నలకు విదేశీ వ్యవహారాల అధికారులు నాగేంద్రప్రసాద్, అబు మాథెన్‌జార్జ్, రీజినల్ పాస్‌పోర్టు ఆఫీసర్ విష్ణురెడ్డితో కలిసి రవీశ్‌కుమార్ సమాధానాలిచ్చారు. తెలుగు, ఉర్దూ భాషలకు హబ్‌గా ఉన్న తెలంగాణ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభించడం సంతోషంగా ఉన్నదని పేర్కొన్నారు. విదేశీ వ్యవహారాలశాఖను స్థానిక భాష ద్వారా ప్రజలకు చేరువయ్యేలా ప్రయత్నిస్తున్నామని, స్థానిక మీడియా ఇందులో పాల్పంచుకోవాలని కోరారు. యూఏఈకి వెళ్లేవారికి ఇన్నాళ్లు ఇబ్బందికరంగా ఉన్న గుడ్ కండక్ట్ సర్టిఫికెట్ నుంచి ఇక ఉపశమనం లభిస్తుందని.. దీని బదులు పోలీసు క్లియరెన్స్ సర్టిఫికెట్‌ను ప్రామాణికంగా తీసుకోవాలనే సూచనను ఆ దేశం ఆంగీకరించిందని వెల్లడించారు. మరో రెండు మూడు రోజుల్లో ఇది అమలులోకి వస్తుందన్నారు. విదేశాల్లో మృతిచెందినవారి మృతదేహాలను వీలైనంత త్వరగా స్వదేశానికి రప్పించేందుకు కృషిచేస్తున్నామని చెప్పారు.



హైదరాబాద్‌లో విదేశీ ప్రాంతీయ మీడియా మంత్రిత్వశాఖ ముఖాముఖీలో మాట్లాడుతున్న రవీశ్‌కుమార్

కేటీఆర్ ప్రపంచంతో పోటీపడాలంటారు..

పోటీ పడాల్సింది పక్క రాష్ట్రాలతో కాదు.. ప్రపంచంలోని అత్యుత్తమ నగరాలతో అని ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కేటీఆర్ ఎప్పుడూ అంటారని రీజినల్ పాస్‌పోర్టు ఆఫీసర్ విష్ణురెడ్డి పేర్కొన్నారు. అన్ని రాష్ట్రాలు స్ఫూర్తితో పోటీపడి పనిచేసే రోజులొచ్చాయని, విదేశీ విధానం గురించి అందిరికీ అవగాహన ఉండాలన్నారు. అడిగిన వెంటనే తెలంగాణ ప్రభుత్వం విదేశీభవన్ కోసం రెండు ఎకరాలు కేటాయించిందని, అన్ని విధాలుగా సహకరిస్తుందని ఆయన ప్రశంసించారు.


స్మార్ట్ అర్బనైజేషన్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కర్ణాటక మంత్రి రోషన్‌బేగ్ తదితరులు

స్మార్ట్ అర్బనైజేషన్ ఎక్స్‌పో ప్రారంభం

- రాష్ట్ర ప్రభుత్వం, స్మార్ట్ సిటీస్ కౌన్సిల్ ఆధ్వర్యంలో హెచ్ఐసీసీలో రెండురోజుల సదస్సు

హైదరాబాద్,నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో 'స్మార్ట్ అర్బనైజేషన్' ఎక్స్‌పో గురువారం ప్రారంభమైంది. రెండురోజులు జరిగే ఈ సదస్సును తెలంగాణ ప్రభుత్వం, స్మార్ట్ సిటీస్ కౌన్సిల్ ఇండియా సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. భారత్, చైనా వంటి దేశాలకు చెందిన స్టార్టప్ సంస్థలే కాకుండా బడా కంపెనీలు ఈ ఎక్స్‌పో పాల్గొన్నాయి. కరీంనగర్‌కు చెందిన 'టీమ్ అప్' స్టార్టప్ సంస్థ పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి స్మార్ట్ సిటీ యాప్‌ను ప్రారంభించింది. ఇప్పటికే కరీంనగర్ పురపాలక సంస్థతో అవగాహన కుదుర్చుకున్నది. పట్టణాల్లో వీధి దీపాలను నిర్వహించడం, సులువుగా పర్యవేక్షణ, విద్యుత్తు ఖర్చు ఆదా వంటి అంశాల ప్రాతిపదికన 'క్రాంప్టన్' సంస్థ స్మార్ట్ స్ట్రీట్ లైట్ సొల్యూషన్స్‌ని ప్రదర్శనకు ఉంచింది. ముంబైకి చెందిన వైల్డ్ వెస్ట్ మీడియా స్వచ్ఛ భారత్ రీసైకిల్ యంత్రపరికరాల్ని ప్రదర్శనకు ఉంచింది.

• ఐటీ పార్కులను సందర్శించిన నేపాల్ జర్నలిస్టులు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఐటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను విదేశీ ప్రతినిధులు ప్రశంసించారు. నేపాల్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టుల బృందం గురువారం హైటెక్ సిటీ సైబర్ టవర్స్, రహేజా ఐటీ పార్కులను సందర్శించింది. ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహాన్ని ఐటీ కంపెనీల ప్రతినిధులు బృందం సభ్యులకు వివరించారు. రహేజా గ్రూపు నూతనంగా నిర్మిస్తున్న ఐటీ టవర్స్‌పై కంపెనీ జేడీ గణేష్ నేపాల్ బృందానికి వెల్లడించారు.



ఎన్విరాన్‌మెంట్ కాంగ్రెస్‌లో నివేదికను ఆవిష్కరిస్తున్న వీకే దమోదరన్ తదితరులు

మున్సిపాలిటీల్లో 'శాటిలైట్' అభివృద్ధి

- ఎన్విరాన్‌మెంట్ కాంగ్రెస్ సదస్సు ప్రారంభం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉపగ్రహ చిత్రాల బేస్‌మ్యాప్‌లు రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు ఉపయుక్తంగా ఉంటాయని పలువురు నిపుణులు సూచించారు. సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్, జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ వర్సిటీల ఆధ్వర్యంలో యూసఫ్‌గూడలోని ఎమ్మెస్‌ఎంఈ సెంటర్‌లో గురువారం తెలంగాణ ఎన్విరాన్‌మెంట్ కాంగ్రెస్ సదస్సు ప్రారంభమైంది. మున్సిపాలిటీల అభివృద్ధి, పర్యావరణ అంశాలపై శాటిలైట్ ద్వారా తీసిన హై-రిసొల్యూషన్ చిత్రాలను ఎన్నార్‌ఎస్సీకి చెందిన 'భువన్' పోర్టల్‌లో నిక్షిప్తంచేస్తున్నట్లు నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ డైరెక్టర్, టీఈసీ చైర్మన్ వైవీఎన్ కృష్ణమూర్తి చెప్పారు. ఈ సదస్సుకు సీఈడీ చైర్మన్ వీకే దామోదరన్ అధ్యక్షత వహించారు.

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.

zindagi@ntdaily.news

www.ntzindagi.com

/nt.zindagi

హైదరాబాద్

శుక్రవారం 23 మార్చి 2018

WWW. NTNEWS.COM

లేటెస్ట్ లెహంగా!

ఏ సందర్భంలోనైనా.. అకేషన్ ఏదైనా..
సంప్రదాయతకు పెద్ద పీట వేయాలంటారు పెద్దలు..
కానీ దానికి మోడ్రన్ టచ్ ఇవ్వాలని చూస్తుంటారు పిల్లలు..
సంప్రదాయతకు ఆధునికతను జోడిస్తే తయారయ్యేవే లెహంగాలు..
ఏ సంబురమైనా అంబరాన్నంటాలంటే లెహంగాలే బెస్ట్ చాయిస్!
అందుకే హంగామా చేసే పడుచులకు ఈ లెహంగాల కలెక్షన్ ఇస్తున్నాం..



గ్రీన్ ప్యూర్ పట్టు లెహంగాని ఎనిమిది మీటర్లతో ఎక్కువ ఫ్లేర్ వచ్చేలా డిజైన్ చేశాం. దీని మీద కుందన్స్, ముత్యాలు, కర్దనాతో మోకాళ్ల వరకు వచ్చేలా వర్క్ చేయించాం. ఇదే లెహంగాకి హైలైట్‌గా నిలుస్తుంది. ఆకుపచ్చని సిల్క్ బ్లౌజ్‌ని సింపుల్‌గా డిజైన్ చేసి, స్లీవ్స్ మీద మాత్రం కుందన్స్, ముత్యాలతో హెవీగా వర్క్ చేయడంతో సూపర్ లుక్ వచ్చేసింది.

ఈ రంగుల కలయిక ఎప్పుడూ అదుర్సే.
సీ బ్లూ కలర్ కాటన్ సిల్క్ లెహంగా మీద కలీ ప్యాటర్న్ బార్డర్‌ని కుట్టాం. ఈ డిజైన్‌ని కుందన్, జర్దోసీ, జరీలతో హెవీగా కుట్టేశాం. పింక్ కలర్ సిల్క్ బార్డర్‌ని జత చేశాం. గోల్డ్ నెట్ బ్లౌజ్ మీద ముత్యాలు, జర్దోసీతో హెవీగా వర్క్ చేయించాం. స్లీవ్‌లెస్‌గా ఇవ్వడంతో స్టైలిష్ లుక్ వచ్చింది. పీచ్ కలర్ సాఫ్ట్ నెట్‌ని దుపట్టాగా ఎంచుకున్నాం. దీని మీద జర్దోసీ, కుందన్స్‌తో హెవీగా డిజైన్ చేశాం.



బ్లూ కలర్ వెల్వెట్ లెహంగా మీద అద్దాలు, ముత్యాలతో పెద్ద పెద్ద మోటిఫ్స్ ఇచ్చాం. దీనికి గోల్డెన్ సీక్వెన్స్ బార్డర్‌ని జతచేశాం. బ్లూ వెల్వెట్ బ్లౌజ్‌ని స్లీవ్‌లెస్‌గా డిజైన్ చేశాం. పీచ్ కలర్ నెట్ దుపట్టా మీద థ్రెడ్, సీక్వెన్స్ వర్క్‌తో నింపేశాం.



ఎక్కడైనా, ఎప్పుడైనా అందంగా మెరిసిపోవాలంటే ఈ లెహంగా వేయాల్సిందే! గోల్డ్ కలర్ జామవార్ బెనారస్ లెహంగాని కలీస్ ఎక్కువ పెట్టి డిజైన్ చేశాం. దీనికి మ్యాచింగ్ అవ్వాలని గోల్డ్ కలర్ నెట్‌ని బ్లౌజ్‌గా ఎంచుకున్నాం. దీని మీద మొత్తం ముత్యాలు, జర్దోసీతో హెవీగా కుట్టాం. పీచ్ కలర్ ఆర్గంజా నెట్ బెనారస్‌ని దుపట్టాగా ఎంచుకున్నాం. దీనికి సెల్ఫ్ ప్రింట్ రావడంతో మరింత అందంగా మెరిసిపోతున్నది.

ఆరెంజ్ కలర్ నెట్ లెహంగా ఇది. దీనికి ఎర్రని రాసిల్క్, బెనారస్ ఫ్యాబ్రిక్‌ని రెండు వైపులా బార్డర్‌గా జతచేశాం. బ్లాక్ కలర్ వెల్వెట్ బ్లౌజ్ మీద కుందన్స్, జర్దోసీలతో హెవీగా డిజైన్ చేశాం. ఇక ఎర్రని జార్జెట్ దుపట్టాకి రెండు వైపులా బ్లాక్ కలర్ బెనారస్‌ని జతచేసి, గోల్డెన్ లేస్ ఇవ్వడంతో మరింత అందంగా మెరిసిపోతున్నది.



కీర్తన సునీల్
రేఖాస్ హౌస్ ఆఫ్ కోచర్స్
జూబ్లీహిల్స్, హైదరాబాద్
ఫోన్ : 040-65555133
https://m.facebook.com/rekhashouseofcoutures
Insta- rekhas_couture

చర్మ సౌందర్యానికి ఉప్పు!!

- పావుకప్పు ఉప్పులో అరకప్పు కొబ్బరినూనె/ఆలివ్ ఆయిల్ కలిపి ముద్దగా చేయాలి. తర్వాత ఒళ్లంతా మృదువుగా మర్దనా చేయాలి. 5 నిమిషాల తర్వాత స్నానం చేస్తే మంచి ఫలితం ఉంటుంది. ఇలా వారానికి ఒక సారి చేయాలి.
- రెండు చెంచాల ఉప్పు నాలుగు చెంచాల తేనె బాగా కలుపాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి 15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో ముఖం కడుగాలి. ఈ ప్యాక్‌ను వారానికి రెండుసార్లు ప్రయత్నించొచ్చు.
- రెండు చెంచాల ఉప్పును గోరువెచ్చన నీటిలో బాగా కరిగిపోయేలా కలుపాలి. ఆ నీటిని స్ప్రే సీసాలో నింపి.. ఎప్పుడు కావాలంటే అప్పుడు ముఖంపై చల్లుకోవాలి. ఇలా చేస్తుంటే మొటిమలతో కూడిన జిడ్డు చర్మం కనిపించదు.

నేను మందులు మానెయ్యొచ్చా?

అడుగండి చెబుతా



నా వయసు 48 సంవత్సరాలు. పోయిన సంవత్సరం కిడ్నీ మార్పిడి సర్జరీ అయ్యింది. మందులు వాడుతూనే ఉన్నాను. ఈ మందులు ఇంకెన్నాళ్లు వాడాల్సి ఉంటుంది. మందులు ఎప్పుడు మానెయ్యొచ్చు? వివరంగా తెలియజేయగలరు.
- సులోచన, నిజామాబాద్

కిడ్నీ మార్పిడి సర్జరీ జరిగిన తర్వాత ఆ కిడ్నీని శరీరం తిరస్కరించకుండా ఉండేందుకు కొన్ని మందులు జీవిత పర్యంతం వాడుతూనే ఉండాలి. చాలామందికి ఈ అవగాహన లోపించి కిడ్నీ బాగానే పనిచేస్తుంది కదా అని మందులు మానేస్తారు. ఇలా చెయ్యడం వల్ల ఆ కిడ్నీని శరీరం తిరస్కరిస్తుంది. తర్వాత మళ్లీ సమస్యలు మొదలవుతాయి. కిడ్నీ మార్పిడి తర్వాత ఇచ్చే ఇమ్యూనోసప్రసెంట్ మందుల వల్ల ఇన్‌ఫెక్షన్లు సోకేందుకు ఆస్కారాలు ఎక్కువగా ఉంటాయి. జలుబు, దగ్గు, జ్వరం వంటి చిన్న అనారోగ్యం ఎదురైనా సరే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. వారి సూచనల మేరకు మాత్రమే మందులు వాడాల్సి ఉంటుంది. పోషకాలతో కూడినది, తాజాగా తయారు చేసిన ఆహారం మాత్రమే తీసుకోవాలి. నిల్వ ఉంచిన ఎలాంటి ఆహారం తీసుకోకూడదు. ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉంటే తప్పకుండా వాటిని అదుపులో ఉంచుకోవాలి. వ్యాయామాన్ని ఎట్టి పరిస్థితుల్లో మానకూడదు. ఇలాంటి జాగ్రత్తలన్నీ పాటిస్తుంటే మీకు అమర్చిన కిడ్నీ ఎక్కువ కాలం పాటు సమర్థవంతంగా పనిచేస్తుంది.



డాక్టర్ విక్రాంత్ రెడ్డి
కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్
కేర్ హాస్పిటల్స్
హైదరాబాద్

నమస్తే తెలంగాణ
చింతన
[హైదరాబాద్]
శుక్రవారం 23 మార్చి 2018

బుద్ధమార్గం

రెట్టింపు దుఃఖం.. రెట్టింపు సుఖం

సమాజానికి ఏది మంచో, ఏది చెడో అందరికీ తెలుసు. కానీ ఈర్ష్య, ద్వేషం, పగ, అనుమానం, దోపిడీ లాంటి అమానవీయ తలంపుల వల్ల సుఖం పొందగలం అనుకోవడమే మనుషుల్ని చెడ్డదారిలోకి మళ్లిస్తాయి. మంచి పనికి మనస్సు ఎంత సంతోషపడుతుందో, చెడ్డ పని చేస్తే అంత దుఃఖపడుతుంది. మానవ సమాజాన్ని ఇలాంటి దుఃఖం నుండి దూరం చేయడం కోసమే బుద్ధుడు తన ధర్మాన్ని ప్రబోధించాడు.

ఒకసారి బుద్ధుడు శ్రావస్తి దగ్గరలో ఉన్న ఒక గ్రామంలో ఉన్నాడు. ఆ గ్రామంలో ఒక గయ్యాళి ఉంది. ఆమె తన దగ్గర పనిచేసే ఒక మనిషి మీద అనుమానం పెంచుకుంది. ఒకరోజున నిష్కారణంగా ఆ పనిమనిషిని తీవ్రంగా కొట్టింది. పనిమనిషి ఒళ్లంతా చీరుకుపోయి, రక్తం కారింది. దాంతో ఈమె ఇప్పుడు బైటకు పోతే తన దౌష్ట్యం తెలిసిపోతుంది. ఆమె కుటుంబ సభ్యులు గొడవ చేస్తారు అనుకొని ఆ పని మనిషిని ఇంట్లోని గదిలో కట్టి పడేసింది.



ఆరోజు సాయంత్రం తన భర్తతో కలిసి బుద్ధుని ప్రబోధం వినడానికి పోయింది.

ఈలోగా పనిమనిషి బంధువులు ఆమె ఇంటికి రాకపోవడంతో యజమాని ఇంటికి వచ్చారు. గదిలో బంధించి ఉంచిన ఆమెను విడిపించుకొని సరాసరి బుద్ధుని దగ్గరకు వెళ్లారు. వాళ్లు రావడం చూసిన యజమానురాలు భయపడింది. ఆమెకు చెమటలు పట్టాయి. పని మనిషి తనకు జరిగిన విషయం చెప్పింది. యజమానురాలు సిగ్గుతో తల దించుకుంది.

అప్పుడు బుద్ధుడు –

‘అకతం దుక్కతం సేయ్యో
పచ్ఛా తపతి దుక్కతం
కతంచి సుకతం సేయ్యో
యం కత్వా నాను తప్పతి’

దుష్కర్మలు చేయకపోవడం మంచిది. దుష్కర్మలు పశ్చాత్తాపానికి కారణం అవుతాయి. మంచి పనులు చేయడం మరీ మంచిది. అవి దుఃఖాన్ని దగ్గరకు రానీయవు అని చెప్పి, అంతేకాదు –

‘ఒక చెడ్డపని రహస్యంగా చేస్తే దానివల్ల రెట్టింపు దుఃఖం కలుగుతుంది. చేసినందుకు దుఃఖం, అది దాచినా వెల్లడి అయినందుకు మరింత దుఃఖం కలుగుతుంది. అలాగ రహస్యంగా చేసిన దానం, సహాయం లాంటి మంచి పనుల వల్ల రెట్టింపు సంతోషం కలుగుతుంది. తన తప్పు తాను తెలుసుకుని దుఃఖాన్ని కలిగించే పనులు చేయడం ఉత్తమం’ అని ప్రబోధించాడు.

ఆ గయ్యాళి ఇల్లాలికి జ్ఞానోదయమై ఆనాటి నుండి తన పనివారి పట్ల ప్రేమతో, గౌరవంతో ప్రవర్తించి మంచి పేరు తెచ్చుకుంది.

... బొర్రా గోవర్ధన్

ఆత్మదర్శనం

బాహ్య ప్రపంచం అనుభవాన్నిస్తే అంతర ప్రపంచం అనుభూతిని ఇస్తుంది. అనుభవం అనుభూతిగా మారాలంటే అంతరంగ ప్రయాణం చెయ్యాలి. ఆ ప్రయాణం ప్రాపంచికానుభవాలకంటే ఉదాత్త అనుభవాలను కలిగించి, దృష్టిని లోపలకు మరల్చి లోచూపును ప్రసాదిస్తుంది. దీనినే అంతర్నేత్రమని, మూడో కన్నని యోగశాస్త్రం వర్ణిస్తుంది. ఇంద్రియాలను అధిగమించి ప్రయాణించగల మనస్సు ఈ స్థితిని సునాయసంగా అందుకుంటుంది.

అప్పటి వరకు తెలిసిన ప్రాపంచిక విలువలు తమను తాము ఆవిష్కరించుకుంటూ మనసును అంటే మన ఆలోచనలను అంతర్ముఖం చేస్తాయి. అవి భౌతిక, అదిభౌతిక స్థితులను దాటిన ఆధ్యాత్మిక విలువలు.

ఈ విలువల ఆచరణ నిజానికి ఎదురీతే. ఏటవాలు ప్రయాణం మాత్రం కాదు. అయినా ఆధ్యాత్మిక విలువలందించే తృప్తి, సమర్పణ, వినయం, విచక్షణ, విశ్లేషణ వంటి నిర్ణయాత్మక భావనలు ఎదురీతకు మనిషిని సిద్ధం చేస్తాయ్. ఈ సందర్భంలో ఎదురీత కష్టాన్ని కలిగించకపోగా నిర్భయత్వాన్ని, ధైర్యాన్ని ప్రసాదిస్తుంది,. సముద్రంలో ఎగసి పడుతున్న కెరటాలను చూస్తున్నట్టుగా సాక్షీభూత స్థితి అలవడుతుంది. ఇది నిరాశకు నిర్వేదానికి తావులేని అద్భుత స్థితి.

చింతన ప్రారంభం

స్థూల శరీర పరిస్థితిని దాటి మనసు సూక్ష్మ శరీరాన్ని గూర్చిన ఆలోచన చేయడం మొదలు పెడుతుంది. మన ఆలోచనలు, మన జ్ఞాపకాలు, అహంకారం, మమకారం, వాసనలు, మూల వాసనలు కలిగి సూక్ష్మ శరీరం ఏర్పడుతుంది. దీని ఆధారంగా పునర్జన్మ సిద్ధాంతం రూపుదిద్దుకొని, కాల పరీక్షకు నిలబడి ఎందరెందరినో అధ్యయనం చేసిన తర్వాత పునర్జన్మ ఉన్నదన్న భావన స్థిరపడుతుంది. కాలగమనంలో అది సిద్ధాంతమై బహుళ జనామోదాన్ని పొంది నిలబడుతుంది. కనుక దేహం పోయినా ఆత్మ ఉంటుంది. ఆత్మ మళ్లీ మరో శరీరాన్ని పొంది స్థూలం నుంచి సూక్ష్మానికి, సూక్ష్మం నుంచి అంతర్ముఖానికి ఆపై ఆద్యంతరహిత స్థితిని పొందే దశకు చేరుకుంటుంది.



తర్కానికి అందదు..

ఇది సత్యాన్వేషణకు చుక్కాని. ఈ అనుభవం లేకుండా సత్య సాక్షాత్కారం కలుగదు. కలిగినా అవునో కాదో అన్న సంశయం మాత్రం మిగిలిపోతుంది. సాక్షాత్కారం పొందాలన్న నిశ్చయ బుద్ధి కలవాడికి ఇది దోహదకారియై, సందేహాలను తరిమికొట్టి సాక్షాత్కార అనుభూతిని అందిస్తుంది.

‘నచికేతా! గురువు –శిష్యుడు, ఉపాధ్యాయుడు – విద్యార్థి, ఆచార్యుడు – అంతే వాసి వంటి వారు కలిసి జీవిస్తే తమ సర్వశక్తులను జ్ఞానం పొందటంలోనే వినియోగిస్తారు. ఈ ప్రయత్నం అగాధ జలధిలో ఆల్చిప్పలలో దాగిన ముత్యాలను పట్టుకోవడం వంటిది. లోక గురువులు విషయాన్ని తెలియజేస్తే, సమర్థ గురువులు విషయాన్ని విపులంగా వివరిస్తే, మోచక గురువులు మోక్ష మార్గాన్ని సూచిస్తే, సద్గురువులు సత్యం వైపు నడిపిస్తారు. వీరందరూ తమతమ బోధను, ప్రయత్నాన్ని కొనసాగిస్తూ సాధకుడికి అతడి అంతరంగం వైపు నడిపించాలి.

అహంకారం ఉంటే గురువు దొరకడు. గురువు దొరికితే అహంకారం ఉండదు. ఉండకూడదు. మూఢ విశ్వాసాలను దాటి సక్రమ యదార్థ సాధన చెయ్యాలి. తర్కం వివాదం విడనాడాలి. గురుబోధను, శాస్త్రాన్ని ప్రమాణం చేసుకొని సాధన చెయ్యాలి. మనస్సును పూర్తిగా తెరచి ఉంచాలి. బుద్ధిని వికాసమానం చెయ్యాలి. చిత్తవృత్తులను నిరోధించాలి. అహంకారాన్ని వదులుకోవాలి. అహంస్ఫురణను వెలిగించుకోవాలి. అది ఆత్మ దర్శనానికి దారి తీస్తుంది. అంతటితో అన్వేషణ ముగుస్తుంది. అనుభూతి అంతరంగాన్ని ప్రకాశమానం చేస్తుంది. అదే స్వస్వరూపానుసంధానం. తేలిక మాటల్లో ఆత్మ దర్శనం.’ అన్నాడు యమ ధర్మరాజు. నచికేతుడు భక్తితో నమస్కరించాడు.

... వి. ఎస్. ఆర్. మూర్తి
ఆధ్యాత్మిక శాస్త్రవేత్త

శివ పంచాక్షరీ, కేశవుని అష్టాక్షరీ మంత్రాల సాటైన మహామంత్రం... శివకేశవులకు అభేదంగా కనిపించే మంత్రం.. నారాయణ తత్వాన్ని ప్రతిబింబించే మహోన్నత మంత్రం.. ఆరోగ్యాన్నిచ్చే ఔషధ మంత్రం... మోక్షానికి మార్గం చూపే తారక మంత్రం.. అదే మహిమాన్విత రామ నామ మంత్రం. శ్రీరామనవమి రాబోతున్న సందర్భంగా రామనామ విశిష్టతను నెమరేసుకుందాం. రామనామాన్ని జపిస్తూ, స్మరిస్తూ జన్మ ధన్యం చేసుకుందాం.

శుభకరం.. రామనామ స్మరణం



హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలమ్!
కలౌ నాస్త్వేవ నాస్త్వేవ నాస్త్వేవ గతిరన్యథా!!

అని చెబుతుంది బృహన్నారదీయ పురాణం

అంటే కలియుగంలో జీవులు తరించడానికి హరి నామం తప్ప వేరు గతి లేదు లేదు అని ముమ్మాటికి నొక్కి చెబుతుంది. హరి అన్నా, కృష్ణా అన్నా, రామా అన్నా, గోవిందా – వాసువేవ – నారసింహా.. అన్నా నారాయణ తత్వం ఒక్కటే. ఎవరు ఏ రూపాన్ని, ఏ నామాన్ని ఉపాసన చేస్తే వారిని ఆ విధంగానే అనుగ్రహిస్తాడు నారాయణుడు. నామమూ నామి నుండి వేరు కాదు. అనగా భగవంతుడు, భగవంతుడి పేరు వేరు కాదు. కాబట్టి రెండింటి స్మరణలో ఒకే మహిమ ఉంది. భగవన్నామాల్లో రామనామానికి మరింత ప్రాధాన్యం ఉంది.

మూలమంత్రాలనుంచి పుట్టినది...

ఓం నమో నా(రా)యణాయ – అష్టాక్షరీ మంత్రం
ఓం న(మ)ః శివాయ – పంచాక్షరీ మంత్రం

శివకేశవుల మూల మంత్రాల నుండి ‘రా’ని ‘మ’ని కలిపి రామ అని దశరథ మహారాజు కుమారుడిగా అవతరించిన మహావిష్ణువు అవతారానికి వశిష్ఠుడు నామకరణం చేశాడు. ఇంత సునాయాసంగా పలకగలిగే నామం, అనాయాసంగా తరించగలిగే నామం సృష్టిలో ఇంకొకటి లేదు అంటే అతిశయోక్తి కాదు.

ఔషధ మంత్రం

‘రా’ అనే అక్షరం నాభి దగ్గర్నుంచి మొదలవుతుంది. కాబట్టి జఠరాగ్నిని ఉత్తేజపరుస్తుంది. ‘మ’ అనే శబ్దం తలలో ఉన్న నాడుల్ని చైతన్యపరిచి శారీరకంగా, మానసికంగా ఉత్తేజపరిచే ఓ దివ్యౌషధం అని వైద్యులు ఏనాడో రుజువు చేశారు.

ఒక ఆసుపత్రిలో ఒకే రకమైన కుష్టు వ్యాధితో బాధపడుతున్న వ్యాధిగ్రస్తుల్లో సగం మందికి రామకోటి రాయమని కొన్ని పుస్తకాలని ఓ ఆధ్యాత్మిక సంస్థ వారు ఇచ్చారు. కాస్త భక్తి ప్రపత్తులు గల ఆ బాధితులు రాయడం మొదలుపెట్టారు. శ్రీరామ అని వ్రాసే లోపు శ్రీరామ రామ రామ అని మూడుసార్లు చెప్పేవారు. ఇలా మూడునెలలు గడిచే సరికి అద్భుతంగా వారి వ్యాధి లక్షణాలు కనుమరుగవడం జరిగింది. ఇలాంటి ఉదంతాలు ఎన్నో.

శివుడు ఉపదేశించిన మంత్రం..

సాక్షాత్తు జగన్మాత అయిన పార్వతీ దేవి పరమేశ్వరుడిని ‘భూలోకవాసులకు అనాయాసంగా బాధలు, భవబంధాలు తొలగి ముక్తి మోక్షం కలగాలంటే వారికి తరుణోపాయం ఏమిటి’ అని అడుగుతుంది. అందుకు శివుడు రామనామానికి మించిన నామం మరొకటి లేదని ఇలా చెబుతాడు.

‘శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే’ అని ముమ్మారు ఎవరైతే చెబుతారో వారు విష్ణు సహస్ర నామం పఠించిన ఫలితం పొందుతారు. కలియుగంలో రామోపాసన, రామనామం ఎవరైతేచెబుతారో వారికి కలి కల్మషాలు, దుఃఖాలు వారిని బాధించలేవు. శివుడు ధ్యానంలో కూడా రామనామాన్నే స్మరిస్తాడు. చివరకు కాశీ పట్టణంలో శరీరం విడిచిపెట్టిన జీవుల కుడిచెవిలో శివుడు ‘రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేదసే రఘునాథాయ నాథాయ సీతాయా పతయే నమః’ అని చెప్పి మరణించినవారికి పునర్జన్మ లేకుండా చేసి, మోక్షాన్నిస్తాడని ప్రతీతి. ఇంత శక్తివంతమైన, ఇంత మహత్తు కలిగిన ఈ రామనామాన్ని మనమెందుకు వదులుకోవాలి?

శుద్ధి చేసేది..

రామనామం వలన మనకు జరుగబోయే కీడు తొలగిపోవడమే కాదు, ఆ శబ్ద తరంగాల వలన మన పరిసరాలు సైతం ప్రక్షాళన జరిగి వాతావరణ కాలుష్యం నుండి మనల్ని రక్షిస్తుందనడంలో ఏమాత్రం సందేహం లేదు. మాటల్లో చెప్పే కంటే స్వానుభవంతో తెలుసుకోవడమే శ్రేష్ఠం. ఎవరైనా నిత్యం జపం చేసేవారిని మనం గమనించినట్లయితే వారిలో ఒక దివ్యత్వం, తేజస్సు కనబడతాయి. వాక్ శుద్ధి, చిత్త శుద్ధి వాటంతట అవే వస్తాయి. సమాజంలో వారికి తిరుగే ఉండదు.

శ్రీరామ శరణం మమ

... కుత్తుము తిరుమల రావు


ఎలా తలచినా ఒకటే..



మనస్సుతో : నామస్మరణ మనసులో చేయవచ్చును. యోమా స్మరతి నిత్యశః (గీత 8:14) అనే వాక్యంతో గీతలో వర్ణించాడు పరమాత్మ.



వాక్కుతో : నామజపం వాక్కు ద్వారా చేయవచ్చును. యజ్ఞానాం జప యజ్ఞోస్మి అని భగవానుడు గీతలో (10:25) తన స్వరూపాన్ని వివరించాడు.



కీర్తనతో : గట్టిగా ఆర్తిగా, గొంతెత్తి భగవంతుని కీర్తనం చేయవచ్చును. గీతాచార్యుడు దీని వర్ణనను కీర్తయంతః (గీత 9:14) అనే పదంతో సూచించాడు.

సువార్త

యెరూషలేములో యేసు జయప్రవేశము

ఈస్టర్ ఆదివారమునకు ముందు వచ్చే ఆదివారం రోజును క్రైస్తవులు పామ్ సండే (మట్టల ఆదివారం)గా జరుపుకుంటారు. యేసుక్రీస్తు యెరూషలేములోకి ప్రవేశించిన ఆ రోజుకు చరిత్రలో ఎంతో ప్రాముఖ్యత ఉన్నది. ఆ రోజున యేసు ఒక గాడిద పిల్లను ఎక్కి యెరూషలేములోకి వచ్చాడు. పక్క గ్రామంలో ఊరి వెలుపల ఒక ఇంటి వద్ద ఒక గాడిద, దాని పిల్ల కట్టేసి ఉంటాయని, వాటిని తనకొరకు తీసుకొని రమ్మని శిష్యులకు చెప్పాడు. ఎవరైనా అడ్డగిస్తే వాటిని ప్రభువు కొరకు తీసుకొని వెళుతున్నామని చెప్పండి, అప్పుడు వారు గాడిదలను తీసుకెళ్లనిస్తారు అని అన్నాడు. అన్నీ ఆయన చెప్పినట్టుగానే జరిగాయి. ఇది యేసు మానవాతీతుడని, అతీంద్రియ శక్తిగలవాడని రుజువు చేసింది. ఆ గాడిదలపై యేసు శిష్యులు తమ బట్టలు వేసి అలంకరించగా, దారిపొడగునా ప్రజలు కూడా తమ బట్టలు వేసి స్వాగతం పలికారు. కొందరు తాటి మట్టలు, ఈత మట్టలు, చెట్ల కొమ్మలను వేసి గాడిదలు నడిచే మార్గంలో పరిచారు. అందుకే ఆ రోజును మట్టల ఆదివారంగా ఆచరిస్తారు. ఆ రోజున ప్రజలు ‘ప్రభువుపేరట వచ్చువాడు స్తుతింపబడును గాక అని గట్టిగా నినాదాలు చేశారు. యేసు అలా ఆర్భాటంగా యెరూషలేములో ప్రవేశించడం ద్వారా వారు ఎదురుచూస్తున్న మెస్సియా(రక్షకుడు)ను తానేనని, తన రాక గురించి కొన్ని వందల సంవత్సరాల పూర్వం ప్రవక్తలు చెప్పిన మాటలు నెరవేరుతున్నాయని రుజువు చేశాడు.

ముందే తెలిసింది..



యేసుక్రీస్తు ఇలా గాడిద పిల్లనెక్కి వస్తాడని క్రీ.పూ. 520వ సంవత్సరంలోనే జెకర్యా అనే ప్రవక్త వెల్లడించాడు ‘యెరూషలేము నివాసులారా, ఉల్లాసముగా ఉండుడి; నీ రాజు నీతిపరుడును రక్షణగలవాడును దీనుడునై, గాడిదను, గాడిద పిల్లను ఎక్కి నీయొద్దకు వచ్చుచున్నాడు (జెకర్యా 9:9) అని తెలిపాడు. ఆనాటి సాంప్రదాయం ప్రకారం ప్రజలు రాజు పట్ల తమ విధేయతను చూపుతూ తమ వస్త్రములు, చెట్ల కొమ్మలు వీధులలో పరిచి యేసుకు స్వాగతం పలికారు. అయితే రాజుగా యెరూషలేము వీధులలో పర్యటించిన యేసు నేరుగా తన రాజభవనమైన దేవుని మందిరానికి వెళ్లాడు. దేవుని ఆలయమే ఆయన రాజభవనం, దేవుని కుమారుడైన యేసును అక్కడే ప్రజలు ఆరాధిస్తారు, స్తుతిస్తారు.


విముక్తినిచ్చే రక్షకుడు..

దురదృష్టకరమైన విషయమేమిటంటే ప్రజలు యేసును తమ బానిసత్వం నుంచి విమోచించే రాజుగా భావించారు తప్ప, తమ పాపముల నుండి విమోచించే రక్షకుడు ఆయనేనని తెలుసుకోలేదు. తమను పాలిస్తున్న రోమా చక్రవర్తిపై తిరుగుబాటుకు యేసు నాయకత్వం వహిస్తాడని వారు ఆశించారు. అందుకే వారు ప్రభువు పేరిట వచ్చు వాడు హోసన్నా (రక్షకుడు) అని గట్టిగా నినాదాలు చేశారు. కానీ యేసు వారి ఆశలను విఫలం చేశాడు. రోమన్ దురాక్రమణదారులపై తిరుగుబాటుకు యేసు నిరాకరించాడు. దీంతో అప్పటివరకు ఆయనను హోసన్నా అని పొగిడిన ప్రజలే యేసును ‘సిలువ వేయండి’ అని కేకలు వేశారు. యేసు విజయోత్సవ ప్రవేశము ఓ విచిత్రమైన ఘటన. భూలోకపు రాజులకు భిన్నంగా యేసు ఒక గాడిదపై ఎక్కి వచ్చాడు. పుర వీధులలో హంగు ఆర్భాటాలకు భిన్నంగా, ఎర్ర తివాచీలకు బదులుగా ఆయన నడిచిన దారిలో పేదలు, దీనులు తమ వస్త్రాలు పరిచారు. దీనిని బట్టి యేసు భూలోక రాజుల లాగా యుద్ధాలు చేసి గెలువడానికి కాకుండా తన ప్రేమ, కరుణ, జాలితో ప్రజలను గెలువడానికి వచ్చాడని విదితమవుతుంది. తన ప్రజల కొరకు ప్రాణం పెట్టే రాజుగా ఆయన వచ్చాడు. ఆయన రాజ్యం గొప్ప సైన్యాలు, వైభవంతో కూడినది కాదు కానీ దీనత్వము, సేవా దృక్పథంతో కూడినది. ఆయన దేశాలను కాకుండా హృదయాలను గెలుచుకున్నాడు. దేవునితో సమాధానపడాలని ఆయన సందేశమిచ్చాడు. మన హృదయాలలో యేసు జయప్రవేశం చేస్తే తన ప్రేమ, శాంతితో ఆ మనస్సులను పరిపాలిస్తాడు.

... జాషువా

ఖురాన్ మాట

విలువలులేని జీవితం నిరర్థకం



జీవితం విజయ పథంలో ముందుకు సాగాలంటే మానవుల్లో కొన్ని విలువలు ఉండాలి. మంచీ చెడుల పట్ల విచక్షణ ఉండాలి. నిజానికి ప్రతి ఒక్కరిలో ప్రాథమికంగా ఈ విలువలు నిక్షిప్తమై ఉంటాయి. కావలసిందల్లా వీటిని వెలికితీసి నిత్య జీవితంలో ఆచరణలో పెట్టగలగడమే. అంటే జీవితంలోని అన్ని రంగాల్లో విలువలు పాటించగలగాలి. సాధ్యమైనంతవరకు శక్తివంచన లేకంపడా విలువలతో కూడిన జీవితం గడపడానికి ప్రయత్నించాలి. ఎట్టి పరిస్థితిలోనూ తమను తాము గొప్పగా, ఇతరుల్ని తక్కువగా భావించకూడదు. మనతో ఏకీభవించని వారిపట్ల కూడా సద్భావనతోనే మెలగాలి. ఎందుకంటే అభిప్రాయ భేదాలన్నవి మానవ సమాజంలో సహజం. దాన్ని భూతద్దంలో ఎంతమాత్రం చూడకూడదు. అలా చేయడం విలువలకు వ్యతిరేకం అవుతుంది.

జీవితంలో ఏది సాధించాలన్నా ఈనాడు ధనమే ప్రధానమైపోయింది. మంచీ చెడు, విలువలు అని మడి కట్టుకుంటే ఈ ప్రాపంచిక పరుగు పందెంలో వెనుకబడి పోవడం ఖాయమన్న భావన బలపడింది. బాగా డబ్బు గడించి విలాసవంతమైన జీవితం గడుపుతున్నవారితో పోల్చుకొని నిరాశకు గురవుతూ ఉంటాం. ఇదే దురాశకు దారితీసి, జీవితంలో శాంతి లేకుండా చేస్తుంది. చట్ట సమ్మతమైన, ధర్మబద్ధమైన మార్గంలో ఎంత సంపాదించినా ఎవరికీ అభ్యంతరం ఉండదు. అది ఆమోద యోగ్యమే. అయితే సంపాదనే లక్ష్యంగా దొడ్డిదారుల్లో సంపాదించాలనుకుంటే తరువాత చేదు అనుభవాలను రుచి చూడవలసి ఉంటుంది. ఇలా సాధించిన సంపాదనా, సోపానాలు కేవలం తాత్కాలికమే తప్ప శాశ్వతం కాదు. అంతేకాదు, అది జీవితంలో అశాంతికి, అభద్రతకు, అపజయాలకు కారణమవుతుంది.

పేరు ప్రఖ్యాతుల కోసం, అధికారం, హోదాల కోసం సంపాదనకు వక్రమార్గాలు అవలంబిస్తే కచ్చితంగా మనశ్శాంతి దూరమవుతుంది. విజయం దరి చేరినట్లనిపించినా అది నీటి బుడగతో సమానం. అసలు విజయం, నిజమైన శాంతి సంతృప్తి నైతిక విలువలతోనే సాధ్యం. ఇహలోక విజయమైనా, పరలోక సాఫల్యమైనా విలువలకు తిలోదకాలు ఇవ్వకుండా మంచీ చెడుల విచక్షణా జ్ఞానంతో ధర్మబద్ధమైన జీవితం గడిపితేనే. అందుకే ముహమ్మద్ ప్రవక్త (స) మానవ జీవితంలో నైతిక విలువలకు అత్యంత ప్రాముఖ్యతనిచ్చారు. ‘నైతికత రీత్యా మీలో ఎవరు ఉత్తములో వారే అందరికన్నా శ్రేష్ఠులని, ప్రళయదినాన విశ్వాసి కర్మల త్రాసులో ఉత్తమ నడవడి కన్నా బరువైన, విలువైన వస్తువు మరొకటి ఉండద’ని అన్నారాయన. ప్రజల్ని ఎక్కువగా స్వర్గానికి తీసుకుపోయే కర్మలు ‘దైవభీతి, నైతిక విలువలే’ అని ఉపదేశించారు.

కనుక నిత్య జీవితంలో అనైతికతకు, అక్రమాలకు తావు లేకుండా సాధ్యమైనంతవరకు శక్తివంచన లేకుండా విలువలతో కూడిన జీవితం గడపడానికి ప్రయత్నించాలి. అప్పుడు మాత్రమే సమాజంలో ఆదరణ, గౌరవం లభిస్తాయి. దేవుడు కూడా మెచ్చుకుని, మంచి ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాడు.

... మదీహా అర్జుమంద్

నమస్తే తెలంగాణ
విహారం
[హైదరాబాద్]
శుక్రవారం 23 మార్చి 2018

ట్రావెలాగ్ -12

ఆణి 'ముత్యాలు'



లంచ్ టైం కాబట్టి మా బస్సు అనేక రెస్టారెంట్స్ ఉన్న ఓ వీధిలో ఆగింది. లంచ్ తర్వాత పెర్ల్ స్టోర్‌కి వెళ్లాలని చెప్పాడు హేరిస్. 'వెజిటేరియన్ భోజనం ఎక్కడ దొరుకుతుంది?' హేరిస్‌ని అడిగాను. 'చైనాలో శాకాహారాన్ని తినే చక్కటి మార్గం క్యారట్లు పెట్టి పెంచిన కుందేలుని తినడమే..' నవ్వుతూ అని.. ఈ పక్కనే పీజా హట్ ఉంది. అక్కడ ప్రయత్నించండి అని చెప్పాడు హేరిస్. అత్యధిక శాకాహారులు గల దేశం ఇండియా. దాదాపు 40 శాతం మంది శాకాహారులే. అన్ని రెస్టారెంట్స్ రద్దీగా ఉన్నాయి. చైనీస్ యువత అధికంగా కనిపించారు. స్మాల్ ఛీజ్ పీజా, గార్డెన్ పీజా తిన్నాం. చాలా రుచిగా ఉన్నాయి. ప్రమోషన్ కోసం అనుకుంటా మంచినీళ్లకి బదులుగా కోక్ ఉచితంగా ఇచ్చారు. బిల్ చెల్లించాక టిప్ ఇస్తే, ఆమె టిప్స్ పద్ధతి లేదని చెప్పి తీసుకోలేదు.

చాలామంది చాప్ స్టిక్స్‌ని ఉపయోగిస్తున్నారు. చైనాలో ఏటా 650 కోట్ల చాప్ స్టిక్స్‌ని వినియోగిస్తున్నారు. ఇందుకు రెండు కోట్ల ఇరవై లక్షల వృక్షాలు అవసరం అవుతాయి. చాప్‌స్టిక్స్ ఉపయోగానికి ఓ నియమావళి ఉంది. వాటిని ఇంకో మనిషి వైపు చూపిస్తూ ఊపకూడదు. వాటితో టేబిల్ మీద కొట్టకూడదు. ప్లేట్స్, బౌల్స్‌ని వాటితో తోయకూడదు. అతిథికి సర్వ్ చేసేటప్పుడు చాప్‌స్టిక్స్‌ని వెనక్కి తిప్పి దాంతో అతిథి ప్లేట్లలో వడ్డించాలి. గిన్నెలోని పదార్థాన్ని తీసుకునేటప్పుడు కెలక్కుండా పైది మాత్రమే అదీ మన ప్లేట్ వైపు ఉన్నదే తీసుకోవాలి. చాప్ స్టిక్స్‌ని రైస్ బౌల్‌లో పైకి గుచ్చి ఉంచకూడదు. కర్మకాండల సమయంలోనే భోజనంలో ఇలా గుచ్చుతారు. వాడనప్పుడు చాప్‌స్టిక్స్‌ని ఒకదాని పక్కన ఒకటి బల్ల మీద ఉంచాలి.

అరుదైన నలుపు ముత్యాలు

లంచ్ తర్వాత మా కోచ్ మధ్యాహ్నం రెండు గంటలకి 'బేగ్ ఫూచున్ పెర్ల్ స్టోర్' ముందు ఆగింది. ఆ చిన్న దుకాణంలో ఫ్రెష్ వాటర్ ముత్యాలు, సముద్రపు నీటి ముత్యాలు అమ్ముతున్నారు. లోపలికి వెళ్లగానే చేతికి గ్లవ్స్ తొడుక్కున్న ఓ చైనీస్ గైడ్ మమ్మల్ని పక్కనే ఉన్న ఓ డిమాన్‌స్ట్రేషన్ హాల్‌లోకి తీసుకెళ్లింది. అక్కడ ఉన్న కుర్చీల్లో మేము కూర్చున్నాక, కొన్ని ముత్యపు చిప్పలని, వాటికి ఉన్న వలయాలని చూపించి వలయాలు వాటి వయసుని సూచిస్తాయని, వాటికి ఎన్ని వలయాలుంటే అన్నేళ్లని చెప్పింది. వలయాలు 5-7-10 ఇలా ఉన్నాయి.

'ముత్యాల్లో ఎన్ని రకాలు ఉన్నాయి?' మమ్మల్ని ప్రశ్నించింది. వెంటనే నవ్వుతూ తనే సమాధానం చెప్పింది.

'రెండు రకాలు. ఒకటి కొనేవి. రెండోది మనకి ఉచితంగా వచ్చేవి. ఔనా.. కాదు. ముత్యాల్లో ఒరిజినల్, కల్చర్డ్ అని రెండు రకాలున్నాయి. ఇవి తెలుపు, పింక్, గోల్డెన్ బ్రౌన్, బ్లాక్ రంగుల్లో లభిస్తాయి. ఇక్కడ దొరికేవన్నీ అసలైన ముత్యాలే. నకిలీవి, అంటే కల్చర్డ్‌వి మేము అమ్మం. మీకు నచ్చినవి కొని బీజింగ్‌కి గుర్తుగా తీసుకెళ్లండి. షాపు మీ కోసం ఎదురు చూస్తోంది. ఎక్స్‌ప్లోర్ చేయండి'

ఫేక్ మార్కెట్

అంతా షాప్‌లోకి నడిచాం. అనేక రకాల డిజైన్లలో ఉంగరాలు, గాజులు, బ్రేస్‌లెట్స్, నెక్లస్‌లు ఉన్నాయి. నల్ల ముత్యాల కోసం నేను చాలా కాలంగా ప్రయత్నిస్తున్నాను కాబట్టి అవి ఉన్నాయా అని అడిగితే, కల్చర్డ్‌వి మాత్రమే ఉన్నాయని, నిజమైనవి అరుదుగా దొరుకుతాయని, వాటి ధర చాలా ఎక్కువని సేల్స్ గర్ల్ చెప్పింది. పిల్లల కోసం మూడు తెల్ల ముత్యాల నెక్లస్‌లని కొన్నాం.

ముత్యాల్లో ఒరిజినల్, కల్చర్డ్ అని రెండు రకాలున్నాయి. ఇవి తెలుపు, పింక్, గోల్డెన్ బ్రౌన్, బ్లాక్ రంగుల్లో లభిస్తాయి. ఇక్కడ దొరికేవన్నీ అసలైన ముత్యాలే.

అరగంట కంటే ఎక్కువ సేపే అక్కడ గడిపాం. మధ్యాహ్నం రెండూ నలభైకి పెర్ల్ ఫ్యాక్టరీ నించి తర్వాతి మజిలీ అయిన సమ్మర్ ప్యాలస్‌కి బయలుదేరాం. దారిలో హేరిస్ బస్‌లో నుంచి ఒక బిల్డింగ్‌ని చూపించి, అందులో అన్ని అంతర్జాతీయ బ్రాండ్ల నకిలీ వస్తువులు అతి చవకగా లభిస్తాయని, అవి అసలువో, నకిలీవో తెలుసుకోవడం కష్టం అని, దాని పేరే ఫేక్ మార్కెట్ అని చెప్పాడు. అమెరికన్ బ్రాండ్స్ నకిలీ వస్తువులని చైనా ప్రపంచవ్యాప్తంగా అమ్మడం మీద వివాదం కూడా ఉంది. లేబర్ చవక కాబట్టి అమెరికన్ కంపెనీలు వాటిని చైనాలో తయారుచేయిస్తున్నాయి. దాన్ని చైనీస్ తమ ప్రయోజనానికి వాడుకుంటున్నారు.

(ఇంకా ఉంది)

... మల్లాది వెంకట కృష్ణమూర్తి

తెలంగాణా క్షేత్రం



వరాలను ప్రసాదించే శ్రీరామచంద్రమూర్తి... పాపాలను పునీతం చేసే గౌతమీ నది... రెండు పవిత్రతలు, రెండు ప్రత్యేకతలు కలిసిన ప్రదేశం మరెక్కడా లేదు. అదే ఈ భద్రాద్రి ప్రత్యేకత. వేదంలా ఘోషించే పావన గౌతమి భక్తులను పరిశుద్ధం చేస్తుందని భావన. భద్రాద్రి పుణ్యక్షేత్రంలో ఆచరించే స్నాన, దాన, తపో యజ్ఞాలు కోటి రెట్ల ఫలితాలు ఇస్తాయని భక్తుల నమ్మకం.

కలియుగ వైకుంఠం..
భద్రాద్రి

భద్రాచలంలో స్వామివారు సీత, లక్ష్మణుల సమేతంగా చతుర్భుజుడుగా వెలిశాడు. పశ్చిమ అభిముఖంగా ఉండి గోదావరిని వీక్షిస్తూ పద్మాసనంలో వామాంకంపై సీతమ్మవారు కూర్చొని దర్శనమిస్తారు. ప్రపంచంలో మరెక్కడ ఇలా రామయ్యస్వామి దర్శనం కలగదు. ఒక్కసారి భద్రాద్రిని దర్శించుకుంటే కోటి రెట్ల పుణ్యఫలం దక్కుతుందని బ్రహ్మ పురాణంలో ఉంది.

భద్రాద్రి స్థల పురాణం..

భద్రాద్రిలో కొలువైన రాముడిని వైకుంఠ రాముడిగా కొలుస్తారు. శ్రీరాముడు అరణ్యవాసంలో ఉన్నప్పుడు తనను సేదతీర్చిన భద్రుడిని కరుణించి ఇక్కడ వెలిశాడని ప్రతీతి. భద్రుడికిచ్చిన వరాన్ని మరిచి శ్రీరామావతారం అనంతరం వైకుంఠానికి వెళ్లి పోతాడు. ఆ తరువాత భద్రుడు ఘోర తపస్సు చేయడం మూలాన వైకుంఠం నుంచి బయలుదేరిన శ్రీరాముడు కుడిచేతిలో ధరించాల్సిన చక్రం ఎడమ చేతిలో, ఎడమ చేతిలో ధరించాల్సిన శంఖువు కుడిచేతిలో ధరించి ధనుర్బాణాలతో వచ్చి భద్రాద్రిలో వెలిశాడని స్థల పురాణం చెబుతున్నది. శంఖు చక్రాలతో నారాయణుడిగా, ధనుర్బాణాలు కలిగిన శ్రీరామ నారాయణుడిగా భద్రాదిలో దర్శనమిస్తాడు. మహా విష్ణువు అవతారంలో వెలిసిన శ్రీరాముడు తన ఆత్మను ఇక్కడే పదిలపరిచాడు కాబట్టి ఆత్మారాముడిగా ఖ్యాతి గడించాడు. భద్రుడి కోర్కెపై పవిత్రగోదావరి తీరంలో భద్రుడి హృదయ స్థానంలో దివ్య రూపాన్ని ఆవిష్కరించాడు. ఆ కారణం చేతనే ఈ పుణ్యక్షేత్రానికి భద్రాచలం అనే పేరు వచ్చింది.

భద్రాద్రిలో అడుగడునా ఆలయాలే..

భద్రాద్రిలో అష్ట దిక్కులలో ఆలయాలే ఉన్నాయి. గోవిందరాజస్వామి , ఈశ్వరమ్మ ఆలయం, రంగనాయక స్వామి, హరనాథబాబా ఆలయం, శివాలయం, రామలింగేశ్వరస్వామి, నృసింహస్వామి ఆలయం, అభయ ఆంజనేయస్వామి ఆలయం.. ఇలా భద్రాది నిండా ఆలయాలే. కాశీలో 1000 మందికి అన్నదానం చేస్తే ఎంత పుణ్యం లభిస్తుందో భద్రాచలంలో 5 గురికి అన్నదానం చేసిన అంతే పుణ్యఫలం లభిస్తుందని ఇక్కడి ప్రతీతి. దక్షిణ ఆయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం పట్టణంలో అడుగుపెట్టగానే అడుగడునా దైవాత్మకత ఉట్టిపడే దేవతా శిల్పాలు కనపడుతుంటాయి. భద్రాద్రిలో అడుగుపెట్టగానే స్వాగతం పలుకుతున్నట్టు అంజనేయస్వామి భారీ విగ్రహం కనపడుతుంది. కరకట్టపై నడుస్తుంటే గోదావరి గలగలలు , శ్రీరామ నామస్మరణతో మన సంతా భక్తిపారవశ్యంతో తడిసిపోతుంది. రామాలయంలో చుట్టూ ఆళ్వారులు కొలువై ఉంటారు. వైష్ణవ సంప్రదాయం ప్రకారం వీరికి ప్రతిరోజు పూజలు నిర్వహిస్తారు.

రాములోరి కల్యాణం కమనీయం.. రమణీయం..

జగదభిరాముని కల్యాణం చూడటానికి వేయి కన్నులు చాలవు. అన్యోన్య దంపతులంటే సీతారాములు. ప్రేమకు చిహ్నం ఈ జంట. సీతారామ కల్యాణ సమయంలో భద్రాద్రి భక్తులతో కిటకిటలాడుతుంది. పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. మొదటగా మూలవిరాట్‌లకు కల్యాణం నిర్వహిస్తారు. అక్కడినుంచి స్వామి వారిని పల్లకిలో మిథిలా స్టేడియానికి తీసుకు వస్తారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేసి కల్యాణానికి ఉపయోగించే సామగ్రికి సంప్రోక్షణ నిర్వహిస్తారు. అనంతరం రక్షబంధనం, మోక్ష బంధనం, నిర్వహిస్తారు. వధూవరుల వంశాల గోత్రాలను పఠించి స్వామి పాద ప్రక్షాళన అనంతరం పరిమళ భరితమైన తీర్థంతో మంత్రోక్తంగా పుష్పోదక స్నానం చేయిస్తారు. గోదానం చేసి మహా సంకల్పం చదువుతారు. అభిజిత్ లగ్నం సమీపించగానే జీలకర్ర బెల్లం మిశ్రమాన్ని సీతారామచంద్రమూర్తిపై తలపై ఉంచుతారు. మాంగల్య పూజలో మంగళ సూత్రాలతో ముగ్గురు అమ్మవార్లను ఆవాహన చేస్తారు. అనంతరం భక్త రామదాసు చేయించిన మంగళసూత్రాన్ని ధరింపచేయడంతో మంగళ సూత్రధారణ పూర్తవుతుంది. ఈ తంతును ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. అనంతరం ప్రభుత్వం వారు సమర్పించే తలంబ్రాలను పోస్తారు.


పన్నెండేళ్లకొకసారి పట్టాభిషేకం..



సీతారాములకల్యాణం జరిపిన తర్వాతి రోజున స్వామి వారికి పట్టాభిషేకం నిర్వహిస్తారు. మొదట్లో పట్టాభిషేకాన్ని అరవై సంవత్సరాలకు ఒకసారి నిర్వహించేవారు. 1927లో ఒకసారి పట్టాభిషేకం నిర్వహిస్తే మళ్లీ 1987లో నిర్వహించాల్సి వచ్చింది. అరవై సంవత్సరాలకు ఒకసారి పట్టాభిషేకం చేయడం వలన చాలామంది భక్తులకు స్వామివారి పుణ్యఫలం దూరమైపోతుందనే భావనతో ఆలయ ప్రధాన పురోహితులు 60 సంవత్సరాలను కాస్తా 12 సంవత్సరాలకు కుదించారు. లోకంలో అన్ని దేవుళ్లకు కల్యాణం నిర్వహిస్తారు. కానీ భద్రాద్రిలో కల్యాణంతో పాటు పట్టాభిషేకం చేయడం ఈ క్షేత్రం గొప్పతనం.

చక్రస్నానం చేస్తే...

తిరు కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా పావన గౌతమీ నదిలో స్వామివారి సుదర్శన చక్రానికి చక్ర స్నానం చేయిస్తారు. చక్రస్నానంతో పాటు భక్తులు గోదావరిలో స్నానమాచరిస్తే మూడున్నర కోట్ల తీర్థాలలో మునిగిన పుణ్యం వస్తుందని భక్తులకు నమ్మకం. అంతేకాదు రామాలయంలో దీపాలంకరణ చేస్తే సకల సంపదలు కలుగుతాయని ప్రతీతి. భద్రాద్రికి వచ్చిన ప్రతిఒక్కరూ దీపాలంకరణలో పాల్గొనడమూ ఇక్కడ విశేషమే.



వాగ్గేయకారోత్సవాలు..

రామదాసు కీర్తనలు అమోఘమైనవి. రామదాసు స్వయంగా రాసి ఆలపించిన కీర్తనలు అవి. రామదాసు స్మారకార్థమే భద్రాచలంలోని రంగనాయకుల గుట్టపై 1962లో రామదాసు ధ్యాన మందిరం అప్పటి ఉప రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ శంకుస్థాపన చేశారు. ధ్యానమందిరం విశాలంగా ఉంటుంది. మందిరం మధ్యలో సీతారామచంద్రామూర్తి విగ్రహం చూడముచ్చటగా ఉంటుంది. మందిరం నాలుగు గోడలూ కీర్తనలతో నిండి ఉంటాయి. రామదాసుకు గుర్తుగా ప్రతియేటా వాగ్గేయకారోత్సవాలు నిర్వహిస్తారు.

భద్రాద్రిలో ఉత్సవాలు..

వైకుంఠ ఏకాదశి సందర్భంగా అధ్యయనోత్సవాలు నిర్వహిస్తారు. వైకుంఠ ఏకాదశి ముందురోజు గౌతమీ నదిలో హంస వాహనంపై ఘనమైన తెప్పోత్సవం నిర్వహిస్తారు. తెప్పోత్సవానికి 1940లో పాలక మండలి సభ్యులు అల్లూరి మూర్తిరాజు శ్రీకారం చుట్టారు. మొదట్లో చిన్న తెప్పపై నిర్వహించారు. కాలక్రమేణా హంసవాహనం పై నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాన్ని చూడటానికి వేలాది మంది భక్తులు గౌతమీ తీరానికి చేరుకుంటారు. బాణసంచా పేలుళ్లు, విద్యుత్ కాంతుల వెలుగులో స్వామివారి తెప్పోత్సవం చూడముచ్చటగా ఉంటుంది. ప్రతి జ్యేష్ఠ పౌర్ణమి నాడు ఎనభై ఒక కలశాలతో నింపిన గోదావరి జలాలతో స్వామివారికి జ్యేష్ఠాభిషేకం చేస్తారు. శ్రీరామ నవమి సందర్భంగా స్వామివారికి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా నిర్వహించే ధ్వజరోహణ సమయంలో ఇచ్చే తీర్థ ప్రసాదాలు స్వీకరించి ఆరోజు ఉపవాసం ఉంటే సంతానం లేనివారికి సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆ రోజు మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు.

... షేక్ జాఫర్,
భద్రాద్రి కొత్తగూడెం డెస్క్


మిథిలా స్టేడియం కళా నైపుణ్యం..

సీతారామచంద్రస్వామి కల్యాణాన్ని మిథిలా స్టేడియంలో నిర్వహిస్తారు. రామయ్య కల్యాణానికి ఎంత ప్రాముఖ్యత ఉందో మండపానికీ అంతే ప్రాధాన్యముంది. కల్యాణ మండపాన్ని 1964లో ఏప్రిల్ 6న నీలం సంజీవరెడ్డి ప్రారంభోత్సవం చేశారు. తమిళనాడుకు చెందిన గణపతి స్థపతి అనే ప్రముఖ శిల్పకారుడు మిథిలా స్టేడియాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. మండపానికి ఇరువైపులా ఏనుగు శిల్పాలు స్వాగతం పలుకుతాయి. సూక్ష్మమైన అంజనేయస్వామి విగ్రహాన్నీ ఎంతో సుందరంగా చెక్కాడు. మండపం పైభాగంలోని శిల్పాలు.. ఋషులు, మునులు, సురుల సమక్షంలో రామయ్య కల్యాణ వైభోగం కళ్లకు కట్టినట్టు ఉంటుంది. రామయణంలోని ప్రధాన ఘట్టాలు, కోలాటమాడే దేవకన్యలు, 13 పద్మదళాలు, అష్ట దిక్పాలకులు, అష్టలక్ష్మీ దేవతలు, గరుత్మంతుడు, మహా సాలభంజికల శిల్పాలు అందంగా అలరిస్తాయి.

రామయణ దృశ్యాలు మనోహరం:

గోదావరి తీరంలోని కరకట్టకు దిగువ భాగంలో బాపురమణలు రూపొందించిన రామాయణ దృశ్యాలు మనోహరంగా ఉంటాయి. రామాయణంలోని ప్రధాన ఘట్టాలు, సీతమ్మ తల్లి మాయ లేడిని చూపుట, తాటకి వధ, రావణాసుర వధ, మొదలైన విగ్రహాల రూపంలో రామయణం కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది.

రాముడు నడియాడిన ప్రదేశాలు..



పర్ణశాల...

భద్రాచలం పుణ్యక్షేత్రానికి 35 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది పర్ణశాల. శ్రీరాముడు వనవాస సమయంలో చివరి మూడు సంవత్సరాలు ఇక్కడ నివాసం ఉన్నట్లు పురాణాలు చెబుతాయి. భద్రాచలం తర్వాత అంతటి ప్రాముఖ్యం ఉన్న ప్రదేశం పర్ణశాల. భద్రాచలం వచ్చిన భక్తులు తప్పనిసరిగా పర్ణశాల కుటీరాన్ని దర్శించుకుంటారు. ఇప్పటికీ పర్ణశాల ప్రదేశంలో సీత రామచంద్రమూర్తి తిరుగాడిన ఆనవాళ్లు కనిపిస్తాయి. సీత రాములవారికి బంగారు లేడిని చూపించడం, రావణాసురుడికి భిక్ష వేయడం, రావణ వధ మొదలైన సన్నివేశాలు విగ్రహాల రూపంలో కనపడుతాయి.

లక్ష్మణ గుట్ట..

సీత దాహం తీర్చడానికి లక్ష్మణుడు ఓ గుట్టకు బా ణం విసిరి నీరు తెప్పించాడని కథ ప్రచారంలో ఉం ది. ఇప్పటికీ ఆ ప్రదేశం గుండా నీరు ప్రవహిస్తోంది. అందువలన దానిని లక్ష్మణ గుట్ట అని పిలుస్తారు.

సీతమ్మవారిని రావణాసురుడు అపహరించుకుని రథంలో గుట్టపైకి వెళ్లాడనేది తెలిసిన కథే. ఇప్పటికీ ఆ రథం ఆనవాళ్లు కనిపిస్తాయి. అమ్మవారు స్నానం చేసిన వాగు సీతమ్మవాగుగా ప్రసిద్ధిగాంచింది. సీతమ్మ ఆరబెట్టిన నార చీరల గుర్తులూ కనిపిస్తాయి. అమ్మవారు కాలక్షేపం కోసం ఆడిన వామన గుంటలు, రామయ్య సేదతీరిన సింహాసనమూ కనిపిస్తాయి. పర్ణశాలలో ఒక ప్రత్యేకత ఏమిటంటే... శూర్పణఖ గుట్టకు రాళ్లను కొట్టడం. ఈ గుట్టను కొట్టడం వలన పాపాల నుంచి విముక్తి లభిస్తుందని భక్తుల నమ్మకం. అందుకే పర్ణశాలకు వెళ్లినవారెవరైనా శూర్పణఖ గుట్టకు తప్పనిసరిగా రాళ్లు వేస్తారు.

జటాయువు మండపం..

భద్రాచలానికి మూడు కిలోమీటర్ల దూరంలో యటపాక గ్రామంలో జటాయువు మండపం ఉంటుంది. రా వణాసురుడు సీతమ్మవారిని అపహరించుకుని వెళ్తుండగా జటాయువు పక్షి పోరాడిన సమయంలో దాని రెక్క విరిగి ఈ ప్రాంతంలో పడిందని స్థల పురాణం చెబుతోంది.

ఉష్ణగుండాల..

గోదావరి ఇసుక తిన్నెలపై ఉంటుంది ఉష్ణగుండాల. వనవాస సమయంలో సీతమ్మ కోసం రామయ్య ఉష్ణగుండాలలో వేడినీటి బావిని తవ్వించాడని పురాణాలు చెబుతున్నాయి. ఇప్పటికీ ఇక్కడ వేడినీరు వస్తుంటుంది. శ్రీరామనవమి రోజుల్లో ఈ ప్రదేశంలో కూడా భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తారు.

'కింగ్' కోఠి

చారిత్రక హైదరాబాద్ ఎన్నో అందమైన కట్టడాలకు నిలయం. వాటిలో కింగ్ కోఠి ప్యాలెస్ కూడా ఒకటి. ఇంతకీ ఈ భవంతి విశేషాలేమిటో.. అసలీ ప్రాంతానికి కోఠి అనే పేరెలా వచ్చిందో తెలుసా?



ఏడో నిజాం మీర్ ఆస్మాన్ అలీఖాన్ కాలంలో కమల్ ఖాన్ అనే వ్యాపారి ప్యాలెస్‌ను నిర్మించాడట. నిజాం నవాబు ప్యాలెస్ ఎంతగానో నచ్చిందట. దీంతో కమల్ ఖాన్ తానెంతో ఇష్టపడి కట్టుకొన్న భవంతిని నిజాం ప్రభువుకు అమ్మేశాడు. 1911లో తండ్రి నుంచి రాజ్యాధికారాన్ని అందుకొని ఉస్మాల్ అలీఖాన్ ఇందులోకే అడుగుపెట్టాడట. అప్పటి వరకూ తన తండ్రి నివాసముండే చౌమల్లా ప్యాలెస్ వెళ్లలేదట. కమల్‌ఖాన్ తనకొరకు నిర్మించుకున్నాడు గనుక ప్యాలెస్‌లోని దర్వాజలు, కిటికీలు, ఆర్చ్‌లకు కె అనే ఆంగ్లో అక్షరం చెక్కించుకున్నాడు. నిజాం స్వాధీనంలోకి వచ్చాక దానికి మరో కె అక్షరాన్ని జత చేసి కె కె గా మార్చారు. కె కె అంటే కింగ్ కోఠి అని అర్థం వచ్చేలా చేశారు. అంతే కాదు నిజాం తన అధికారిక నివాసంగా ఈ ప్యాలెస్‌నే ఉపయోగించేవాడట. అలా కింగ్ కోఠి ప్యాలెస్ పేరుమీదే ఈ ప్రాంతానికి కోఠి అనే పేరు స్థిరపడిందని చెబుతారు. ఈ భవంతిలో విలువైన రత్నాలు, మణిమాణిక్యాలతో పాటు వజ్రవైఢూర్యాలతో కూడిన ఇనుప పెట్టెలను భద్రపరిచేవారట. ఆ కాలంలో నవాబులకు బహుభార్యత్వం ఉండేది. ప్రియురాళ్లు కూడా ఎక్కువగా ఉండేవారట. నవాబుల ప్రేయసిలు నివాసం ఉండే భవనాన్నే కోఠి అని పిలిచేవారట. ఈ ప్రాంతానికి కోఠి అనే పేరు అలా వచ్చిందేనని చెప్పేవారూ ఉన్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతం పెద్ద వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు కేంద్రంగా మారింది.

మీరు తరచుగా ప్రయాణాలు చేస్తుంటారా? దేశవ్యాప్తంగా ఊళ్లు చుట్టి వస్తుంటారా? పుణ్యక్షేత్రాలైనా, విహార యాత్రలైనా... వినోదం కోసమైనా, విజ్ఞానం కోసమైనా... మీరు చేసిన ప్రయాణం మాకెంతో ప్రియమైనది. మీ ప్రయాణానుభవాలు మరెందరికో ఉపయోగపడవచ్చు.

సరదాగా నిరంతర ప్రయాణాలు చేస్తున్నా, ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం అప్పుడప్పుడూ టూర్లు వెళ్తున్నా... మీరు వెళ్లిన ప్రదేశం, దాని విశిష్టత, అక్కడి మీ అనుభవాలు, వెళ్లడానికి కారణాలు... వివరంగా మాకు రాసి పంపండి. మీ భావాలూ, భావోద్వేగాలు, అనుభవాల సమాహారాన్ని పేపర్‌పై పెట్టండి. అక్షరబద్ధం చేయండి. అంతేకాదు.. మీ ఊళ్లో, మీ చుట్టుపక్కల ప్రదేశాల్లో ఏమైనా ప్రత్యేకతలున్నా, పుణ్యక్షేత్రాలూ, జాతరలూ, ప్రత్యేక సంప్రదాయాలున్నా మాకు తెలుపండి. మీ పేరుతో ప్రచురిస్తాం.

మరింకేం.. రాయడం మొదలుపెట్టండి.

మా చిరునామా
విహారం (నా ప్రయాణం), నమస్తే తెలంగాణ, తెలంగాణ పబ్లికేషన్స్ ప్రై. లిమిటెడ్, రోడ్ నెం. 10, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34.
viharam@ntnews.com

సుడోకు

డైలీ సుడోకు 157 సమాధానం

7	4	9	8	5	1	3	6	2
5	2	1	6	7	3	4	8	9
6	8	3	9	2	4	1	7	5
2	1	5	7	8	9	6	4	3
3	6	7	1	4	2	5	9	8
8	9	4	3	6	5	7	2	1
4	3	6	2	1	8	9	5	7
9	5	2	4	3	7	8	1	6
1	7	8	5	9	6	2	3	4

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -158

2	4				5			
3				2	4	6		9
	9		3			5		
	6		5			9		
7		3				4		1
				7	8			
		8	2			7	4	5
		5	8		3	1	6	2
1								

ట్వీట్



ఇది చాలు.. ఈ జీవితానికి ఇంతకన్నా ఇంకేం కావాలి?



తాప్సీ
@taapsee

తాప్సీని ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
3,400,662

కామన్‌మ్యాన్ వాయిస్

ఎవరతను నా దేశభక్తిని గుర్తించండి అని ఊగిపోతున్నాడు. స్వాతంత్ర్య సమరయోధుడా? కాదు. సమరయోధుని కొడుకా? కాదు. శాస్త్రవేత్తా? కాదు. మరింకేమిటి? పెద్దలు బ్యాంకులను ముంచి విదేశాలకు పారిపోయారు. కానీ తాను మాత్రం బ్యాంకులకు పెద్ద మొత్తంలో ముంచినా విదేశాలకు పారిపోకుండా దేశంలోనే ఉన్నాడు కాబట్టి దేశభక్తునిగా గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడు.

-Murali Buddha

ఇప్పటిదాకా మీ కల్పిత కథలు చూసినం. ఇప్పుడిప్పుడే మా తెలంగాణ నిజ జీవిత గాథలు చూస్తున్నం.

-Sai Pavan Kumar Vedula

వేదన వేపుడై వేయించుకు తింటూనే ఉంటుంది. వెటకారాన్ని వెంటతెచ్చుకొని తోడేలై తోడేస్తూనే ఉంటుంది. కుంగిపోతే జీవితం కుదేలైపోవాల్సిందే.. కన్నీటి అలల్లో కొట్టుకుపోవాల్సిందే! నిలబడితేనే జీవితం. ఎదురీదితేనే విజయం.

-Gajula Rameshkumar

వైరల్ వీడియో



కూరగాయల మార్కెట్‌లోనే రకరకాల జనాలుంటారు. మరి సూపర్ మార్కెట్‌లో పరిస్థితి ఏంటి? ఈ వీడియో చూడండి తెలుస్తుంది.

Types of People in a SuperMarket || Mahathalli

Total views : 298,505+

Published on Mar 21, 2018

టైటాన్స్ కలయికకు నాంది


రాజమౌళి


రామ్‌చరణ్


ఎన్టీఆర్

'బాహుబలి' అఖండ విజయం తర్వాత దర్శకుడు రాజమౌళి తదుపరి చిత్రమేమిటన్నది ప్రస్తుతం అందరిలో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. కొన్ని నెలల క్రితం రామ్‌చరణ్, ఎన్టీఆర్‌లతో తాను కలిసి వున్న ఓ ఫొటోను ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు రాజమౌళి. ఆ ఫోటో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లతో రాజమౌళి మల్టీస్టారర్ చేయబోతున్నారనే వార్తలు విస్తృతంగా ప్రచారం అయ్యాయి. దానయ్య నిర్మాతగా ఈ భారీ మల్టీస్టారర్ చిత్రాన్ని రాజమౌళి రూపొందిస్తారని ప్రచారం జరిగింది. దీనిపై ఇప్పటివరకు రాజమౌళి ఎలాంటి ప్రకటన చేయలేదు. గురువారం చిత్ర బృందం ఆర్‌ఆర్‌ఆర్ అనే మూడు ఇంగ్లీష్ అక్షరాల లోగోతో కూడిన వీడియో టీజర్‌ను విడుదల చేసింది. ఇందులో మూడు 'ఆర్' అక్షరాలు..రాజమౌళి, రామ్‌చరణ్, రామారావు పేర్లకు ప్రతీకలుగా వీడియో రూపొందించారు. భారీ మల్టీస్టారర్‌ను స్ఫురించేలా ఈ వీడియోను డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ డిజైన్ చేసింది. ఈ సినిమా గురించి రాజమౌళి ట్విట్టర్ ద్వారా అధికారిక ప్రకటన చేశారు. 'నవంబర్ 18, 2017 నుంచి మీరందరూ ఈ సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. భారీ మల్టీస్టారర్‌కు నాంది పలికాం. ఆర్‌ఆర్‌ఆర్ టైటిల్ కాదు. ముగ్గురు టైటాన్స్ అపూర్వ కలయికకు ప్రతిబింబం' అని రాజమౌళి ట్విట్టర్‌లో పేర్కొన్నారు. రామ్‌చరణ్‌కు 'మగధీర', ఎన్టీఆర్‌కు 'యమదొంగ' వంటి భారీ విజయాల్ని అందించారు రాజమౌళి. ఈ ముగ్గురి కలయికలో సినిమా రాబోతుండటం టాలీవుడ్‌లో ప్రాధాన్యతను సంతరించుకుంది.

ప్రతి ఒక్కరి కథ ఇది!

శ్రీవిష్ణు కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'నీదీ నాదీ ఒకే కథ'. వేణు ఊడుగుల దర్శకుడు. సాట్నా టైటస్ కథానాయిక. అరాన్ మీడియా వర్క్స్ మరియు శ్రీవైష్ణవి క్రియేషన్స్ పతాకంపై ప్రశాంతి, కృష్ణవిజయ్, అట్లూరి నారాయణరావు సంయుక్తంగా నిర్మించారు. నేడు ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. శ్రీవిష్ణు మాట్లాడుతూ 'దర్శకుడు కథ చెప్పినప్పుడు ఇదేదో నా కథలా ఉందనిపించింది. నన్ను గమనించి సినిమా కథ రాశారనుకున్నాను. ఈ సినిమా చేస్తే నా జీవితాన్ని సినిమాగా చూసుకోవచ్చనే భావన కలిగింది. చాలా మంది సమాజం కోసం చదువుకుంటారు. మనకు నచ్చిన పని చేయడానికి కుటుంబ సభ్యుల్ని ఒప్పించడానికి ప్రయత్నించాలి. తల్లిదండ్రులు పిల్లల్ని నమ్మాలి. వారే నమ్మకపోతే ప్రపంచం ఏం నమ్ముతుంది. సినిమాలో ఇదే అంశాన్ని చూపించాం. పరిశ్రమలోని చాలా మందికి ఈ సినిమా నచ్చింది' అని అన్నారు. 'ట్రైలర్ చూడగానే మార్నింగ్ షో చూడాలనిపించింది. సినిమా హక్కుల్ని తీసుకుంటే బాగుండేది కదా అనుకున్నాను. అప్పటికే బిజినెస్ పూర్తయిందని తెలిసింది. మంచి సినిమా మిస్ అయిందనే భావన కలిగింది. ఇది మనందరి కథలా అనిపించింది' అని శర్వానంద్ చెప్పారు. ఈ సినిమా చూసినప్పుడు తనకు 'ఆకలి రాజ్యం'లోని సన్నివేశాలు గుర్తొచ్చాయని, కలకాలం ప్రేక్షకుల మదిలో నిలిచిపోయే చిత్రమిదని దర్శకుడు జి.నాగేశ్వరరెడ్డి అన్నారు. నేటి యువత ప్రతి ఒక్కరికి కనెక్ట్ అయ్యే కథ ఇదని, అందరిలో ఆలోచనల్ని రేకెత్తిస్తుందని నారా రోహిత్ చెప్పారు. జీవితంలోని ప్రతి క్షణాన్ని ఆస్వాదించాలని చెప్పే సినిమా ఇదని దేవిప్రసాద్ పేర్కొన్నారు. కథానుగుణంగా సంగీతానికి చాలా ప్రాధాన్యం వుందని, సందేశాత్మక కథతో అందరిని ఆకట్టుకుంటుందని సంగీత దర్శకుడు సురేష్ బొబ్బిలి పేర్కొన్నారు.


దేవిప్రసాద్, నారా రోహిత్, శర్వానంద్, శ్రీవిష్ణు, సురేష్ బొబ్బిలి, వేణు ,కృష్ణవిజయ్.